CELEBRATING 11TH YEAR ANNIVERSARY
ప్రకటన కర్తలకు,పాఠకులకు, తెలుగు ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు పెన్‌పవర్ వారి
11వ వార్షికోత్సవ శుభాకాంక్షలు

# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 56 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ బుధవారం 7 జనవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 56 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD WED 7 JANUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## రేపటి తరాల భవిష్యత్ కోసమే హిల్ట్ పాలసీ..

### లేదంటే హైదరాబాద్‌కు ఢిల్లీ పరిస్థితి తప్పదు

- అవి సర్కారు భూములు కాదు.. పరిశ్రమలకు అమ్మినవి
- స్వచ్ఛమైన గాలి, నీరు ఇవ్వకుంటే మనది అసమర్థ నాగరికతే
- అభివృద్ధి అంటే ప్రకృతిని నాశనం చేయడం కాదు.
- భావితరాలకు క్లీన్ ఎన్విరాన్మెంట్ నిజమైన వారసత్వం ఓఆర్ఆర్ లోపల పరిశ్రమలతో ఆరోగ్యానికి ముప్పు అసెంబ్లీలో హిల్ట్ పాలసీ బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి శ్రీధర్ బాబు



హైదరాబాద్ పెన్ పవర్: హైదరాబాద్ నగరంలోని భూగర్భ జలాల్లో విషపూరిత పదార్థాలు ఉన్నాయని.. పారిశ్రామిక రసాయల వల్లే భూగర్భ జలాల్లో విషపూరిత పదార్థాలు చేరాయని మంత్రి శ్రీధర్ బాబు అన్నారు. ఇప్పటికీ మేల్కొకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ పరిస్థితి ఎదుర్కొవాల్సి వస్తోందని హెచ్చరించారు. ఇప్పుడు జాగ్రత్తలు తీసుకోకపోతే ప్రతి ఇంటికి ఒక ఆసుపత్రి ఉంటుందని కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం (జనవరి 6) అసెంబ్లీలో హిల్ట్ పాలసీపై షార్ట్ డిస్కషన్ నడిచింది. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. హిల్ట్ పాలసీ ద్వారా పారిశ్రామిక ప్రాంతం నివాస ప్రాంతంగా మారుతోందని.. సిటీలోని పరిశ్రమలను ఓఆర్ఆర్ అవతలివైపునకు తరలిస్తామన్నారు. ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాల్లో కాలుష్యం లేకుండా చేసేందుకు సీఎం యత్నిస్తున్నారని చెప్పారు. జీడీమెట్ల, ఉప్పల్, సనత్ నగర్, చర్లపల్లి ప్రాంతాలు గతంలో ఇండస్ట్రీయల్ జోన్లుగా జనవాసాలకు దూరంగా ఉండేవి కానీ 50 ఏళ్లలో హైదరాబాద్ మహానగరంగా విస్తరించిందని అన్నారు. ఒకప్పుడు నగర శివారు ప్రాంతాలు ప్రస్తుతం రెసిడెన్షియల్ కాలనీస్‌గా మారాయని.. ప్రస్తుతం పరిశ్రమలకు పక్కనే అపార్ట్ మెంట్లు ఉన్నాయని తెలిపారు. పరిశ్రమల నుంచి వచ్చే కాలుష్యాన్నిప్రత్యక్షంగా పీలుస్తున్నారని.. ఇండస్ట్రీలు, రెసిడెన్షియల్ ప్రాంతాలకు మధ్య బఫర్ జోన్లు లేవన్నారు. బఫర్ జోన్లు లేకపోవడం

వివరాలు 2లో..

## కాశీ ఎక్స్‌ప్రెస్ కు బాంబు బెదిరింపు



- గోరఖ్‌పూర్ నుంచి ముంబైకి ప్రయాణిస్తున్న రైలుకు బాంబు బెదిరింపు
- 'మౌ' స్టేషన్‌లో రైలును నిలిపి తనిఖీలు నిర్వహించిన అధికారులు
- ఎలాంటి అనుమానిత వస్తువులు లభ్యం కాలేదని వెల్లడి

వివరాలు 2లో..

## వెనెజువెలా సంక్షోభం... భారత్‌కు మేలు చేస్తుందంటున్న నిపుణులు!

- వెనెజువెలా సంక్షోభంతో భారత్ ఆయిల్ బిల్లుపై తక్షణ ప్రభావం ఉండదన్న నిపుణులు
- ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ సరఫరాలు మిగులు స్థాయిలో ఉన్నాయని వెల్లడి
- ఇతర దేశాలతో పోలిస్తే వెనెజువెలా నుంచి భారత్‌కు తక్కువ ధరకే చమురు
- అమెరికా జోక్యంతో భవిష్యత్తులో ధరలు తగ్గే అవకాశం ఉందని అంచనా

వివరాలు 2లో..






## రేవంత్‌కు కనీస భౌగోళిక జ్ఞానం కూడా లేదు

- సీనియర్లను తొక్కేసి సీఎం అయ్యాడని విమర్శ
- బీఆర్ఎస్ కు కడియం శ్రీహరి ద్రోహం చేశారన్న కేటీఆర్

హైదరాబాద్ పెన్ పవర్:వరంగల్ జిల్లా జనగామలో సర్పంచ్ ల సన్మాన కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన సీఎం రేవంత్ రెడ్డి, మాజీ మంత్రి కడియం శ్రీహరిపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్‌లో సీనియర్లను తొక్కేసి అడ్డదారిలో ముఖ్యమంత్రి అయిన రేవంత్... అసెంబ్లీలో, బయటా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. రేవంత్ తన గన్‌మెన్‌పై కూడా చేయి చేసుకునే స్థాయికి దిగజారారని, ఆయన పరిస్థితి పిచ్చి పట్టినట్లు ఉందని సెటైర్లు వేశారు. రేవంత్ భార్య గీతమ్మ ఆయన్ను కట్టేయాలి, లేకపోతే ఎవరినైనా కరిచే ప్రమాదం ఉందని అన్నారు.

సీఎం రేవంత్‌కు కనీస భౌగోళిక జ్ఞానం కూడా లేదని కేటీఆర్ ఎద్దేవా చేశారు. దేవాదుల ప్రాజెక్టు గోదావరిపై ఉందో, కృష్ణా నదిపై ఉందో... బాక్రానంగల్ ప్రాజెక్టు ఎక్కడ ఉందో కూడా తెలియని వ్యక్తి రాష్ట్రాన్ని పాలిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో సిగ్గులేని మాటలు, రోత చేతలు తప్ప రాష్ట్రానికి ఏమీ చేయలేదని దుయ్యబట్టారు.కేసీఆర్‌ను

వివరాలు 2లో..

## కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు



- దానం నాగేందర్, కడియం శ్రీహరి కాంగ్రెస్ లోకి వస్తారని ఎవరూ అనుకోలేదని వ్యాఖ్య
- కవిత కూడా కాంగ్రెస్‌లో చేరవచ్చని అభిప్రాయపడిన మల్‌రెడ్డి రంగారెడ్డి
- నాకు మంత్రి పదవి ఇవ్వండి అంటూ హైకమాండ్ కు విజ్ఞప్తి

హైదరాబాద్ పెన్ పవర్:తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితపై కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కవిత కాంగ్రెస్ పార్టీలో చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని అన్నారు. గతంలో దానం నాగేందర్, కడియం శ్రీహరి వంటి నాయకులు కాంగ్రెస్ పార్టీలోకి వస్తారని అనుకోలేదని, కానీ వారు వచ్చారని చెప్పారు.

వివరాలు 2లో..

## మదురో లాగే ప్రధాని మోదీని ట్రంప్ కిడ్నాప్ చేస్తారా?



- పృథ్వీరాజ్ చవాన్ వ్యాఖ్యలపై నెటిజన్లు ఆగ్రహం
- వెనెజువెలా సంక్షోభంపై మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపణ
- మదురోను కిడ్నాప్ చేసినట్లుగా, మరే దేశాధినేతకైనా ఇలా జరగవచ్చని వ్యాఖ్య

హైదరాబాద్ పెన్ పవర్::వెనెజువెలాలో నికోలస్ మదురోకు జరిగినట్లుగా భారతదే శంలో కూడా జరుగుతుందా? అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన ప్రధానమంత్రిని కూడా కిడ్నాప్ చేస్తారా? అని మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పృథ్వీరాజ్ చవాన్ ప్రశ్నించారు. ఆయన చేసిన

వివరాలు 2లో..

## ఏపీ లేకుంటే తెలంగాణ బతకలేదని ఒకరు చెప్పారు.. మేం ఎలా అభివృద్ధి చెందామో చూడండి

- తెలంగాణ ఏర్పడితే నీళ్లు, విద్యుత్ ఉండదని ఆ నేత చెప్పాడన్న అక్బరుద్దీన్
- ఆయన పేరు తాను చెప్పదలుచుకోలేదని వ్యాఖ్య
- కాంగ్రెస్ సీఎంగా ఆ మాటలు చెప్పి ఆ తర్వాత బీజేపీలో చేరారని వెల్లడి

వివరాలు 2లో..



హైదరాబాద్ పెన్ పవర్:ఆంధ్రప్రదేశ్ లేకుండా తెలంగాణ మనుగడ సాగించలే దని పన్నెండేళ్ల క్రితం ఒక నాయకుడు వ్యాఖ్యానించారని, అయితే ఈ కాలంలో తెలంగాణ ఎంతగా అభివృద్ధి చెందిందో

## భారీ భూకంపానికి చిగురుటాకులా వణికిన జపాన్?

- రిక్టర్ స్కేలుపై 6.2 పాయింట్ల తీవ్రత నమోదు
- ఊగిపోయిన భవనాలు, మెట్రో రైల్ స్టేషన్లు
- ప్రాణనష్టం జరగలేదని అధికారుల వెల్లడి



హైదరాబాద్ పెన్ పవర్:జపాన్ లో భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై భూకంప తీవ్రత 6.2 గా నమోదైంది. మంగళవారం ఉదయం పదిన్నర గంటల ప్రాంతంలో ఒక్కసారిగా భూమి కంపించింది. చుగోకు రీజియన్ లోని షిమానే ప్రిఫెక్చర్ లో భూకంప ప్రభావం ఎక్కువగా ఉందని అధికారులు తెలిపారు. భూ ప్రకంపనలు తీవ్రంగా

వివరాలు 2లో..

## టిక్కెట్ల కోసం నా వద్దకు ఎవరూ రావొద్దు

- సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని పిలుపునిచ్చిన జగ్గారెడ్డి
- మున్సిపల్ ఎన్నికల ప్రచారాని తనను పిలవొద్దన్న జగ్గారెడ్డి
- అధికారంలో ఉన్నామని పోలీసులను అడ్డుపెట్టుకుని గెలవాలని చూడవద్దని సూచన



హైదరాబాద్ పెన్ పవర్:రానున్న మున్సిపల్ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం తన వద్దకు ఎవరూ రావొద్దని కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలలో కాంగ్రెస్ జెండా ఎగురవేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంగారెడ్డిలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తనను మున్సిపల్ ఎన్నికల ప్రచారానికి పిలవొద్దని స్పష్టం చేశారు.

వివరాలు 2లో..

## కేంద్ర బడ్జెట్ 2026 తేదీపై సందిగ్ధత.. ఫిబ్రవరి 1న ప్రవేశపెడతారా?

- 2026 కేంద్ర బడ్జెట్ తేదీపై నెలకొన్న గందరగోళం
- ఫిబ్రవరి 1 ఆదివారం కావడంతో తేదీ మార్పుపై చర్చ
- గతంలోనూ వారాంతాల్లో బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భాలు
- తుది నిర్ణయం పార్లమెంటరీ వ్యవహారాల కమిటీదేనని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న 2026 కేంద్ర బడ్జెట్ తేదీపై ప్రస్తుతం దేశవ్యాప్తంగా ఆసక్తికర చర్చ జరుగుతోంది. 2017 నుంచి ఏటా ఫిబ్రవరి 1న బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం సంప్రదాయంగా వస్తోంది. అయితే 2026లో ఫిబ్రవరి 1వ తేదీ ఆదివారం కావడంతో బడ్జెట్ ప్రవేశపెట్టే తేదీ మారుతుందా? లేదా? అనే దానిపై సందిగ్ధత నెలకొంది. ప్రభుత్వం బడ్జెట్‌ను ఫిబ్రవరి 2న ప్రవేశపెట్టవచ్చని కొన్ని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

**వారాంతంలో బడ్జెట్ కొత్తేమీ కాదు**

బడ్జెట్‌ను వారాంతంలో ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి కాదు. గతంలో కూడా ఇలాంటి సందర్భాలు ఉన్నాయి. 2025లో బడ్జెట్‌ను శనివారం నాడు ప్రవేశపెట్టారు.

వివరాలు 2లో..



## ఎడిటర్ వ్యూ

# శీతాకాలం.. గుండె పదిలం!

తీవ్రమైన చలివాతావరణం, ఆకస్మిక శీతగాలులు గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. ఈ సీజన్‌లో గుండెపోటు కేసులు అత్యధికంగా నమోదవ్వటంతోపాటు గుండె సంబంధిత మరణాలు కూడా ఎక్కువగా కనిపిస్తుంటాయి. చలిగాలులు, జీవనశైలి మార్పులు గుండెపై ప్రభావాన్ని చూపిస్తాయి. చలివల్ల మనలో చురుకుతనం తగ్గటం, నిద్రమత్తు ఎక్కువగా ఉండటం, సోమరితనం, ఒకేచోట కదలకుండా ఎక్కువసేపు ఉండిపోవడంవల్ల గుండె ప్రమాదాలు పెరిగే అవకాశం ఉంది. ఈరోజు వయస్సుతో సంబంధం లేకుండా అన్ని వయస్సుల వారికి గుండె సమస్యలు వస్తున్నాయి. ముఖ్యంగా యువతలో గుండెపోటు సమస్యలకు శీతాకాలం ట్రిగ్గర్‌గా పనిచేస్తుంది. చలి, ఒత్తిడి, అనారోగ్యకరమైన అలవాట్లు మొదలైవి. శీతాకాలంలో గుండెపోటు రావడానికి కారణాలు అవుతున్నాయి. అతిచల్లదనంవల్ల శరీరం వెచ్చఉండటానికి రక్తనాళాలు ముఖ్యంగా కరోనరీ ఆర్టరీస్ (ధమనులు)సంకోచించడం, ఈ కాలంలో శరీర వ్యాయామం తక్కువయ్యి చెమట తక్కువగా ఉండటం వల్ల రక్తపరిమాణం పెరగటంతో రక్తపోటు అధికమవ్వడం, చలికి జీవక్రియ (మెటబాలిజం)నెమ్మదించడం, కొన్ని హార్మోన్ల ప్రభావంతో రక్తం గడ్డకట్టే స్వభావం ఎక్కువయ్యి గుండె సిరల్లో చిక్కుకొని రక్తప్రసరణను అడ్డుకోవడం వల్ల గుండెపోటు ప్రమాదాలు ఎక్కువ అవుతాయి. శీతాకాలం హృదయనాళ వ్యవస్థను అనేక విధాలుగా ప్రభావితం చేస్తుంది. అంతర్లీన గుండెజబ్బులు ఉన్నవారు ఈ సీజన్‌లో చాలా జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా వయో వృద్ధులు, హై బి.పి, షుగర్, ఇదివరకే గుండెజబ్బు ఉన్నవాళ్లు చాలాజాగ్రత్తగా ఉండాలి. 'కరోనరీ ఆర్టరీ డిసీజ్ ఉన్న వారిలో శీతాకాలంలో 'ఆంజినా'(ఛాతీ నొప్పి) తరుచూ వచ్చే అవకాశం ఉంటుంది. చల్లని వాతావరణంవల్ల రక్తనాళాలు కుచించుకుపోయి (వాసోకన్‌స్ట్రక్షన్), సహజ ప్రతిస్పందనవల్ల రక్త పోటు పెరగటం, గుండెకు ఆక్సిజన్ సరఫరా డిమాండ్ పెరగటం, శరీరానికి కావలసిన రక్తాన్ని గుండె సరిగా సరఫరా చెయ్యలేకపోవటం వల్ల గుండె వేగంగా కొట్టుకోవడం, గుండెపై ఒత్తిడి పెరిగి స్ట్రోక్ వచ్చే అవకాశం ఉంటుంది. ఇంకొక సాధారణ సమస్య 'అరిథ్మియా'. ఆకస్మిక ఉష్ణోగ్రత మార్పుల వల్ల, శీతాకాలంలో క్రమరహిత గుండె లయలు ఏర్పడుతాయి. చల్లనిగాలి గుండె విద్యుత్ వ్యవస్థను చికాకుపెడుతూ, దుర్బలవ్యక్తుల్లో అసాధారణ లయలు ఏర్పడుతాయి. శీతాకాలంలో శారీరక చురుకుదనం తగ్గిపోవడం, వేపుళ్లు, మసాలాలు ఎక్కువగా తినడం, అధిక ఒత్తిడి కూడా గుండెకు చేటుతెస్తాయి. శరీరం బరువును అదుపులో ఉంచుకోవాలి. ఎందుకంటే, అధిక బరువువల్ల ముఖ్యంగా యువతలో హృదయ స్పందనరేటు పెరుగుతుంది తద్వారా గుండెపై భారం పడుతుంది. చలికాలంలో గుండె సమస్యలు ఇబ్బంది పెట్టకుండా ఎలా నిర్వహించాలి? శరీర ఉష్ణోగ్రతలు పడిపోకుండా వెచ్చని దుస్తులు ధరించాలి. నడక, యోగలాంటి స్వల్ప వ్యాయామాలు చెయ్యాలి. మెడిటేషన్ (ధ్యానం ) కూడా బాగా ఉపయోగపడుతుంది. పొగతాగడం, మద్యం మానెయ్యాలి లేదా బాగా తగ్గించాలి. పోషకాలు అధికంగా ఉండే తాజా ఆహార పదార్థాలు, పప్పుధాన్యాలు, పండ్లు, గింజలు, తృణధాన్యాలు మొదలైవి ఎక్కువగా తీసుకుంటూ, దాహం అనిపించకపోయినా మంచినీళ్లు బాగా (గోరువెచ్చగా) తాగాలి. దీనివల్ల ఆరోగ్యం ఆకస్మికంగా ప్రమాదంలో పడే అవకాశం ఉంటుంది. గుండె వైఫల్యం చెందేవరకు మనం గమనించలేమని తెలుసుకోవాలి. వృద్ధులు, గుండెజబ్బులు ఉన్నవారు, అధికరక్తపోటు, మధుమేహం ఉన్న వారు, శరీరబరువు అధికంగా ఉన్నవారు, అతి బలహీనంగా ఉన్నవారు, మానసికంగా ఒత్తిడిలో ఉన్నవారు, ఆరుబయట ఎక్కువసేపు పని చేసేవారు, చలిప్రభావం వల్ల మాత్రమే అసౌకర్యంగా ఉండవచ్చని నిర్లక్ష్యం చెయ్యకుండా తగిన జాగ్రత్తలు తీసుకొని, అవసరం అనిపిస్తే వైద్య సలహా తీసుకోవడం మంచిది. రక్తపోటు(బిపి), షుగర్, కొలెస్ట్రాల్ లెవెల్స్‌ను క్రమం తప్పకుండా తనిఖీ చేసుకోండి. ఛాతీ నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా తలతిరుగుతున్నట్లు అనిపిస్తే, ఎడమచేయి, మెడ, దవడతోపాటు వీపుకు ప్రసరించే నొప్పి, అసాధారణ అలస ట, ఆకస్మిక బలహీనత, మైకంగా ఉండటంవంటి లక్షణాలు నిరంతరంగా ఉన్నట్లు అనిపిస్తే వెంటనే సపంలోని వైద్యుడిని సంప్రదించండి. ఈ చిన్నమార్పులతో, శీతాకాలంలో గుండెపోటు ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. అకాల మరణాలను కూడా నివారించవచ్చు !

# రేవంత్‌కు కనీస భౌగోళిక జ్ఞానం కూడా లేదు

- మొదటి పేజి తరువాయి
"ఉరి తీయాలి" అని అన్న రేవంత్ మాటలపై కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. "చావు నోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చినందుకు కేసీఆర్‌ను ఉరి తీస్తావా?" అని ప్రశ్నించారు. 70 లక్షల రైతులను మోసం చేసిన రాహుల్ గాంధీని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీని "లీడర్" కాదు, కేవలం "రీడర్" అని ఎద్దేవా చేశారు. ఇక్కడి నాయకులు ఏమి రాస్తే అది చదవడమే ఆయన పని అని విమర్శించారు. తాను చదువుకున్న వ్యక్తినని, రేవంత్ చెత్త తిరుగుడు తిరిగినవాడని ఎద్దేవా చేశారు. రేవంత్ మనవడు కూడా ఆయన్ను దేకడని శాపనార్థాలు పెట్టారు. కేసీఆర్ కాలి గోటికి కూడా రేవంత్ సరిపోడని, గతంలో కిరణ్ కుమార్ రెడ్డి లాంటివాళ్లు ఇలాంటి మాటలు మాట్లాడి కాలగర్భంలో కలిసిపోయారని, రేవంత్ పరిస్థితి కూడా అంతేనని హెచ్చరించారు.

అసెంబ్లీ ఇప్పుడు గౌరవ సభలా లేదు, కౌరవ సభలా మారిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ ఒక్క ప్రెస్ మీట్ పెడితేనే ముఖ్యమంత్రికి భయం పట్టుకుందని, అందుకే ఇలాంటి అర్థరహిత వ్యాఖ్యలు చేస్తున్నారని ఘాటుగా మాట్లాడారు.

కడియం శ్రీహరికి బీఆర్ఎస్ పార్టీలో ఎలాంటి కీలక పాత్ర లేకపోయినా, ఆయనను డిప్యూటీ సీఎం చేశామని చెప్పారు. అయినా ఆయన పార్టీకి ద్రోహం చేసి, కూతురు కోసం రేవంత్ వైపు వెళ్లారని మండిపడ్డారు.

# రేపటి తరాల భవిష్యత్ కోసమే హిల్ట్ పాలసీ..

- మొదటి పేజి తరువాయి
వల్లే ఎల్జీ పాలిమర్స్, భోపాల్ గ్యాస్ దుర్ఘటన వంటివి జరిగాయని గుర్తు చేశారు. హిల్ట్ పాలసీ విషయంలో ప్రతిపక్షాలు రాజకీయాలు పక్కన పెట్టాలని కోరారు.

చైనాలో బ్లూస్కై పాలసీ ద్వారా భారీ పరిశ్రమలను నగరం అవతలివైపునకు తరలించారని గుర్తు చేశారు. పారిశ్రామిక ప్రగతి కంటే.. ప్రజల ప్రాణాలకే ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు చెప్పిందన్నారు. ఢిల్లీలో జనవాసాల మధ్య ఉన్న 168 పరిశ్రమలను ఇతర ప్రాంతాలకు తరలించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని పేర్కొన్నారు.

సుప్రీం కోర్టు తీర్పు ప్రాతిపదికన హిల్ట్ పాలసీ తీసుకొచ్చామని.. కాలుష్యం వెదజల్లే పరిశ్రమలు ఓఆర్ఆర్ లోపల ఉండకూడదనే హిల్ట్ పాలసీ తీసుకొచ్చామని స్పష్టం చేశారు. పూర్వీకులు స్వచ్ఛమైన ప్రకృతిని మనకు వారసత్వంగా అందించారని.. మనం కూడా రేపటి తరానికి స్వచ్ఛమైన ప్రకృతిని అందజేస్తున్నామా లేదా అని ఆత్మ విమర్శ చేసుకోవాలని సూచించారు. ప్రకృతి ఒకసారి నాశనమైతే తిరిగి తీసుకురాలేమని అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన ప్రకృతి అందించడం మన బాధ్యత అని.. రేపటి తరాల భవిష్యత్, నేల మనుగడ కోసం హిల్ట్ పాలసీ తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. ప్రతిపక్షాలు హిల్ట్ పాలసీని సాదాసీదా భూమార్పిడిగా చూస్తున్నారన్నారు. హిల్ట్ పాలసీపై సద్విమర్శలు చేస్తే స్వీకరిస్తామని తెలిపారు. మాపై బురద చల్లాలని విమర్శలు చేసే వారు ఆత్మవిమర్శ చేసుకోవాలని హితవు పలికారు.

# ఏపీ లేకుంటే తెలంగాణ బతకలేదని ఒకరు చెప్పారు.. మేం ఎలా అభివృద్ధి చెందామో చూడండి

- మొదటి పేజి తరువాయి
చూడాలని మజ్లిస్ పార్టీ శాసనసభా పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. తాము లేకుంటే తెలంగాణకు విద్యుత్ ఉండదని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ చివరి ముఖ్యమంత్రి పేర్కొన్నారని ఆయన గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే నీళ్లు, విద్యుత్ ఉండవని చెప్పారని తెలిపారు. ఆయన పేరును ప్రస్తావించదలుచుకోలేదని ఆయన అన్నారు. ప్రస్తుతం ఆయన వాషింగ్ మెషీన్ పార్టీ అయిన బీజేపీలో చేరారని ఎద్దేవా చేశారు. ఆయన కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆ వ్యాఖ్యలు చేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత ఆయన పార్టీ మారారని తెలిపారు.

అసెంబ్లీ సమావేశాల్లో కొన్ని మాటలను కావాలని తొలగిస్తున్నారని అక్బరుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. తాను ముఖ్యమైన విషయం గురించి మాట్లాడుతున్న సమయంలో ఆడియో డిస్టర్బెన్స్ వస్తోందని అన్నారు. హిల్ట్ (హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్) పాలసీపై చర్చ సందర్భంగా ఆయన అసెంబ్లీలో మాట్లాడారు.

# వెనెజువెలా సంక్షోభం... భారత్‌కు మేలు చేస్తుందంటున్న నిపుణులు!

అమెరికా, వెనెజువెలా మధ్య కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతదేశంపై తక్షణ ప్రభావం చూపబోవని, ప్రస్తుత పరిస్థితుల్లో భారత దేశ చమురు దిగుమతి వ్యయం పెరిగే అవకాశం లేదని మంగళవారం విడుదలైన ఒక నివేదిక స్పష్టం చేసింది. బ్యాంక్ ఆఫ్ బరోడా విడుదల చేసిన ఈ నివేదిక ప్రకారం, ప్రపంచ మార్కెట్‌లో ముడి చమురు సరఫరా అవసరానికి మించి (గ్లట్ మోడ్) ఉండటం, అంతర్జాతీయ ఉత్పత్తిలో వెనెజువెలా వాటా కేవలం 1 శాతం మాత్రమే కావడం ఇందుకు ప్రధాన కారణాలు. అందువల్ల, వెనెజువెలాలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకున్నా, భారత్ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని నివేదిక భరోసా ఇచ్చింది. వెనెజువెలాలో నిరూపితమైన చమురు నిల్వలు చాలా ఎక్కువని, ప్రపంచ మొత్తం నిల్వల్లో దాదాపు 19.4 శాతం అక్కడే ఉన్నాయని బ్యాంక్ ఆఫ్ బరోడా నివేదిక పేర్కొంది. ఈ భారీ నిల్వలను వెలికితీసి, సరఫరా పెంచేందుకు అమెరికా కంపెనీలు రంగంలోకి దిగవచ్చన్న మార్కెట్ అంచనాలతో ఇప్పటికే అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు కొంతమేర తగ్గుముఖం పట్టాయి. ఈ పరిణామం భారత్‌కు మేలు చేసే అంశమని విశ్లేషకులు భావిస్తున్నారు. "ప్రస్తుత ప్రపంచ సరఫరా పరిస్థితులు, మిగులు నిల్వలను పరిగణనలోకి తీసుకుంటే, సమీప భవిష్యత్తులో భారత్ ఆయిల్ దిగుమతి బిల్లు పెరిగే ప్రమాదం కనిపించడం లేదు" అని నివేదికలో స్పష్టం చేశారు. ఒకవేళ అమెరికా కంపెనీలు వెనెజువెలాలో ఉత్పత్తిని పెంచితే, అంతర్జాతీయంగా ధరలు మరింత తగ్గి, భారత్ సహా అన్ని దేశాలకూ లబ్ధి చేకూరుతుందని మరో నివేదికలో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.

**భారత్-వెనెజువెలా వాణిజ్య సంబంధాలు**

భారత్, వెనెజువెలా మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం ప్రస్తుతం 1.9 బిలియన్ డాలర్లుగా ఉంది. ఇందులో భారత్ నుంచి ఎగుమతులు 217 మిలియన్ డాలర్లు కాగా, దిగుమతులు 1.6 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈ దిగుమతుల్లో పెట్రోలియం, ఆయిల్, లూబ్రికెంట్స్ (పీఓఎల్) వాటానే అత్యధికం. "భారత్ దిగుమతి చేసుకుంటున్న దేశాలతో పోలిస్తే వెనెజువెలా నుంచి వస్తున్న ముడి చమురు యూనిట్ విలువ తక్కువగా ఉంది. ఇది మన దిగుమతి ఖర్చులను అదుపులో ఉంచడానికి సహాయపడుతుంది" అని బ్యాంక్ ఆఫ్ బరోడా ఆర్థికవేత్త దీపాన్విత్ మజుందార్ వివరించారు.

అయితే, గత ఐదేళ్లుగా వెనెజువెలాకు భారత ఎగుమతులు సగటున ఏటా 8.8 శాతం మేర క్షీణిస్తున్నాయి. ఇదే సమయంలో ప్రపంచానికి భారత్ చేస్తున్న మొత్తం ఎగుమతులు 6.9 శాతం వృద్ధి చెందాయి. దీన్నిబట్టి వెనెజువెలాతో వాణిజ్య సంబంధాలు మందగించాయని అర్థమవుతోంది. వెనెజువెలా నుంచి ముడి చమురును అధికంగా ఎగుమతి చేసుకుంటున్న దేశాల్లో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, ఆ తర్వాత చైనా, భారత్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో కొనసాగుతున్న చర్చల్లో చమురు దౌత్యం కీలక పాత్ర పోషిస్తోంది. కాగా, ఈ ప్రాంతంలోని భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా వెనెజువెలాలో భారీ పెట్టుబడులు పెట్టడానికి కంపెనీలు వెనకడుగు వేయవచ్చని, ఇది చమురు ఉత్పత్తి పెంపునకు అడ్డంకిగా మారవచ్చని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# మదురో లాగే ప్రధాని మోదీని ట్రంప్ కిడ్నాప్ చేస్తారా?

- మొదటి పేజి తరువాయి
వ్యాఖ్యలపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వెనెజువెలా అధ్యక్షుడిగా ఉన్న మదురోను అమెరికా అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ అంశంపై పృథ్వీరాజ్ చవాన్ మాట్లాడుతూ, వెనెజువెలా సంక్షోభంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మౌనంగా ఉన్నారని ఆరోపించారు. అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించి ఎన్నికైన అధ్యక్షుడిని తొలగించినప్పటికీ భారత్ మౌనంగా ఉందని అన్నారు. అమెరికా చర్యలు ప్రపంచానికి చెడు సంకేతాన్ని అందిస్తాయని అన్నారు.

వెనెజువెలాలో ఎన్నికైన అధ్యక్షుడిని కిడ్నాప్ చేశారని, రేపు మరే దేశాధినేతకైనా ఇలా జరగవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారతదేశానికి కూడా జరగవచ్చని సంచలన వ్యాఖ్యలు చేశారు.

ప్రపంచంలోని వివిధ సంఘర్షణలపై భారత ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని తీసుకోవడంలో విఫలమైందని చవాన్ ఆరోపించారు. రష్యా, చైనాలు ఏదో ఒక వైఖరిని తీసుకున్నాయని వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్, ఇజ్రాయెల్-హమాస్ యుద్ధాల విషయంలోనూ భారత్ స్పష్టమైన వైఖరిని చెప్పలేకపోయిందని ఆరోపించారు. మనం అమెరికాకు భయపడుతున్నట్లుగా ఉందని అన్నారు.

మదురో అమెరికాలో డ్రగ్స్ సరఫరా చేస్తున్నారంటూ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. వెనెజువెలా ఆయిల్ నిల్వలే కిడ్నాప్‌కు ప్రధాన కారణమని అనుమానం వ్యక్తం చేశారు. మనం మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్నా, భద్రతా మండలిలో శాశ్వత సభ్యులు కావాలన్నా ప్రపంచ అంశాలపై స్పష్టమైన వైఖరిని తీసుకోవాలని అన్నారు. భారతదేశ ఉత్పత్తులపై అమెరికా అధిక వాణిజ్య పన్నులు విధించడాన్ని పృథ్వీరాజ్ చవాన్ తప్పుబట్టారు. మన ఎగుమతులపై ప్రత్యక్ష నిషేధం విధించలేక, వాణిజ్యాన్ని ఆపేందుకు సుంకాలను ట్రంప్ ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అమెరికాకు ఎగుమతులు చేయడం ద్వారా గతంలో ఆర్జించిన లాభాలు ఇప్పుడు రావని, మనం ప్రత్యామ్నాయ మార్కెట్లను అన్వేషించాలని అన్నారు.

**పృథ్వీచవాన్ వ్యాఖ్యలు దారుణం**

పృథ్వీరాజ్ చవాన్ చేసిన వ్యాఖ్యలపై జమ్ము కశ్మీర్ మాజీ పోలీసు అధికారి ఎస్పీ వైద్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకుడి వ్యాఖ్యలు దేశాన్ని అవమానించేలా ఉన్నాయని మండిపడ్డారు. పృథ్వీరాజ్ చవాన్ బ్రెయిన్ డెడ్ అయిందని, నిరక్షరాస్యుడని, మూర్ఖుడంటూ సామాజిక మాధ్యమాల్లో నెటిజన్లు విమర్శలు గుప్పిస్తున్నారు. మదురోకు ట్రంప్ చేతిలో ఎదురైన అనుభవమే మన ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కూడా జరగాలని కాంగ్రెస్ నేత చవాన్ కోరుకోవడం దేశాన్ని అవమానించడమేనని వైద్ అన్నారు. పృథ్వీరాజ్ చవాన్ కనీసం మాట్లాడే ముందు ఆలోచన చేయాల్సిందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అసలు భావజాలం ఇదేనా, ఇప్పుడు వారి రంగు బయటపడుతోందని అన్నారు.

# కవిత కాంగ్రెస్‌లో చేరినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు

- మొదటి పేజి తరువాయి
కవిత కూడా కాంగ్రెస్ పార్టీలోకి వస్తే ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు.

**తనకు మంత్రి పదవి ఇవ్వాలన్న రంగారెడ్డి**

తనకు మంత్రి పదవి ఇవ్వాలని మల్‌రెడ్డి రంగారెడ్డి కోరారు. తనకు మంత్రి పదవి ఇవ్వకపోతే పార్టీకే నష్టం జరుగుతుందని అన్నారు. పార్టీ పెద్దలు తన విషయంలో ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. రెండు కోట్ల మంది ప్రజలు ఉన్న జిల్లాకు ఇంతవరకు మంత్రి పదవి ఇవ్వలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా పేరు మారుస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో మల్‌రెడ్డి స్పందిస్తూ, పేరు మార్పు తనకు ఇష్టం లేదని అన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఎన్ని మున్సిపాలిటీలు అయినా చేసుకోవచ్చని, జిల్లా పేరు మాత్రం మార్చవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఫ్యూచర్ సిటీ పరిసరాల్లో రియల్ ఎస్టేట్ ఊపందుకుందని, భూముల ధరలు పెరుగుతాయనే ఉద్దేశంతో ఎవరూ అమ్ముకోవడానికి ఆసక్తి చూపడం లేదని ఆయన తెలిపారు.

# టిక్కెట్ల కోసం నా వద్దకు ఎవరూ రావొద్దు

- మొదటి పేజి తరువాయి
భవిష్యత్తులో ఎమ్మెల్యే కానున్న నిర్మలా జగ్గారెడ్డిని ఈ ఎన్నికల ప్రచారానికి పిలవాలని సూచించారు. జగ్గారెడ్డిని సంగారెడ్డి పట్టణ ప్రజలు విశ్వసిస్తారని ఆయన అన్నారు. ఆమె గెలుపు కోసం చేసే వాగ్దానాలన్నీ తానే నెరవేరుస్తానని భరోసా ఇచ్చారు. తన జీవితంలో తాను పోలీసులను ఎదిరించి రాజకీయం చేశానని గుర్తు చేశారు. పోలీసులను అడ్డుపెట్టుకుని తాను ఎప్పుడూ రాజకీయం చేయలేదని అన్నారు.

అధికారంలో ఉన్నామని పోలీసులను అడ్డుపెట్టుకుని గెలవాలని చూడవద్దని అన్నారు. ఈ ఎన్నికల్లో టిక్కెట్ల కోసం గాంధీ భవన్‌కు వెళ్లి పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసి ఇబ్బంది పెట్టవద్దని అన్నారు. ఎన్నికల ప్రచారంలో అభ్యర్థులు ఇచ్చే హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి వాటిని నెరవేర్చే బాధ్యత తనదేనని అన్నారు. ఎన్నికల్లో పార్టీ నిలబెట్టిన అభ్యర్థులను ఓడించాలని చూస్తే వారిపై వేటు ఖాయమని హెచ్చరించారు.

# భారీ భూకంపానికి చిగురుటాకులా వణికిన జపాన్?

- మొదటి పేజి తరువాయి
ఉన్నాయని, ఇంత భారీ భూకంపం సంభవించినా ప్రాణనష్టం మాత్రం జరగలేదని వారు వివరించారు. భూకంపానికి సంబంధించి పలువురు నెటిజన్లు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియోలు భయానకంగా ఉన్నాయి. ఒక వీడియోలో మెట్రో రైల్వే స్టేషన్, చుట్టుపక్కల భవనాలు తీవ్రంగా కదలడం కనిపిస్తోంది. భూకంప కేంద్రం భూమి లోపల సుమారు 10 కిలోమీటర్ల లోతులో ఉన్నట్లు అధికారులు గుర్తించారు. షిమనే ప్రిఫెక్చర్

రాజధాని మాట్సుతో పాటు టోటోరి ప్రిఫెక్చర్ పరిధిలోని పలు నగరాల్లో భూమి తీవ్రంగా కంపించింది. భారీ భూకంపం సంభవించిన నేపథ్యంలో ఆఫ్టర్ షాక్స్ వచ్చే ప్రమాదం ఉందని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను అధికారులు హెచ్చరించారు.

# కేంద్ర బడ్జెట్ 2026 తేదీపై సందిగ్ధత.. ఫిబ్రవరి 1న ప్రవేశపెడతారా?

- మొదటి పేజి తరువాయి
అంతకుముందు దివంగత ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2015 ఫిబ్రవరి 28 (శనివారం), 2016 ఫిబ్రవరి 28 (ఆదివారం) తేదీల్లో బడ్జెట్‌ను సమర్పిం చారు. పార్లమెంటరీ సంప్రదాయాలను అనుసరిస్తే, ఆదివారం నాడు కూడా బడ్జెట్‌ను ప్రవేశపెట్టే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల కేబినెట్ కమిటీ సరైన సమయంలో తుది నిర్ణయం తీసుకుంటుందని మంత్రి కిరణ్ రిజిజు స్పష్టం చేశారు.

**ఫిబ్రవరి 1 తేదీ ఎందుకంత ముఖ్యం?**

2017కు ముందు కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి చివరి పనిదినాన ప్రవేశపెట్టేవారు. దీనివల్ల బడ్జెట్ ఆమోద ప్రక్రియ ఆలస్యమయ్యేది. కొత్త ఆర్థిక సంవత్సరం (ఏప్రిల్ 1) ప్రారంభమైన తర్వాత కూడా కొన్ని నెలల పాటు బడ్జెట్ ఆమోదం పొందకపోయేది. ఈ సమయంలో ప్రభుత్వ ఖర్చుల కోసం పార్లమెంట్ 'ఓట్ ఆన్ అకౌంట్' ను ఆమోదించాల్సి వచ్చేది. ఈ జాప్యాన్ని నివారించడానికి 2017లో అప్పటి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్ తేదీని ఫిబ్రవరి 1కి మార్చారు. దీనివల్ల మార్చి 31లోపే బడ్జెట్ ఆమోద ప్రక్రియ పూర్తి చేయడానికి పార్లమెంటుకు తగినంత సమయం లభిస్తుంది. గతంలో ఆదివారాల్లో పార్లమెంట్ సమావేశమైన సందర్భాలు కూడా ఉన్నాయి. కోవిడ్-19 సమయంలో, అలాగే పార్లమెంట్ తొలి సమావేశం 60వ వార్షికోత్సవం సందర్భంగా 2012లో ఆదివారం నాడు సభ జరిగింది. ఈ నేపథ్యంలో 2026 బడ్జెట్ తేదీపై ప్రభుత్వం సంప్రదాయం, సౌలభ్యం మధ్య సమన్వయం సాధిస్తూ త్వరలోనే తుది నిర్ణయం ప్రకటించే అవకాశం ఉంది.

# కాశీ ఎక్స్‌ప్రెస్ కు బాంబు బెదిరింపు

కాశీ ఎక్స్‌ప్రెస్ రైలుకు బాంబు బెదిరింపు కాల్ రావడంతో కలకలం రేగింది. గోరఖ్‌పూర్ నుంచి ముంబైకి వెళుతున్న కాశీ ఎక్స్‌ప్రెస్‌లో బాంబు పెట్టినట్లు గుర్తు తెలియని వ్యక్తి పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ చేసి బెదిరించాడు. దీంతో అప్రమత్తమైన అధికారులు రైలును 'మౌ' రైల్వే స్టేషన్‌లో నిలిపి తనిఖీలు చేపట్టారు. అయితే, ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభ్యం కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఈ ఘటనపై 'మౌ' రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ ఎలమరన్ మాట్లాడుతూ, కాశీ ఎక్స్‌ప్రెస్ రైలుకు బాంబు బెదిరింపు వచ్చిందని తెలిపారు. రైలు స్టేషన్‌కు చేరుకున్న వెంటనే ప్రయాణికులందరినీ కిందకు దించి, ప్రతి బోగీలో క్షుణ్ణంగా తనిఖీలు చేశామని చెప్పారు. పేలుడు పదార్థాలు ఉన్నట్లు ఎలాంటి ఆధారాలు లభించలేదని ఆయన స్పష్టం చేశారు. ఈ బెదిరింపు కాల్ ఎక్కడి నుంచి వచ్చిందో విచారణ జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. ఉదయం ఫోన్ కాల్ రాగానే 'మౌ' పోలీసులు, జీఆర్పీ, ఆర్పీఎఫ్‌తో కలిసి రైల్వే స్టేషన్‌కు చేరుకుని తనిఖీలు నిర్వహించారని ఆయన పేర్కొన్నారు.

# కవిత రాజీనామాకు మండలి చైర్మన్ ఆమోదం



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఎమ్మెల్సీ కవిత రాజీనామాకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ఆమోదం తెలిపారు. ఈ మేరకు మంగళవారం (జనవరి 6) నోటిఫికేషన్ జారీ చేశారు. కవిత రాజీనామాతో ఎమ్మెల్సీ స్థానం ఖాళీ అయినట్లు ప్రకటించారు. కాగా, బీఆర్ఎస్ నుంచి సస్పెండైన తర్వాత ఆ పార్టీ ద్వారా లభించిన పదవి తనకు వద్దంటూ ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు స్పీకర్ ఫార్మాట్?లో రాజీనామా చేసిన కవిత.. మండలి ఛైర్మన్?కు రిజైన్ లెటర్?ను పంపించి ఆమోదం తెలపాలని కోరారు. రాజీనామాపై పునరాలోచించుకోవాలని మండలి చైర్మన్ కవితకు సూచించారు. అయినప్పటికీ వెనక్కి తగ్గని కవిత.. 2026, జనవరి 5న మండలి వేదికగా తీవ్ర భావోద్వేగానికి గురవుతూ తన రాజీనామాను ఆమోదించాలని మరోసారి చైర్మన్?కు విజ్ఞప్తి చేశారు. అన్ని ఆలోచించి రాజీనామా నిర్ణయం తీసుకున్నానని ఆమె స్పష్టం చేశారు. ఈ క్రమంలో కవిత రాజీనామాకు మంగళవారం (జనవరి 6) చైర్మన్ గుత్తా ఆమోదం తెలిపారు. కాగా, బీఆర్ఎస్ పార్టీ తరుఫున నిజామాబాద్ లోకల్ బాడీ నియోజకవర్గం నుంచి కవిత ఎమ్మెల్సీగా ఎన్నికైన విషయం తెలిసిందే. అయితే.. పార్టీ లైన్ క్రాస్ చేసిందన్న ఆరోపణలపై బీఆర్ఎస్ కవితను సస్పెండ్ చేసింది. దీంతో బీఆర్ఎస్ పార్టీ ద్వారా వచ్చిన పదవి తనకు అవసరం లేదని కవిత ఎమ్మెల్సీ పదవికి రిజైన్ చేశారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్





# శాఖల సమన్వయ లోపం..!
# ట్రాఫిక్ జామ్‌తో ఇబ్బందులు

## రోడ్డు మధ్యన నాలా పనులకు అడ్డంకిగా మారిన భారీ వృక్షం..



దూలపల్లి ఫారెస్ట్ అధికారి (ఎఫ్ఆర్ఓ) లక్ష్మణ్‌తో ఫిర్యాదు దారుడు కోలా శ్రీకాంత్..



మొన్న డిసెంబర్ 31న ట్రాఫిక్ జామ్ అయిన నాటి ఫోటో..

- సురారం ఎక్స్‌రోడ్డులో వాహన దారులు, పాదచారులకు ఇబ్బందులు..
- గంటల తరబడి ట్రాఫిక్ జామ్‌లో, అంబులెన్స్ వాహనం..
- రెండు నెలలుగా నాలా పనులు నిలిపివేత, నిద్రావస్థలో అధికారులు..!
- భారీ వృక్షం తొలగింపుకు జీహెచ్ఎంసి నుండి ఎన్‌వోసి కోరుతున్న అటవీశాఖ..
- రెండు నెలలుగా అటవీశాఖ అనుమతి కోసం ఎదురు చూపులు..
- ఎఫ్ఆర్‌వో లక్ష్మణ్‌కి సూరారం నివాసి కోలా శ్రీకాంత్ ముదిరాజ్ మంగళవారం ఫిర్యాదు..

జీహెచ్ఎంసి- అటవీశాఖ అధికారుల అలసత్వంతో, నర్సాపూర్ హైవేపై, సుమారు రెండు నెలలుగా నాలా పనులు నిలిచి పోయాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. నాలా నిర్మాణానికి అడ్డంకిగా మారిన, భారీ వృక్షం తొలగించే ప్రక్రియకు రెండు శాఖల అనుమతి జాప్యం, ప్రజలకు శాపంగా మారింది.. నిత్యం రద్దీగా ఉండే సూరారం ఎక్స్‌రోడ్డు, ఇప్పుడు నరక యాతనగా తయారైంది..ఈ సమస్య నర్సాపూర్ హైవేపై ఉండటంతో పాటు..! అదేచోట సూరారం ఎక్స్‌రోడ్డు చౌరస్తా ట్రాఫిక్ సిగ్నల్ కూడా ఉంది.. దీంతో ఉదయం-సాయంత్రం ట్రాఫిక్ జామ్‌తో వాహన దారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు..

కుత్బుల్లాపూర్, పెన్ పవర్, జనవరి 6:



నర్సాపూర్ హైవేలో నాలా పనులకు అడ్డంకిగా మారిన భారీ వృక్షం..

హైదరాబాద్ నగర శివారులోని జీడిమెట్లకుత్బుల్లాపూర్ మండలం, సురారం ఎక్స్‌రోడ్ వద్ద రోడ్డు మధన నాలా పనులకు అడ్డంకిగా మారింది.. శాఖల సమన్వయ లేమితో, జటిలమైన సమస్యతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. రెండు నెలలుగా నాలా పనులు నిలిచిన ఈసమస్య నర్సాపూర్ హైవేపై ఉండటం, ప్రజలు తీవ్రంగా ఇబ్బందుల పాలవుతున్నారు.. నాలా పనులకు అడ్డుగా ఉన్న ఈ చెట్టును తొలగించడంలో అటవీశాఖ, జీహెచ్ఎంసి శాఖల మధ్య సమన్వయం లేకపోవడంతో పనులు పూర్తిగా నిలిచిపోయాయి.. నిత్యం వేలాది వాహనాలు తిరగే కీలక రహదారిపై ఈ సమస్యకు పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.. ప్రభుత్వ భూముల్లో అక్రమ సీసీరోడ్లు, భూదాన్ భూమిలో అక్రమ షెడ్లకు సిఫార్సులు చేసే ప్రముఖ ప్రజాప్రతినిధికి ఈ సమస్య కనిపించకపోవడం విశేషం..

## ప్రాణాలు పోతేనే పట్టించు కుంటారా..?

చిటికెలో పరిష్కృతమయ్యే సమస్యను రెండు నెలలుగా, ప్రజలను ఇబ్బందుల్లో పెడుతున్నారు.. జీహెచ్ఎంసి పరిధిలో ఉన్నందున ఎన్‌వోసి ఇస్తేనే, చెట్టును తొలగించేందుకు అనుమతి ఇస్తామని అటవీశాఖ అధికారులు చెబుతున్నారు.. మరోవైపు ప్రాణాలు పోతేనే పట్టించు కుంటారా..? అంటూ స్థానికులు, వాహన దారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. సూరారం చౌరస్తాలో భారీ వృక్షం తొలగింపు ప్రక్రియలో "జీహెచ్ఎంసి- అటవీశాఖ" నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తుంది.. ఫలితంగా ఉదయం, సాయంత్రం భారీ ట్రాఫిక్ జామ్‌తో, వాహన దారుల మధ్య గొడవలకు దారితీసే పరిస్థితులు నెలకొన్నాయి.. ప్రైవేటు, ప్రభుత్వ ఉద్యోగులు, పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు, స్థానికులు గంటల తరబడి రోడ్లపైనే చిక్కుకుపోతున్నారు..

⇨ఈ ప్రమాదకర పరిస్థితిపై సురారం కాలనీకి చెందిన కోలా శ్రీకాంత్ దూలపల్లి అటవీశాఖ రేంజ్ అధికారి (ఎఫ్ఆర్ఓ) కు మంగళవారం లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు.. "రోడ్డు పక్కన చెట్టు వల్లన, నాలా పనులు నిలిచిపోగా, ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు.. వెంటనే పరిశీలించి, భారీ వృక్షం తొలగింపుకు తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.. ఇప్పటికే పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని దూలపల్లి ఎఫ్ఆర్ఓ లక్ష్మణ్‌తో ప్రస్తావించారు..

⇨ఒక్క చెట్టు విషయంలోనే రెండు నెలలుగా నిర్ణయం తీసుకోలేని అధికార యంత్రాంగం, ప్రజా భద్రతపై ఎంతవరకు చిత్తశుద్ధి చూపుతోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

⇨ప్రమాదం జరిగితే, ప్రాణాలు పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు.. అధికారులు ఇదే నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తే రోడ్డుపై బైటాయించి ధర్నాలు చేపడుతామని శ్రీకాంత్ హెచ్చరించారు..






సూరారం చౌరస్తా సమీపంలో, నర్సాపూర్ హైవేలో నిలిచి పోయిన నాలా పనులు..





# ఫార్మా పరిశ్రమ స్థాపనకు వ్యతిరేకంగా...
# నేడు బస్వాపూర్ బంద్

## ఫ్యూజన్ హెల్త్‌కేర్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ ఏర్పాటుతో ప్రజల ఆందోళన..





ఏఐ ఫోటో..

**కామారెడ్డి జిల్లా బ్యూరో, పెన్ పవర్,జనవరి 6:** బస్వాపూర్ గ్రామ పరిధిలో రసాయన ఆధారిత ఫార్మా కంపెనీ "ఫ్యూజన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడు ఏర్పాటు ప్రయత్నాల ను గ్రామ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.. బస్వాపూర్ గ్రామ సర్పంచ్ తుడుం పద్మ స్వామి, ఉప సర్పంచ్ కార్తీక్ రెడ్డి, వార్డు సభ్యులతో కలిసి తీసుకున్న నిర్ణయంతో నేడు బంద్‌లో భాగంగా శాంతియుత నిరసనకు పిలుపునిచ్చారు.. ప్రజారోగ్యం, పర్యావరణ భద్రతను పక్కన పెట్టి మికల్ పరిశ్రమకు అనుమతులు ఇచ్చిన అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, నేడు బుధవారం బస్వాపూర్ బంద్‌కు గ్రామ పంచాయతీ పిలుపునిచ్చింది.. ఈ పరిశ్రమ ఏర్పాటు వల్ల గ్రామంలో భూగర్భ జలాలు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, గాలి కాలుష్యంతో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణీల ఆరోగ్యానికి ముప్పు వాటిల్లి, వ్యవసాయం, పశుసంపదపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని ,భవిష్యత్తులో క్యాన్సర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు సోకే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. ఇప్పటికే ఫార్మా పరిశ్రమల కారణంగా పలు ప్రాంతాల్లో ఎదురైన అనుభవాలు బస్వాపూర్ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ప్రజాభిప్రాయాన్ని పట్టించుకోకుండా, గ్రామానికి సమీపంలో మికల్ పరిశ్రమ ఏర్పాటు చేయడం ప్రజల జీవించే హక్కును హరించే చర్యగా వారు అభివర్ణిస్తున్నారు.. ఈ నేపథ్యంలో రేపు నిర్వహించనున్న ప్రజాభిప్రాయ సేకరణ (పబ్లిక్ హియరింగ్) కార్యక్రమంలో, రాజకీయాలకు అతీతంగా గ్రామ ప్రజలంతా పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలను స్పష్టంగా, బలంగా వెల్లడించాలని గ్రామ పంచాయతీ పిలుపునిచ్చింది. శాంతియుత నిరసనతో పరిశ్రమకు వ్యతిరేకంగా తమ నిర్దిష్ట వైఖరిని వెల్లడించి, బస్వాపూర్ భవిష్యత్తును కాపాడుకోవాలని కోరుతున్నారు.. గ్రామ సర్పంచ్ తుడుం పద్మఉస్వామి, ఉప సర్పంచ్ కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ,"బస్వాపూర్ ప్రజల ఆరోగ్యంతో ఎవరు చెలగాటమాడినా సహించేది లేదని. ఈ మికల్ పరిశ్రమకు ఇప్పటివరకు ఇచ్చిన అన్ని అనుమతులను తక్షణమే రద్దు చేయాలి. ప్రజల సంకల్పమే మా బలం. బంద్‌ను విజయవంతం చేయాలి," అని విజ్ఞప్తి చేశారు. ప్రజారోగ్యం వర్సెస్ కార్పొరేట్ లాభాలు అన్న ప్రశ్నతో బస్వాపూర్‌లో నేడు జరగనున్న బంద్, ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ఉత్కంఠగా మారింది. గ్రామ ప్రజల గళం అధికారుల వరకు ఎంత బలంగా చేరుతుందన్నదే ఇప్పుడు కీలకంగా మారింది



బస్వాపూర్ గ్రామ ఉప సర్పంచ్ కార్తిక్ రెడ్డి..



బస్వాపూర్ గ్రామ సర్పంచ్ తుడుం పద్మ-స్వామి..

- బిక్కనూర్ మండలం బస్వాపూర్, గ్రామ సర్పంచ్-ఉపసర్పంచ్ కీలక నిర్ణయం..
- కెమికల్ వ్యర్థాలతో నీరుఉగాలి కలుషితమై గ్రామ ప్రజల ఆరోగ్యానికి ముప్పు..
- పిల్లలు, వృద్ధులపై శ్వాసకోశ, చర్మ, క్యాన్సర్ కారక రోగాలు సోకే అవకాశం.
- వ్యవసాయ భూముల్లో భూసారం కోల్పోయి దిగుబడులు పడిపోతాయన్న భయం..
- కంపెనీకీ అనుమతులపై అనుమానం ప్రజాభిప్రాయం లేకుండానే గ్రీన్ సిగ్నల్..?
- నేడు గ్రామ బంద్‌కు పిలుపు.. పరిశ్రమ రద్దే లక్ష్యంగా శాంతియుత నిరసనకు సిద్ధం..

# తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా..
# 13 బిల్లులకు సభ ఆమోదం





**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ అసెంబ్లీ నిరవధిక వాయిదా పడింది. మొత్తం ఐదురోజుల పాటు శీతకాల అసెంబ్లీ సమావేశాలు జరిగాయి. శాసన సభలో వివిధ అంశాలపై 40 గంటల 40 నిమిషాల పాటు చర్చ జరిగింది. కృష్ణా జలాలు, హిల్ట్ పాలసీ, మూసీ సుందీకరణ, ఉపాధి హామీ పథకం పేరు మార్పు తదితర అంశాలపై సభ్యులు డిస్కస్ చేశారు. ఈ సమావేశాల్లో 13 బిల్లులకు సభ ఆమోదం తెలిపింది. సభలో 66 మంది సభ్యులు మాట్లాడినట్లు స్పీకర్ ప్రకటించారు.

కృష్ణా జలాలపై ఇరిగేషన్ మినిస్టర్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అసెంబ్లీలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సభలో సుదీర్ఘంగా ప్రసంగించారు. మరోవైపు తమకు స్పీకర్ సభలో మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదంటూ ప్రతిపక్ష బీఆర్ఎస్ సెషన్ మొత్తం బాయ్ కాట్ చేసింది.

## మొత్తం ఐదు రోజులు నడిచిన అసెంబ్లీ

**పని గంటలు - 40 గంటల 45 నిమిషాలు**

**ఆమోదం పొందిన బిల్లులు - 13**

**సభ చేసిన తీర్మానాలు - 2**

**స్వల్ప కాలిక చర్చలు - 4**

# సబ్బండ వర్గాల అభివృద్దే లక్ష్యం

## జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్







**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 6 :**జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో జిల్లా ఎస్ సి సెల్ అధ్యక్షులు బొడ్డు బొందయ్య అధ్యక్షతన నిర్వహించిన ఎస్ సి సెల్ విస్తృత స్థాయి సమావేశంలో ముఖ్య అతిథిగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, విశిష్ట అతిథిగా రాయల నాగేశ్వరరావులు పాల్గొన్నారు

ఈ కార్యక్రమంలో జిల్లా లోని జిల్లా ఎస్ సి సెల్ కమిటీ సభ్యులు,అన్ని మండల ఎస్ సి సెల్ అధ్యక్షులతో సమావేశం నిర్వహించనైనది. అనంతరం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ తరుపున గెలిచిన 70 మంది దళిత సర్పంచ్ లకు జిల్లా ఎస్ సి సెల్ ముఖ్య అతిథులుగా హజరైన నూతి సత్యనారాయణ గౌడ్, రాయల నాగేశ్వరరావు లతో కలిసి సన్మానించనైనది.

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మన కాంగ్రెస్ ప్రభుత్వంలో దళిత సర్పంచ్ ల గా ఎన్నిక కావడానికి తోడ్పడిన రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్,రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపాలన నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వరరావు,పొంగులేటి శ్రీనివాసరెడ్డి మరియు సహచర మంత్రివర్గ సభ్యులకు, శాసనసభ,శాసనమండలి సభ్యులకు కృతజ్ఞతాభివందనాలు తెలియజేసినారు. అదే విధంగా జిల్లాలో ఎస్ సి సర్పంచ్ ల గెలుపుకు కారకులైన నాయకులకు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా సర్పంచ్ లుగా ఎన్నికైన అందరూ బడుగు బలహీన వర్గాల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండాలని తద్వారా కాంగ్రెస్ పార్టీని పటిష్ట పరచాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర యస్ సి సెల్ కన్వీనర్ దర్జీ చెన్నారావు, రాష్ట్ర కిసాన్ నాయకులు దాసరి దానియేలు, జిల్లా ఐ యన్ టి యు సి అధ్యక్షులు కొత్తా సీతారాములు,జిల్లా యువజన కాంగ్రెస్,సేవాదళ్ అధ్యక్షులు వేజెండ్ల సాయి కుమార్, సయ్యద్ గౌస్, జిల్లా కాంగ్రెస్ నాయకులు మూడుముంతల గంగరాజు యాదవ్ ముళ్ళపూడి సీతారాములు, కొండూరి కిరణ్,యన్ ఎస్ యు ఐ నాయకులు యశ్వంత్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# వెనిజులాపై అమెరికా దాడులను ఖండించాలి..

## అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా సిఐటియు ర్యాలీ..




**జీడిమెట్ల, పెన్ పవర్, జనవరి 6:** వెనిజులా దేశ సార్వభౌమాధికారాన్ని కాలరాస్తూ అమెరికా చేపడుతున్న దాడులు, ఆంక్షలను తీవ్రంగా ఖండించాలని సిఐటియు నేతలు డిమాండ్ చేశారు. అమెరికా సామ్రాజ్యవాద విధానాలకు వ్యతిరేకంగా మంగళవారం సిఐటియు కుత్బుల్లాపూర్ మండల కమిటీ ఆధ్వర్యంలో షాపూర్‌నగర్ రైతు బజార్ నుంచి శుభం హెూటల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.. ఈ సందర్భంగా సిఐటియు మేడ్చల్‌ఉమల్కాజిగిరి జిల్లా ఉపాధ్యక్షులు ఈ. దేవదానం, కుత్బుల్లాపూర్ మండల కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ మాట్లాడుతూ.. వెనిజులా అధ్యక్షుడు నికోలాస్ మధురో, ఆయన భార్యను అమెరికా బలగాలు నిర్బంధించడం దారుణమని, ఇది ఒక స్వతంత్ర దేశంపై అమెరికా అహంకారపూరిత దాడికి నిదర్శనమని అన్నారు.. ప్రపంచవ్యాప్తంగా వెనిజులాకు మద్దతుగా సంఘీభావం వెల్లువెత్తుతోందని, అయినా అమెరికా తన సామ్రాజ్యవాద ధోరణిని కొనసాగిస్తోందని విమర్శించారు. వెనిజులాలోని అపారమైన చమురు నిక్షపాలను దోచుకోవడమే అమెరికా అసలు లక్ష్యమని, అందుకోసం రాజకీయ, సైనిక ఒత్తిడులు తెచ్చిపెడుతోందని ఆరోపించారు. "భారత్ నన్ను సంతోషపెట్టకపోతే మళ్లీ టారిఫ్‌లు విధిస్తాం" అంటూ అమెరికా అధ్యక్షడు ట్రంప్ బెదిరింపులకు దిగడం అమెరికా దిగజారుడుతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. వెంటనే వెనిజులా అధ్యక్షడు మధురో, ఆయన భార్యను విడుదల చేయాలని, వెనిజులా నుంచి అమెరికా సైన్యాన్ని ఉపసంహరించుకోవాలని సిఐటియు డిమాండ్ చేసింది. లేనిపక్షంలో అమెరికా తన చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

ఈ ర్యాలీలో సిఐటియు నాయకులు జి.వెంకన్న_. శీను, తిమ్మప్ప, మధు, గోపి, మల్లారెడ్డి, యాదవరెడ్డి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

# సెంటిమెంట్ నమ్ముకున్న గులాబీ దళం



**హైదరాబాద్, జనవరి 6, పెన్ పవర్:**

బఅఆర్ఎస్ మరోసారి ప్రజాదరణ కోసం సెంటిమెంటు మంత్రాన్నే నమ్ముకుందాడ? మరీ ముఖ్యంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఃచంద్రబాబును టార్గెట్ చేయడం కూడా అందుకేనాడ? మరి ఈ మంత్రం ఫలిస్తుందా..?

గతంలోలా ప్రజలు మళ్లీ కేసీఆర్ సెంటిమెంటును ప్రజలు గౌరవిస్తారాడ? ప్రస్తుతం బీఆర్ఎస్ సెంటిమెంట్ రాజకీయాలను చూస్తుంటే ఎవరికైనా ఇదే డౌటొస్తుంది.కృష్ణా జలాల పంపకం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై మాట్లాడే క్రమంలో కేసీఆర్.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడిని టార్గెట్ చేయడం ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. పాలమూరు రంగారెడ్డి డీపీఆర్ వెనక్కి రావడానికి కారణం చంద్రబాబు అని ఆరోపించారు. అదే సమయంలో అవసరం లేకపోయినా పెట్టుబడుల సదస్సు గురించి ప్రస్తావించారు. ఇటీవల రేవంత్ ప్రభుత్వం ఎంవోయూలపై చేస్తున్న ప్రచారాన్ని విమర్శిస్తూ.. గతంలో చంద్రబాబు హయాంలో విశాఖలో జరిగిన సదస్సులో స్టార్ హోటల్ వంట మనుషులతో ఒప్పందాలు చేయించారని ఎద్దేవా చేశారు. పాలమూరును దత్తత తీసుకుని చంద్రబాబు మోసం చేశారని, కేవలం శిలాఫలకాలతోనే కాలం గడిపారని విమర్శించారు. ప్రస్తుతం రేవంత్ రెడ్డి పాలన చంద్రబాబు డైరెక్షన్‌లోనే సాగుతోందని, అందుకే తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం వెనక్కి తగ్గుతోందని విమర్శించారు.కేసీఆర్ మళ్లీ తెలంగాణ సెంటిమెంట్ ను రగిలించే ప్రయత్నం చేస్తున్నారని నిపుణులు చెబుతున్నారు. రేవంత్ రెడ్డిని చంద్రబాబుతో ముడిపెట్టడం ద్వారా, తెలంగాణ ప్రయోజనాలను పక్క రాష్ట్రానికి తాకట్టు పెడుతున్నారనే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ భావిస్తున్నారని అంచనా వేస్తున్నారు. ఒకే దెబ్బకు ఇద్దరు ముఖ్యమంత్రులను టార్గెట్ చేయడం ద్వారా, తానొక్కడే తెలంగాణ హక్కుల కోసం పోరాడే యోధుడినని నిరూపించుకునే వ్యూహం ఇందులో ఉందని అనుకోవచ్చు.అయితే,ప్రధాన సమస్య అయిన కృష్ణా జలాల వివాదం కన్నా చంద్రబాబుపై వ్యక్తిగత విమర్శలే ఎక్కువగా హైలైట్ అవ్వడం బీఆర్ఎస్‌కు మైనస్ అయ్యే అవకాశం ఉందని మరికొందరు భావిస్తున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అనుమతులు, నీటి వాటాల గురించి కేసీఆర్ చేసిన లోతైన విశ్లేషణ కన్నా, చంద్రబాబుపై చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో ఎక్కువగా ట్రోల్ అవుతున్నాయి. దీనివల్ల చర్చ ప్రాజెక్టుల నుంచి రాజకీయ వ్యక్తిగత దూషణలకు మళ్లింది. ప్రస్తుతం తెలంగాణలో అధికారంలో లేని చంద్రబాబును అంతగా టార్గెట్ చేయడం వల్ల ఏపీ-తెలంగాణ మధ్య మళ్లీ ఉద్రిక్తతలు పెరుగుతాయే తప్ప, ప్రస్తుత సమస్యలకు పరిష్కారం దొరకదని సామాన్యులు భావిస్తున్నారు.

# మావోయిస్టుల్లో మిగిలింది వారే...

**హైదరాబాద్, జనవరి 6, పెన్ పవర్:** తెలంగాణను మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ప్రభుత్వం వ్యూహాత్మక అడుగులు వేస్తోంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో ఉన్న 17 మంది తెలంగాణ వాదులు జనజీవన స్రవంతిలో కలిస్తే.. రాష్ట్రం నుంచి ఆ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగవుతుందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. లొంగిపోయిన వారికి పునరావాస ప్యాకేజీతో పాటు అన్ని విధాలా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.తెలంగాణ రాష్ట్రాన్ని మావోయిస్టు రహిత రాష్ట్రంగా మార్చే దిశగా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం వ్యూహాత్మక అడుగులు వేస్తోందని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో కొనసాగుతున్న తెలంగాణ వాళ్లంతా జన జీవన స్రవంతిలో కలిస్తే.. రాష్ట్రం నుంచి ఆ సిద్ధాంతం పూర్తిగా కనుమరుగవుతుందని స్పష్టం చేశారు. ఈ క్రమంలో అడవుల్లో ఉన్నవారు లొంగిపోయి శాంతియుత జీవనం గడపాలని ఆయన విజ్ఞప్తి చేశారు. డీజీపీ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. ప్రస్తుతం మావోయిస్టు పార్టీలో వివిధ హోదాల్లో తెలంగాణకు చెందిన 17 మంది ఉన్నారు వీరిలో కేంద్ర కమిటీలో నలుగురు, రాష్ట్ర కమిటీలో ఐదుగురు, డివిజన్ కమిటీలో ఆరుగురు, అండర్‌గ్రౌండ్‌లో ఒకరితో పాటు మరొకరు ఉద్యమంలో కొనసాగుతున్నారు.ఈ 17 మంది మావోయిస్టులపై ప్రభుత్వం మొత్తం రూ. 2.25 కోట్ల భారీ రివార్డును ప్రకటించింది. వీరు గనుక ఆయుధాలు వీడి లొంగిపోతే.. పునరావాస ప్యాకేజీ కింద ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని డీజీపీ హామీ ఇచ్చారు. ప్రస్తుతం అడవుల్లో ఉన్న ఆ 17 మందిలో ఐదుగురు మహిళలు ఉన్నట్లు డీజీపీ అధికారికంగా ప్రకటించారు. వీరంతా కీలకబాధ్యతల్లో ఉన్నట్లు సమాచారం. మహిళా మావోయిస్టులు లొంగిపోతే వారి కుటుంబాలకు కూడా ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన పేర్కొన్నారు.కాగా, గత కొన్నేళ్లుగా తెలంగాణలో మావోయిస్టుల ప్రాబల్యం గణనీయంగా తగ్గుతూ వస్తోంది. కీలక నేతలు చనిపోవడం, లొంగిపోవడం పార్టీని ఆత్మరక్షణలో పడేసింది. ఇటీవల మావోయిస్టు పార్టీలో కీలక నేతగా ఉన్న పాక హనుమంతు ఎన్‌కౌంటర్‌లో మరణించడం పార్టీకి పెద్దఎదురుదెబ్బగా మారింది. సుదీర్ఘ కాలం పాటు అండర్‌గ్రౌండ్‌లో ఉన్న అగ్రనేత రాజిరెడ్డి ఇటీవల పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఆయనతో పాటు టాప్ మావోయిస్టు బర్సే దేవా మరికొందరు కీలక నాయకులు కూడా హింసా మార్గాన్ని వీడి జనజీవన స్రవంతిలో కలిశారు. ఈ పరిణామాలు మిగిలి ఉన్న 17 మందిపై కూడా ఒత్తిడి పెంచుతున్నాయి. 'ఆపరేషన్ కగార్' గడువు ముగిసేలోపే తెలంగాణ పూర్తిస్థాయిలో మావోయిస్టు రహిత రాష్ట్రంగా అవతరిస్తుందని డీజీపీ ధీమా వ్యక్తం చేశారు.మారుతున్న సామాజిక, రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో సాయుధ పోరాటం ద్వారా సాధించేది ఏమీ లేదని, ప్రజాస్వామ్య పద్ధతిలో సమస్యలనుపరిష్కరించుకోవాలని పోలీసులు కోరుతున్నారు. లొంగిపోయిన వారికి ఇంటి స్థలాలు, పిల్లల చదువు, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ప్రభుత్వం భరోసా కల్పిస్తున్నా

# జన్నారం నుండి కవ్వాల్ గ్రామాల్లో రవాణా కష్టాలు: బస్సు వేయాలని ప్రజల డిమాండ్

### నరకయాతన పడుతున్న విద్యార్థులు







**ఉమ్మడి అదిలాబాద్ జిల్లా, పెన్ పవర్, జనవరి 6:**అద్దంలాంటి రోడ్డున్నా తిరగని ఆర్టీసీ చక్రం.. 15 వేల మందికి 'ప్రయాణం' ఒక సాహసయాత్ర? ఒకవైపు దేశం డిజిటల్ విప్లవంతో దూసుకుపోతోంది.. మరోవైపు తెలంగాణ ప్రభుత్వం అత్యాధునిక రవాణా సౌకర్యాల గురించి ప్రగల్భాలు పలుకుతోంది. కానీ, మంచిర్యాల జిల్లా జన్నారం మండలంలోని కవ్వాల్ అటవీ ప్రాంత ప్రజలకు మాత్రం ఈ మాటలు ఆకాశపురాణాల్లాగే కనిపిస్తున్నాయి. దాదాపు 10 గ్రామాలు, 20 తండాల పరిధిలోని 15 వేల జనాభా దశాబ్దాలుగా రవాణా నరకాన్ని అనుభవిస్తోంది. 'రోడ్డు బాగుంటేనే బస్సు వేస్తాం' అన్న అధికారుల మాటలు నీటి మూటలయ్యాయి. నేడు రోడ్డు అద్దంలా మెరుస్తున్నా.. టీజీఎస్‌ఆర్టీసీ బస్సు మాత్రం ఆ దారి కన్నెత్తి చూడటం లేదు.

?ఆటో టాపులపై 'భవిష్యత్తు' వేలాడాల్సిందేనా?

?జన్నారం నుంచి కవ్వాల్ వరకు సాగే ప్రయాణం నిత్యం ఒక యుద్ధాన్ని తలపిస్తోంది. ఉదయం 9 గంటలవుతుందంటే చాలు.. జన్నారం, పోనకల్, కిష్టాపూర్, చర్లపల్లి, దేవునిగూడెం, కామన్ పల్లి, కవ్వాల్ గ్రామాలకు చెందిన విద్యార్థులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోడ్లపైకి వస్తున్నారు. బస్సు లేకపోవడంతో చేసేదేమీ లేక ప్రైవేట్ ఆటోలను ఆశ్రయిస్తున్నారు.

?భయానక దృశ్యాలు: ఒక్కో ఆటోలో పరిమితికి మించి 15 నుండి 20 మందిని ఎక్కించుకుంటున్నారు.

?వేలాడుతూ ప్రయాణం: ఆటో వెనుక, టాపుల పైన విద్యార్థులు వేలాడుతూ వెళ్తుంటే ఏ క్షణంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు.

?కూలీల కష్టార్జితం 'ఆటో' పాలు!

?రవాణా సౌకర్యం లేకపోవడం కేవలం భద్రతా సమస్యే కాదు, పేద కుటుంబాలకు తీరని ఆర్థిక భారం కూడా.

?అధిక ఛార్జీలు: కవ్వాల్ నుండి జన్నారం వెళ్లడానికి ఒక్కొక్కరికి రూ. 35 వసూలు చేస్తున్నారు.

?వార్షిక భారం: స్కూలు విద్యార్థులకు ఏడాదికి సుమారు రూ. 15,000 కేవలం ప్రయాణానికే ఖర్చవుతోంది.

?ప్రత్యామ్నాయం లేక: కాలేజీ విద్యార్థులు మైనర్లు అయినప్పటికీ, గత్యంతరం లేక వేల రూపాయలు వెచ్చించి బైక్‌లపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. అదే ఆర్టీసీ బస్సు ఉంటే ఈ అదనపు ఖర్చు తగ్గడమే కాకుండా భద్రత కూడా ఉంటుందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

?అధికారుల నిర్లక్ష్యం.. ఇంకెన్నాళ్లు?

?cగతంలో రోడ్డు లేదని సాకు చెప్పారు, ఇప్పుడు అద్భుతమైన రోడ్డు ఉన్నా బస్సు ఎందుకు వేయరు?c అని గ్రామస్తులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. విద్యార్థి సంఘాలు, నాయకులు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఆర్టీసీ అధికారుల్లో చలనం లేకపోవడం గమనార్హం. అధికారులు మేల్కొని ఏదైనా భారీ ప్రమాదం జరిగాక స్పందిస్తారా? లేక ముందే మేల్కొని బస్సు సౌకర్యం కల్పిస్తారా? అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

?ప్రజల డిమాండ్:

?జన్నారం - కవ్వాల్ మార్గంలో ఉదయం మరియు సాయంత్రం వేళల్లో కనీసం రెండు ఆర్టీసీ సర్వీసులను తక్షణమే ప్రారంభించాలి.

?విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సు ట్రిప్పులను ఏర్పాటు చేయాలి.

?మైనర్ల బైక్ ప్రయాణాలను నియంత్రించి, రవాణా వ్యవస్థను క్రమబద్ధీకరించాలి.

?ఓట్ల కోసం పల్లెలకు వచ్చే నాయకులు, ఏసీ గదుల్లో కూర్చునే అధికారులు ఇప్పటికైనా ఈ 15 వేల మంది కన్నీటి ప్రయాణాన్ని ఆపాలని, తక్షణమే బస్సు సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

# ఉచిత బస్సు పథకంతో వృద్ధులకు తప్పని తిప్పలు: (బస్సు ఆపరు.. మా గోడు వినరు)





**పెన్ పవర్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా జనవరి 6 :**ప్రభుత్వాన్ని నిలదీసిన వృద్ధులు.. మీడియా సాక్షగా ఆవేదనరాష్ట్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకం ఒకవైపు ప్రశంసలు అందుకుంటున్నప్పటికీ, మరోవైపు క్షేత్రస్థాయిలో వృద్ధులకు అది శాపంగా మారుతోంది. cమహిళలకు ఫ్రీ ఇచ్చారు సరే.. మరి మమ్మల్ని ఎందుకు విస్మరిస్తున్నారు?c అంటూ పలువురు వృద్ధులు అధికారులను, ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారు. బస్సు స్టాపుల్లో వృద్ధులు కనిపిస్తే డ్రైవర్లు బస్సులు ఆపడం లేదని, అసలు తమను మనుషులుగా కూడా చూడటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**స్టాపుల్లో ఆపరు.. ఎక్కడో తీస్కుల్లి ఆపుతారు!**

వృద్ధులు మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ తమ గోడును వెళ్లబోసుకున్నారు. cమేము గంటల తరబడి బస్సు స్టాపుల్లో వేచి చూస్తున్నాం. బస్సు వస్తుందని ఆశగా చూస్తే, డ్రైవర్లు మాత్రం బస్సును స్టాపులో ఆపకుండా వేగంగా వెళ్ళిపోతున్నారు. ఒకవేళ ఆపినా, స్టాపుకు చాలా దూరంలో తీస్కుల్లి ఆపుతున్నారు. అంత దూరం మేము పరిగెత్తలేక, బస్సు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాంc అని వారు వాపోయారు.

**కండక్టర్ల నిర్లక్ష్యం.. పెరిగిన వేధింపులు**

బస్సు ఎక్కిన తర్వాత కూడా తమకు సరైన గౌరవం దక్కడం లేదని, సీట్లు ఖాళీగా ఉన్నా కూర్చోనివ్వడం లేదని కొందరు వృద్ధులు ఆరోపిస్తున్నారు. ఫ్రీ బస్సు ప్రయాణం వల్ల రద్దీ పెరిగిందని, దీనివల్ల వయసు మళ్లిన తమను తోసేస్తున్నారని, కనీసం మానవత్వం కూడా చూపడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. cమాకు రాయితీ పాసులు ఉన్నాయి, మేము డబ్బులు కట్టే ప్రయాణం చేస్తాం, అయినా మమ్మల్ని ఎందుకు ఎక్కించుకోరు?c అని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు.

**ప్రభుత్వానికే మా విన్నపం..**

కేవలం పథకాలు ప్రవేశపెట్టడమే కాదు, అవి అందరికీ ఇబ్బంది కలగకుండా అమలు అవుతున్నాయో లేదో చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని వారు డిమాండ్ చేస్తున్నారు.

**బస్సు స్టాపుల్లో తప్పనిసరిగా బస్సులు ఆపాలి.**

వృద్ధులను చూసి బస్సు ఆపని డ్రైవర్లపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రతి బస్సులో వృద్ధులకు కేటాయించిన సీట్లు వారికే దక్కేలా చూడాలి. ఈ సమస్యపై ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి, క్షేత్రస్థాయిలో డ్రైవర్లు, కండక్టర్లకు తగిన ఆదేశాలు జారీ చేయాలని వృద్ధులు కోరుతున్నారు. లేనిపక్షంలో తమ నిరసనను ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు.

## కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయండి

**బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు**



**పెన్ పవర్ న్యూస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో:**భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రివర్యులు కల్వకుంట్ల తారక రామారావు జనవరి 7వ తేది బుధవారం ఉదయం 10:00 గం:లకు ఖమ్మం జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు మంగళవారం జూలూరుపాడు మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఈ పర్యటనలో భాగంగా ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన గ్రామ పంచాయతీ ప్రజాప్రతినిధులకు (సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు) ఆత్మీయ అభినందనసభ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈసభలో ముఖ్యఅతిథిగా కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) గారు పాల్గొని గ్రామ ప్రజాప్రతినిధులను శాలువాతో సత్కరించి, అభినందిస్తారన్నారు.ఈ సభకు వైరా నియోజకవర్గ పరిధిలోని. మండల అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, మాజీ ఎంపీపీలు ఎంపీటీసీలు మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ శాఖ అధ్యక్షులు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయవలసిందిగా గిరిబాబు కోరారు.

### కొత్త పేరు ట్యాగ్ లైన్ సూచించండి..

### 4 వేల రూపాయల బహుమతి గెలుచుకోండి....

## అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి

### వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు కొత్త పేరు, ట్యాగ్ లైన్, లోగో ఏర్పాటు

### వెలుగుమట్ల అర్బన్ పార్క్ పబ్లిక్ కాంపిటీషన్ గోడప్రతిని ఆవిష్కరించిన అదనపు కలెక్టర్






**పెన్ పవర్ న్యూస్ ఖమ్మం బ్యూరో :**వెలుగుమట్ల అర్బన్ పార్క్ కు కొత్త పేరు, ట్యాగ్ లైన్ సూచించి, నాలుగు వేల రూపాయల బహుమతి గెలుచుకోవాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ తో కలిసి వెలుగుమట్ల అర్బన్ పార్క్ పబ్లిక్ కాంపిటీషన్ గోడప్రతిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వెలుగుమట్ల అర్బన్ పార్కుకు కొత్త పేరు, ట్యాగ్ లైన్, అధికారిక లోగో తయారు చేయాలని అటవీ శాఖ నిర్ణయించిందని, ఇందులో భాగంగా పబ్లిక్ కాంపిటీషన్ చేపడుతున్నట్లు తెలిపారు. జనవరి 10 నుంచి జనవరి 20 వరకు పబ్లిక్ కాంపిటీషన్ ఉంటుందని, ఆసక్తి గలవారు వెలుగుమట్ల అర్బన్ పార్కుకు కొత్త పేరు ట్యాగ్ లైన్ సూచించాలని, విజేతలకు 4 వేల రూపాయల బహుమతి లభిస్తుందని అన్నారు. అలాగే వెలుగుమట్ల అర్బన్ పార్కు కొత్త అధికారిక లోగో డిజైన్ చేసే వారికి కూడా 4 వేల రూపాయలు బహుమతి ఉంటుందని అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, ఎఫ్డివో మంజుల, తహసీల్దార్లు, ఫారెస్ట్, ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు

### ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘా ఉండాలి..

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

**నెలవారీ ఇవిఎం గోడౌన్ తనిఖీ చేపట్టిన జిల్లా కలెక్టర్**






**ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 6** :ఇవిఎం గోడౌన్ వద్ద పటిష్ట నిఘాతో భద్రతా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ ఆవరణలోని ఇవిఎం గోడౌన్ ను జిల్లా కలెక్టర్ నెలవారీ తనిఖీ చేశారు.ఇవిఎం గోడౌన్ సీళ్లను కలెక్టర్ పరిశీలించారు. అగ్నిమాపక పరికరాలు, సిసి కెమెరాలను పరిశీలించి, పనిచేస్తున్నవి, లేనిది అడిగి తెలుసుకున్నారు. అత్యవసర సైరన్ మొగుతున్నది పరిశీలించారు. భద్రతా సిబ్బంది షిఫ్టు ల వారి విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా లోపాలు లేకుండా చూడాలన్నారు. చుట్టూ ప్రహారీ గోడ నిర్మాణం, ఎఫ్ఎల్సి చేపట్టుటకు కావాల్సిన ఏర్పాట్లు చేపట్టాలన్నారు.కలెక్టర్ తనిఖీ సందర్భంగా కలెక్టరేట్ ఎన్నికల సూపరింటెండెంట్ ఎం.ఏ. రాజు, ఆర్ అండ్ బి డిఇ లఖన్ నాయక్, ఎన్నికల డిటి అన్సారీ, ఆర్ అండ్ బి ఏఇ లలిత, అధికారులు తదితరులు ఉన్నారు.

## వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ కి కృతజ్ఞతలు







**ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 6:** కొనిజర్ల మండల కేంద్రంలో పెద్ద గోపతి గ్రామపంచాయతీలో అనంతరం గ్రామంలో ఖమ్మం మరియు తనికెళ్ల వెళ్లే రహదారిపై అనంతారం జంక్షన్ లో రోడ్డుపై గుంటలు పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతుండగా ఆ విషయాన్ని తెలుసుకున్న కొనిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊటుకూరి రంజిత్ ఉన్నత అధికారులు దృష్టికి తీసుకువెళ్లగా ఉన్నత అధికారులు స్పందించి ఈరోజు అనంతారం లో పడిన గుంటలను పొడవుగా మరియు పెద్దగోపతి లో వెటర్నరీ హాస్పటల్ మెయిన్ రోడ్డు మీద ఉన్న గుంటను పొడవడం జరిగినది పనులు దగ్గరుండి పరిశీలించిన కొనిజర్ల మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు ఊటుకూరి రంజిత్ పనులను దగ్గరుండి పరిశీలించి ఉన్నత అధికారులకు ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పెద్దగోపతి గ్రామపంచాయతీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపినారు



## ముసాయిదా ఓటరు జాబితాపై అభ్యంతరాలను

# లిఖితపూర్వకంగా సమర్పించాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో పెన్ పవర్ జనవరి 6** మున్సిపాలిటీ ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి ఏవైనా అభ్యంతరాలు ఉంటే రాజకీయ పార్టీలు, లిఖితపూర్వకంగా నిర్ణీత గడువులోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ కోరారు. మంగళవారం ఐ డి ఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 01-10-2025 నాటికి ఓటరుగా నమోదు అయిన ప్రతి వ్యక్తిని ఎపిక్ కార్డులో పేర్కొన్న చిరునామా ఆధారంగా ఆయా డివిజన్‌లకు సంబంధించిన ఓటరు జాబితాలో చేర్చడం జరిగిందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాకు సంబంధించి ఈ నెల 9వ తేదీ వరకు స్వీకరించే అభ్యంతరాలను పూర్తిగా పరిశీలించి, పరిష్కరించిన అనంతరం 10వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రచురించనున్నట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు. జిల్లాలోని కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌తో పాటు అశ్వరావుపేట, ఇల్లందు మున్సిపాలిటీల పరిధిలోని మొత్తం 106 వార్డులకు గాను 1,85,750 మంది ఓటర్లతో డ్రాఫ్ట్ ఓటరు జాబితాను సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. ఈ జాబితాలో



పేరు, చిరునామా, వార్డు, ఇతర వివరాల్లో ఏవైనా పొరపాట్లు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులు దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీల ప్రతినిధులు ఒకే కుటుంబానికి చెందిన వ్యక్తులకు వేర్వేరు వార్డుల్లో ఓట్లు నమోదై ఉండటంపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన జిల్లా కలెక్టర్, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు వార్డుల్లో నమోదు అయి ఉంటే, సంబంధిత దరఖాస్తుల ఆధారంగా వాటిని సరిచేసే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, ఇల్లందు మున్సిపల్ కమిషనర్ చింత శ్రీకాంత్, అశ్వరావుపేట మున్సిపల్ కమిషనర్ నాగరాజు, సిపిఎం తులసీరామ్, బిజెపి నోముల రమేష్, సిపిఐ శ్రీనివాస్, జే ఎస్ పి సందీప్, ఐ ఎన్ సి లక్ష్మణ్ అగర్వాల్, టిడిపి కళ్యాణ లక్ష్మీపతి, బీఎస్పీ శంకరయ్య, ఏ ఏ పి రమేష్ తదితర రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగ అధికారులు పాల్గొన్నారు.

## నేలమ్మకు పునరుజ్జీవం - పంట వ్యర్థాలతో బయోచార్..

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్..**

**భూమి ఆరోగ్య పరిరక్షణకు, పర్యావరణ సంరక్షణకు బయోచార్ వినియోగం కీలకం**









**ఖమ్మం జిల్లా బ్యూరో, పెన్ పవర్, జనవరి 6:**చుంచుపల్లి మండలం గరిమెళ్ళపాడు నర్సరీ ఆవరణలో ఆధునిక, పర్యావరణహిత వ్యవసాయ పద్ధతులపై, ముఖ్యంగా బయోచార్ వినియోగంపై మంగళవారం ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. మహారాష్ట్రకు చెందిన ప్రముఖ బయోచార్ నిపుణులు పరశురం కైలాస్ అఖరే ఆధ్వర్యంలో ఈ శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లాలో విస్తారంగా లభ్యమయ్యే పత్తి కట్టెలు, మొక్కజొన్న చొప్ప వంటి పంట వ్యర్థాలను ఉపయోగించి తక్కువ ఖర్చుతో బయోచార్ తయారు చేసే విధానాన్ని ప్రత్యక్ష ప్రదర్శన ద్వారా రైతులకు అవగాహన కల్పించారు. ప్రత్యేకంగా ఇనుముతో తయారుచేసిన పరికరంలో పంట అవశేషాలను నియంత్రిత ఉష్ణోగ్రత వద్ద కాల్చి నాణ్యమైన బయోచార్ ఉత్పత్తి చేసే విధానాన్ని నిపుణులు వివరించారు.అనంతరం తయారైన బయోచార్‌ను గోమూత్రం, ఆవు పేడ మిశ్రమంలో 15 రోజుల పాటు ఉంచి సక్రియం (యాక్టివేషన్) చేసి ఎరువుగా వినియోగించే విధానాన్ని వివరించారు. ఈ విధానం వల్ల నేలలో సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి, భూమి సారవంతత మెరుగుపడటంతో పాటు తేమ నిల్వ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ, జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల విస్తీర్ణంలో పత్తి, మొక్కజొన్న వంటి ప్రధాన పంటలు సాగు అవుతున్నాయని తెలిపారు. పంట కోత అనంతరం రైతులు పత్తి కట్టెలు, మొక్కజొన్న చొప్పను పొలాల్లోనే కాల్చడం వల్ల నేలలోని విలువైన సూక్ష్మజీవులు పూర్తిగా నాశనం అవుతున్నాయని, దీంతో పాటు సేంద్రియ పదార్థం దగ్ధమై భూమి సారవంతత గణనీయంగా తగ్గిపోతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రక్రియ వాతావరణ కాలుష్యానికి కారణమవుతూ మానవ ఆరోగ్యానికి, పర్యావరణానికి తీవ్రమైన హానిని కలిగిస్తోందన్నారు. ఇకపై ఏ రైతు పత్తి కట్టెను పొలాల్లో కాల్చకుండా బయోచార్ తయారీకి ఉపయోగించాలన్నారు. బయోచార్‌లో ఉన్న సూక్ష్మ రంధ్రాల కారణంగా పంటలకు నీరు పెట్టిన సమయంలో యూరియా తదితర పోషక ఎరువులు వృథా కాకుండా అందులోనే నిల్వ ఉంటాయని కలెక్టర్ తెలిపారు. ఈ పోషకాలు నెమ్మదిగా పంటలకు అందడంతో అధిక దిగుబడులు సాధించవచ్చని అన్నారు. బయోచార్‌ను నేల తల్లికి అర్పించినట్లయితే, నేల తల్లి మనకు మెరుగైన ఫలితాలను అందిస్తుందని కలెక్టర్ భావోద్వేగంగా వ్యాఖ్యానించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆదాయం వచ్చే ఈ విధానాన్ని రైతులు విస్తృతంగా అమలు చేయాలని సూచించారు.అదేవిధంగా బయోచార్ వినియోగం వ్యవసాయ రంగానికే పరిమితం కాకుండా డ్రైనేజీలు, పౌల్ట్రీ షెడ్లు, పశువుల శాలలు, చెత్త నిల్వ ప్రాంతాలు తదితర ప్రాంతాల్లో కూడా విస్తృతంగా ఉపయోగించవచ్చని తెలిపారు. దీని వల్ల దుర్వాసనలు తగ్గి గాలి పరిశుభ్రమవడంతో పాటు జీవన వాతావరణం మెరుగుపడుతుందని చెప్పారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజారోగ్యానికి కూడా బయోచార్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. నేపథ్యంలో జిల్లావ్యాప్తంగా బయోచార్‌ను పెద్ద ఎత్తున తయారు చేసి వినియోగించేందుకు రైతులు, స్వయం సహాయక సంఘాలు, వ్యవసాయ శాఖ, ఉద్యానవన శాఖలు, పంచాయతీ సమన్వయంతో ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. గ్రామ స్థాయిలో బయోచార్ యూనిట్లు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన శిక్షణ, సాంకేతిక సహకారం అందించే దిశగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ విధంగా బయోచార్ వినియోగాన్ని ప్రోత్సహిస్తే రైతుల ఆదాయం పెరగడంతో పాటు జిల్లాలో సుస్థిరమైన, పర్యావరణ హిత వ్యవసాయ విధానాలు మరింత బలోపేతం అవుతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, గ్రామ సర్పంచ్ వాడే రాములు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పాల్వంచ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ పద్మ, ఎన్ఎస్ఎస్ అధికారులు వేముల కామేశ్వరరావు, శ్రీదేవి, ఎన్సిసి ఇంచార్జ్ ధర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్లు రమేష్,రాంబాబు, బూర్గంపాడు, టేకులపల్లి, చంద్రుగొండ, పాల్వంచ, దుమ్ముగూడెం, జూలూరుపాడు, గుండాల మండలాల ఎంపీడీవోలు అధ్యాపకులు రాజ్ కుమార్ సూపర్డెంట్ విజయ్ ప్రసాద్, వార్డు మెంబర్లు, విద్యార్థులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


# టీపీసీసీ లీగల్ సెల్ఆర్టీఐ విభాగాల.. రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా రాజేష్ నాయక్.

## నియామక పత్రం అందజేసిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్..

## నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి హనుమంత్ రెడ్డికి, రాజేష్ కృతజ్ఞతలు..



అశోక్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందుకుంటున్న రాజేష్ నాయక్..



TELANGANA PRADESH CONGRESS COMMITTEE
LEGAL, HUMAN RIGHTS & RTI DEPARTMENT

Offi : 040-24603718
Fax : 040-24602383

Ponnam Ashok Goud
Advocate,
Chairman

Gandhi Bhavan,
Hyderabad

Dear Rajesh Garu 31-12-2025

I am happy to inform that you have been appointed as Jt-Convenor to the Telangana Pradesh Congress Committee Legal, Human Rights & RTI Department with immediate effect.

I hope and trust that you will strengthen the Congress party and continuously work for strengthening the leadership of Smt. Sonia Gandhi Ji, Sri. Rahul Gandhi ji, Hon'ble President, AICC Sri Mallikarjun Kharge ji, Hon'ble AICC Legal Cell Chairman Sri Abhishek Manu Singhvi, and Hon'ble CM Sri. A Revanth Reddy garu, Sri Bomma Mahesh Kumar Goud, President, TPCC.

I wish you all success.

Ponnam Ashok Goud
Chairman

Sri Korra Rajesh Naik.
Advocate,
H No 10-37/1 Dundigal Thanda, Dunidagar Manda.
Medchal Maklajigiri District.
Mobile No 864053033

Flat No. 101, Legend Apartments, Somajiguda, Hyderabad - 500 082
Mobile: 9440733088 E mail: ponnamasg@gmail.com

హైదరాబాద్, పెన్ పవర్, జనవరి 6:మేడ్చల్ జిల్లా దుండిగల్ తండా2కు చెందిన న్యాయవాది కె.రాజేష్ నాయక్‌ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) లీగల్ సెల్ మరియు ఆర్టీఐ విభాగాల తెలంగాణ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా నియమించారు. మంగళవారం టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్ రాజేష్ నాయక్‌కు అధికారికంగా నియామక పత్రాన్ని అందజేశారు.. ఈ సందర్భంగా రాజేష్ నాయక్ మాట్లాడుతూ, తన నియామకానికి సహకరించిన టీపీసీసీ లీగల్ సెల్ చైర్మన్ పొన్నం అశోక్ గౌడ్‌కు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలను హనుమంత్ రెడ్డిలకు, రాజేష్ నాయక్ కృతజ్ఞతలు తెలిపారు.. లీగల్ సెల్ సేవలు రాష్ట్రవ్యాప్తంగా ప్రతి కాంగ్రెస్ కార్యకర్తకు అందేలా పనిచేస్తామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో కాంగ్రెస్ కార్యకర్తలపై నమోదైన తప్పుడు కేసుల విచారణలో న్యాయ సహాయం అందించడం ద్వారా లీగల్ సెల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ప్రతి కార్యకర్త లీగల్ సెల్ సేవలను వినియోగించుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు.. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు పక్కదారి పట్టకుండా పేద ప్రజల తరపున అండగా నిలుస్తామని, ఆర్టీఐ చట్టంపై ప్రజల్లో అవగాహన పెంచడంతో పాటు మానవ హక్కుల పరిరక్షణ కోసం పోరాటం చేస్తామని రాజేష్ నాయక్ పేర్కొన్నారు.. ఈ కార్యక్రమంలో దేవాతో పాటు రాష్ట్ర లీగల్ సెల్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# అకాడమీల పేరుతో ముందస్తు అడ్మిషన్లు..!

## కార్పొరేట్ విద్యా మాఫియాపై "యుఎస్‌ఎఫ్‌ఐ" ఫైర్..

### ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యదర్శి, కృష్ణ ఆదిత్య ఐఏఎస్ కు వినతిపత్రం..

**నారాయణ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ అనుమతులు లేకుండానే అకాడమీల పేరుతో ముందస్తు నోటిఫికేషన్‌తో ముందే అడ్మిషన్లు ప్రారంభించి, విద్యార్థుల నుంచి రూ.1020 వేల వరకు వసూళ్లు చేస్తున్నారని యుఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు.. గ్రామస్థాయిలో పీఆర్‌వోల ద్వారా తల్లిదండ్రులను మభ్యపెట్టి ఇప్పటికే 50 శాతం అడ్మిషన్లు పూర్తి చేశారని,ఫిర్యాదులు చేసినప్పటికీ, జిల్లా అధికారులు, స్పందించడం లేదని, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు అండదండగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు..**
**అక్రమ అడ్మిషన్లపై సమగ్ర విచారణ జరిపి యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని యుఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్ చేసింది.. హైదరాబాద్, పెన్ పవర్, జనవరి 6:**



కృష్ణ ఆదిత్య ఐఏఎస్ కు యుఎస్‌ఎఫ్‌ఐ నాయకులు వినతిపత్రం..

### గ్రామస్థాయి నుండే విద్యార్థుల సమీకరణ..

కార్పొరేట్ విద్యాసంస్థలు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించి, ముందస్తుగా "సీటు రిజర్వేషన్" ప్రక్రియతో రూ.10-20 వేలు ఫీజును రిజిస్ట్రేషన్ కింద వసూళ్ళకు పాల్పడి, తల్లిదండ్రుల జేబులు లూటీ చేసి, రూ. లక్షలు, కోట్లు గడిస్తున్నారని విద్యార్థి సంఘం నాయకులు ఆరోపించారు.. అయితే ఈ వ్యవహారాన్ని, పటిష్ఠంగా గ్రామస్థాయి పీఆర్‌వోలను నియమించి తల్లిదండ్రులకు మాయమాటలు చెప్పి అడ్మిషన్లు చేసుకోవడంలో నిమగ్నమైనట్టు తెలిపారు.. ఇప్పటికే కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో సుమారు 50 శాతం అడ్మిషన్లు పూర్తయ్యాయని తెలిపారు..అకాడమీల పేరుతో ప్రభుత్వ అనుమతులు లేకుండానే వందల సంఖ్యలో విద్యాసంస్థలు నడుస్తున్నాయి..

తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్ నారాయణ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలు "అకాడమీల" పేరుతో ప్రభుత్వ అనుమతులు లేకుండానే ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ విద్యార్థులుతల్లిదండ్రుల జేబులను లూటీ చేస్తున్నారని "యుఎస్‌ఎఫ్‌ఐ (యూనిటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) తీవ్రంగా ఆరోపించారు.. ఈ అక్రమాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యుఎస్‌ఎఫ్‌ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యదర్శి, ఐఏఎస్ కృష్ణ ఆదిత్యకు మంగళవారం వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా యుఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ రవి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్యాగారి వెంకటేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పొరేట్ విద్యాసంస్థల ఆగడాలు హద్దులు దాటాయని మండిపడ్డారు. ప్రభుత్వ నోటిఫికేషన్ రాకముందే అడ్మిషన్లు ప్రారంభించి, ప్రతి విద్యార్థి నుంచి, సీటు రిజర్వేషన్ అండ్ రిజిస్ట్రేషన్ పేరుతో రూ.10 నుంచి 20 వేల వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. ఇది ప్రభుత్వ నిబంధనలకు పూర్తిగా విరుద్ధమని స్పష్టం చేశారు..

### క్రిమినల్ కేసులు నమోదుకు ఫిర్యాదు..

కార్పొరేట్ విద్యా మాఫియాకు సహకరించడంలో స్థానిక విద్యాశాఖ అధికారుల పాత్ర కిలకంగా ఉంది.. ఈ అక్రమ అడ్మిషన్‌లపై చూసీచూడనట్టు వ్యవహరిస్తున్న అధికారులపై, సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.. జిల్లా అధికారులకు పలుమార్లు విన్నవించినా, కనీసం ఆయా కళాశాలలను సందర్శించిన పరిస్థితి కూడా లేదని పేర్కొన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్న స్థానిక అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పర్మిషన్ లేకుండా నడుస్తున్న నారాయణ, శ్రీ చైతన్య జూనియర్ కళాశాలల యాజమాన్యాలపై క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని, ముందస్తు అడ్మిషన్లపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బ్యాగారి వెంకటేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి, నాయకులు నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# అంగారక సంకష్ట చతుర్థి పూజలందుకున్న మహాగణపతి

**హైదరాబాద్ పెన్ పవర్:** అంగారక సంకష్ట చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ మహాగణపతి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది.మంథని పట్టణంలోని తమ్మిచెరువు కట్ట వీధిలో గల శ్రీ మహాగణపతి దేవాలయం ఎంతో విశిష్టతతో కూడుకున్నది.ప్రతి పౌర్ణమి తర్వాత వచ్చే కృష్ణ పక్షంలోని నాలుగో రోజును సంకటహర చతుర్థి అంటారు. చతుర్థి తిథి మంగళవారంతో కలిసి వస్తే దానిని అంగారక చతుర్థిగా పిలుస్తారు.మంగళవారం వచ్చిన చవితి (చతుర్థి) తిథి వెయ్యి సూర్యగ్రహణాల పుణ్యకాలానికి సమానం. కృష్ణ అంగారక చవితి నాడు గణపతి ప్రీత్యర్థం ఉపవసిం చిన భక్తునికి వచ్చే పుణ్యం అనంతం వెయ్యి పడగల ఆదిశేషునకు సైతం ఆ వైభవాన్ని వివరించుట వీలుకాదు.సంస్కృతంలో 'అంగారక' అంటే "మంటలా ఎర్రగా ఉన్నది" అని అర్థం, ఇది మంగళవారం (కుజుడి రోజు) సూచిస్తుంది.పుష్య మాసం కృష్ణపక్షంలో అంగారక చతుర్థి రావడం చాలా అరుదు. అది గణేశోపాసకులకు అత్యంత విశేషం. మిగితా మాసాల్లో వచ్చిన కృష్ణ అంగారక చతుర్థులకంటే ఇవి చాలా ఫలప్రదం.ఈ రోజున వినాయకుడిని పూజించడం వలన కోరికలు నెరవేరుతాయని, జీవితంలోని సమస్యలు తొలగిపోతాయని భక్తులు నమ్ముతారు. ఈ రోజున చేసే పూజ వల్ల గణపతితో పాటు కుజుడు (మంగళ గ్రహం) అనుగ్రహం కూడా లభిస్తుందని, ఇది జాతకంలోని కుజ దోషాలను కూడా నివారిస్తుందని పండితులు చెబుతారు.గణపతి ముందు 16 దీపాలను వెలిగించి షోడశ గణపతులను ఆవహన చేసే ప్రక్రియ కూడా ఈరోజు చేస్తారు.కృష్ణ అంగారక చవితి నాడు గణపతిని పూజిస్తే అతి శీఘ్రంగా ఫలాలు పొందవచ్చు. అందునా ఈ రోజు ఉపవాసం చేస్తే ఏడాదిలో వచ్చి ప్రతి సంకటహర చవితికి ఉపవాసం చేసిన ఫలితం వస్తుందని కొన్ని గ్రంథాల్లో చెప్పగా, 21 సంకటహర చవితులు ఉపవసించిన ఫలం లభిస్తుందని కొన్ని పురాణ గ్రంథాల్లో కనిపిస్తుంది. అంగారక చవితి నాడు గణపతిని ఆరాధిస్తే కుజుడు కూడా ప్రసన్నుడవుతాడు. కుజుడు గణపతి కోసం చేసిన వెయ్యి సంవత్సరాల తపః ఫలితం ఈరోజు గణపతిని ఆరాధించిన వారికి లభించి, వారు అభివృద్ధి చెందుతారని గణపతి చెప్పాడట. ఈ రోజున భక్తులు గణేశుడిని పూజించి, ఉపవాసం ఉంటారు. కొత్తగా సంకష్టహర చతుర్థి ఉపవాసాలు ఉండాలనికునేవారు ఈరోజు నుండి దీక్షను ప్రారంభిస్తారు. రాత్రి చంద్రుడిని చూసిన తర్వాత ఉపవాసం విరమిస్తారు. ఇది అడ్డంకులను తొలగించి మరియు జ్ఞానం, శ్రేయస్సు,అదృష్టానికి దేవుడైన గణేశుడికి అంకితం చేయబడిన పవిత్రమైన రోజు. మంగళవారం సంకష్ట చవితి కలిసిరావ డం చాలా విశేషం. ఇంతటి విశిష్టమైన అంగారక చతుర్థి నాడు సంకటహర చతుర్థి వ్రతం ఆచరించడం వల్ల జాతకంలో కుజ దోష సమస్యలు తొలగిపోతాయి. అంతేకాకుండా చేసే పనులలో సంకటాలు తొలగి విజయాలు చేకూరుతాయని శాస్త్రవచనం. అంగారక చతుర్థి సందర్భంగా నూతనంగా ఉపవాసాలు పట్టేవారు ఈరోజు సంకల్పం చేసుకుంటారు. ఈరోజు సంకష్టి ఉపవాసాలు ఉండేవారు మహా గణపతికి ప్రత్యేక పూజలు అభిషేకాలు చేస్తూ ఉంటారు. అలాగే ప్రతినిత్యం ఎందరో భక్తులు ఆలయంలో గణపతిని దర్శించుకొని వెళుతుంటారు.

# గట్టిగా నిలదీస్తామన్నారు... ఇప్పుడేమో జారుకున్నారు...!!

## బీఆర్ఎస్ సభ్యులపై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వాన్ని నిలదీస్తామంటూ బీరాలు పలికిన బీఆర్ఎస్ సభ్యులు... ఇప్పుడు సభ నుంచే జారుకున్నారని మంత్రి శ్రీధర్ బాబు ఎద్దేవా చేశారు. బీఏసీలో అనేక ప్రశ్నలు లేవనెత్తి... ఇప్పుడు అసలు కనిపించడమే లేదన్నారు. శాసన సభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యులు గైర్హాజరు కావడం సరికాదన్నారు. అసలు వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం సభలో కృష్ణా జలాలపై ప్రజెంటేషన్ ఏర్పాటు చేసిందన్నారు. దీనిపై అభ్యంతరాలు ఉంటే సభలో చెప్పాలి, కానీ... బయట చెప్పడం ఎంత వరకు సమంజసమన్నారు. "స్పీకర్" ను అగౌరవ పరిచేలా వ్యవహరించిన బీఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని సభాపతికి విజ్ఞప్తి చేశారు.

# జూరాల ప్రాజెక్టును సందర్శించిన బీఆర్ఎస్ నేతలు

**మహబూబ్ నగర్:పెన్ పవర్:** పాలమూరులో పడావు పడ్డ ప్రాజెక్టులపై బీఆర్ఎస్ సమరభేరి మోగించింది. ఈ క్రమంలో జూరాల ప్రాజెక్టును మాజీ మంత్రులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్ లతో కూడిన బీఆర్ఎస్ ప్రతినిధుల బృందం సందర్శించింది. ప్రాజెక్టులను పడావు పెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వారు తీవ్రంగా ఎండగట్టారు.

# హెచ్సియూ భూములు ప్లాన్ ఫెయిల్ ఉర్దూ యూనివర్సిటీ భూములు గుంజుకుందాం

**హైదరాబాద్ పెన్ పవర్:** గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీకి చెందిన 50 ఎకరాల భూములను వెనక్కి తీసుకోవడానికి రంగం సిద్ధం అయిందని ఆ యూనివర్సిటీ విద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఉర్దూ యూనివర్సిటీకి చెందిన 200 ఎకరాల్లో నిరుపయోగంగా ఉన్న 50 ఎకరాలను వెనక్కి తీసుకుంటామని ప్రభుత్వం నోటీసులు ఇచ్చింది. డిసెంబర్ 15లోపు ఖాళీగా ఉన్న 50 ఎకరాలను జప్తు చేయాలని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డికి నోటీసులు జారీ చేసింది. 1998లో యూనివర్సిటీకి ఈ కేటాయింపులు జరిగాయి. వర్సిటీ భూములను కాజేస్తే మరో హెచ్చసీయూ తరహా ఉద్యమం జరుగుతుందని విద్యార్థులు హెచ్చరించారు.

# జీహెచ్ఎంసి పరిధి బీజేపీ నేతల భేటీ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈరోజు జీహెచ్ఎంసీ పరిధిలోని ముఖ్య నాయకులతో సమీక్ష సమావేశంలో రాష్ట్ర బీజేపీ చీఫ్ రామచంద్రరావు పాల్గొన్నారు. ఈ సమావేశంలో జీహెచ్ఎంసీ వార్డుల విస్తరణ అంశం, రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న అసంబద్ధ నిర్ణయాల వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటిపై వచ్చిన అభ్యంతరాలు, అలాగే రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డా. ఎన్. గౌతమ్ రావు, ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్చ సహా పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ప్రజా ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యంగా బీజేపీ స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతుంది.

# రైతు సమస్యలపై బీఆర్ఎస్ బంద్

**అదిలాబాద్: పెన్ పవర్:** ఆదిలాబాద్ జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలపై బీఆర్ఎస్ పార్టీ పోరుబాట నిర్వహించింది. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న ఆదిలాబాద్ పట్టణ బందుకు పిలుపునిచ్చారు. పట్టణ బంద్ నేపథ్యంలో ఆదిలాబాద్ ఆర్టీసీ డిపో ఎదుట బీఆర్ఎస్ నాయకులు బైటాయించారు. అఖిలపక్షం రైతు సంఘాల నేతలు, ప్రజా సంఘాలు వాణిజ్య వ్యాపార సంస్థలు బందుకు స్వచ్ఛందంగా మద్దతు తెలిపారు. బంద్ కారణంగా ఆర్టీసీ బస్సులు డిపో నుంచి బయటకు రాలేదు.

బంద్ నేపథ్యంలో ఆదిలాబాద్ ఆర్టీసీ బస్ డిపో ఎదుట బైఠాయించిన బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న తోపాటు బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి మావలా పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# లులు మాల్, హైపర్ మార్కెట్ లో 50 శాతం సేల్ హైపర్, ఫ్యాషన్, ఎలక్ట్రానిక్స్ లో భారీ డిస్కౌంట్

**హైదరాబాద్ పెన్ పవర్:** లులు మాల్, లులు హైపర్ మార్కెట్ లో భారీ సేల్ జరగనుంది. ఈ నెల 8 నుంచి 11వ తేదీ వరకు లులు ఆన్ సేల్ నిర్వహిస్తున్నట్లు మాల్ రీజినల్ మేనేజర్ మహ్మద్ షరీఫ్ తెలిపారు. ఈ మేరకు మాల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ 4 రోజుల పాటు వినియోగదారుల కోసం భారీ డిస్కౌంట్స్ అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాల్ మేనేజర్ ఎజిల్ అరసన్ మాట్లాడుతూ.. ఈ సేల్ లో 50 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు. 200 లకు పైగా బ్రాండ్లు ఈ మెగా సేల్ లో పాల్గొంటున్నాయని చెప్పారు. ఫుడ్ కోర్టుతో పాటు మాల్ లోని ఇతర రిటైల్ స్టోర్లు సైతం ఇందులో పాల్గొంటున్నాయన్నారు. ఈ సందర్భంగా నిర్వహిస్తున్న షాప్ అండ్ విన్ కాంటెస్ట్ లో కనీసం రూ.1999 షాపింగ్ చేసిన వాళ్లు లక్కీ డ్రా ద్వారా కారు గెలుచుకునే అవకాశం ఉందన్నారు. వినియోగదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు...గేమ్స్, రోడ్స్ పై కూడా 50% డిస్కౌంట్ ఇస్తున్నట్లు తెలిపారు...

# కీచక హెడ్ మాస్టర్ కు దేహశుద్ధి

**కుత్బుల్లాపూర్: పెన్ పవర్:** గత కొంత కాలంగా పాఠశాలలో చదువుకునే విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ప్రధానోపాధ్యాయుడికి దేహశుద్ధి చేసిన ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితేడగత కొంత కాలంగా ఎలాంటి అనుమతులు లేకుండా చంద్రగిరి నగర్ కాలనీ లో నిస్సీ స్వాతి పేరుతో ఓ పాఠశాల నడిపిస్తున్నారు విజయ్ కుమార్ అనే వ్యక్తి.పాఠశాలలో చదివే విద్యార్థినులతో ఇంట్లో పనులు చేపించడం,వారి పట్ల అసభ్యంగా ప్రవర్తించడం చేస్తూ ఎవరికైనా చెబితే పరీక్షల్లో ఫెయిల్ చేస్తానని బెదిరించేవాడని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.సోమావారం నాడు పాఠశాలలో పదవ తరగతి చదివే విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించాడని తల్లితంద్రులకు చెప్పింది బాలిక. ఈ ఘటన పట్ల కోపోద్రిక్తులైన తల్లిదండ్రులు పాఠశాల పై దాడి చేసి ఫర్నీచర్ ధ్వంసం చేశారు.

ప్రధానోపాధ్యాదైన విజయ్ కుమార్ ను దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఇలాంటి అనుమతులు లేని పాఠశాలల పై చర్యలు తీసుకుంటామని ఎం ఈ వో జెమినీ కుమారి తెలిపారు .

# అన్వేష్ కు చుక్కలు...

**హైదరాబాద్, జనవరి 6 పెన్ పవర్:** :నా అన్వేషణ అనే యూట్యూబ్ చానల్ ద్వారా అన్వేష్ ట్రావెలర్ గా మంచి గుర్తింపును సంపాదించుకున్నాడు. దేశ విదేశాలను తిరుగుతూ ఆ దేశంలో ఉన్న వింతలు విశేషాలను చూపిస్తూ వచ్చాడు. తద్వారా తన మాటలకు అట్రాక్ట్ అయిన జనాలు అతన్ని ఫాలో చేస్తూ అతను పెట్టే కంటెంట్ చూస్తూ వచ్చారు. అయితే ఆయన రీసెంట్ గా హిందూ దేవుళ్లను దూషిస్తూ మాట్లాడిన మాటలు గాని, గరిజపాటి గారిని ఉద్దేశించి వాడిన బూతు పదాలు గానీ,



శివాజీని తిట్టిన విషయాల్లో చాలామంది చాలా రకాలుగా స్పందించారు. ముఖ్యంగా హిందూ దేవుళ్లను తిట్టడం పైన హిందూవులు తమ మనోభావాలు దెబ్బతిన్నాయంటూ అతని మీద కేసులను ఫైల్ చేశారుడ మొత్తానికైతే అన్వేష్ ను విమర్శించని వారు లేరుడఇక తనను పట్టుకోడానికి తెలుగు రాష్ట్రాల పోలీసులు తీవ్రంగా ప్రయత్నం చేస్తున్నారు. పోలీసులకు దొరక్కుండా ఉండటానికి అన్వేష్ విదేశాల్లోనే తిరుగుతున్నాడు. ఇప్పటికే తన యూట్యూబ్ ఛానల్ నుంచి ఐదు నుంచి ఆరు లక్షల మంది సబ్స్క్రైబర్లు తన చానెల్ ను అన్ సబ్స్క్రైబ్ చేయడంతో అన్వేష్ కి చుక్కలు కనిపిస్తున్నాయి.రీసెంట్గా ఏ జ్యాడ్ అజయ్ ను అన్వేష్ బెదిరిస్తూ పెట్టిన వీడియో ద్వారా అన్వేష్ భారీగా నెగెటివిటిని మూటగట్టుకున్నాడుడ అన్వేష్ మీద దాదాపు 30 కేసుల వరకు నమోదు చేశారు. ఇక అన్వేష్ ఇండియాకి రావాలంటే ముందుగా అతని యూట్యూబ్ ఛానల్ ఐడి, ఇన్స్టా ఐడి దొరికితే అది సాధ్యమవుతుందని పోలీసులు దానికోసం తీవ్రమైన ప్రయత్నాలైతే చేస్తున్నారు.ఏది ఏమైనా కూడా ఇంకో పది రోజుల్లో అన్వేష్ కు సంబంధించిన ఛానల్స్ ఐడిని పట్టుకొని అతన్ని ఇండియాకి రప్పిస్తామని హైదరాబాద్ పోలీసులు చాలా తీవ్రమైన కసరత్తులు చేస్తున్నారు. ఇక ఈ క్రమంలోనే అతను కనక ఇండియాకి వస్తే మాత్రం అతను హిందువుల ఆగ్రహానికి గురవ్వడమే కాకుండా అతన్ని వదిలేస్తే హిందువులందరు అతన్ని చితకబడుతారు. అలాంటి వ్యక్తిని పోలీసులు నిజంగానే ఇండియాకి తీసుకొస్తారా లేదంటే ఈ ఇష్యూ సైడ్ ట్రాక్ అయ్యేంత వరకు మేనేజ్ చేస్తున్నారా? అనేది తెలియాల్సి ఉందిడ

## చూడి బజార్లో ఉచిత మెగా వైద్య శిబిరం

**హైదరాబాద్ పెన్ పవర్:** పేద, మధ్య తరగతి ప్రజలు వ్యాధులను తొలిదశలో గుర్తించడంలో వెనుకబడు తున్నారని సత్యసుందర్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండే షన్ వ్యవస్థాపకుడు ఠాకూర్ గోపాల్ సింగ్ అన్నారు. చుడీ బజార్లో మెడిసిటీ ఆసుపత్రి సహకారంతో రెండు రోజుల ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..సమాజంలో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, వ్యాధులను గుర్తించి, నిర్మాణాత్మకమైన వైద్యం అందించడానికి నిత్యం మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సామాజిక, ఆరోగ్య సంస్థలు, బాధ్యతాయుత కార్పొరేట్ సంస్థలు కలిసి పనిచేసినపుడే సమాజంలో సంక్షేమ కార్యక్రమాలు దీర్ఘకాలం పాటు కొనసాగుతాయన్నారు. మొదటి రోజు వెయ్యి మందికిపైగా ప్రజలకు వైద్య సేవలు అందించామన్నారు.

# అధికారుల్లో విజిలెన్స్ గుబులు

**హైదరాబాద్, జనవరి 6, పెన్ పవర్:** పది, పదిహేను సంవ త్సరాలుగా నీటిపారుదల శాఖలో జరిగిన అనేక అవినీతి, అక్రమాలు, అవకత వకలపై రాష్ట్ర విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ విభాగం వేగంగా స్పందించి విచారణ జరిపింది. అన్ని సాంకేతికాంశాలు పరిశీలించింది. అక్రమాల నిగ్గుదే ల్చింది. ముఖ్యంగా కాళేశ్వరంపై ప్రభు త్వం నుంచి విచారణకు ఆదేశాలు వచ్చిం దే తడవుగా.. పకడ్బందీగా విచారణ చేసి నివేదికను ప్రభుత్వానికి అందించింది.విజిలెన్స్ విచారణలో బయటపడ్డ వాస్తవాలను, అలాగే విజిలెన్స్ నివేదికలను కూడా జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ మెచ్చుకుని తమ నివేదికలోనూ అవే అంశా లను పొందుపర్చింది. దీనితో విజిలెన్స్ విచారణ పకడ్బందీగా, లోతుగా చేశారనే ప్రశంసలు సర్వత్రా వచ్చాయి. అయితే, మిడ్ మానేరు ప్రాజెక్టు నిర్మాణానికి సం బంధించి రూ. 1,000 కోట్ల అవినీతి, అక్రమాలు, అవకతవకలు జరిగాయని లిఖితపూర్వకంగా ఫిర్యాదు అందడంతో.. విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ విభాగం అధికారులు రంగంలోకి దిగారు.అలాగే కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో రూ. 500 కోట్ల వర కు, బుద్ధారం కెనాల్ నిర్మాణంలో రూ. 30 నుంచి 40 కోట్ల వరకు అక్రమాలు జరిగాయనే ఫిర్యాదులు అంద డంటో విజిలెన్స్ విభాగం అదే వేగంతో అంతే పకడ్బందీగా విచారణను చేపట్టింది. విచారణ అనంతరం సిద్ధం చేసిన మూడు నివేదికలు కూడా విజిలెన్స్ కమిషన్ వద్దకు చేరి నెలల కాలం అయ్యింది. ప్రభుత్వానికి మాత్రం చేరడం లేదు. ప్రభుత్వం నుంచి పచ్చజెండా ఊపితేనే.. ఈ విజిలెన్స్ నివేది కలకు మోక్షం కలుగుతుందనే విమర్శలకు ఊతమిస్తున్నాయి.ఇంతటి ముఖ్య మైన విజిలెన్స్ నివేదికలపై రాష్ట్ర ప్రభు త్వం ఎందుకు దృష్టి సారించడం లేదనే చర్చ అధికారవర్గాల్లోనూ మొదలయ్యిం ది. మిడ్ మానేరుపై విచారణ సందర్భంగానే అప్పటి నీటిపారుదల శాఖ ఈఎన్ సీని అక్కడి నుంచి మార్చాల్సి వచ్చింది. కారణం.. మిడ్ మానేరులో ఈ అవకతవకలు జరిగినప్పుడు ఆయన మిడ్ మానేరు సీఈగా బాధ్యతలు నిర్వర్తించారు.బీఆర్ఎస్ హ యాంలో కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంలో భారీగా అక్రమాలు జరిగాయని, అ లాగే బుద్ధారం కెనాల్ నిర్మాణంలోనూ కోట్ల విలువైన అవకతవకలు జరిగాయని విజిలెన్స్ విచారణలో వాస్తవాలు బయటపడ్డా యని సమాచారం. బయటపడ్డ వాస్తవాలు, అక్రమాలు, అవినీతి, అవకతవకలకు బాధ్యులనుకూడా గుర్తించి పూర్తిస్థాయి నివేదికల ను కమిషన్కు పంపించినా.. ప్రభుత్వం మా త్రం ఈ నివేదికలపై దృష్టి సారించకపోవడం గమనార్హం.ఫిర్యాదులు రాగానే.. ఎంత వేగంగా విచారణకు ఆదేశించారో, విచారణ నివేదికలు సిద్ధం అయిన తరువాత.. అదే స్థాయిలో సర్కారు స్పందించడం లేదనే వి మర్శలు వస్తున్నాయి. మూడు ముఖ్యమైన విజిలెన్స్ నివేదికలు కమిషన్ కార్యాలంలో మూలన పడిఉంటే.. కనీసం వీటిని బయటకు తీసుకొచ్చి, బాధ్యులపై చర్యలకు ఆదేశా లు ఇవ్వాల్సిన రాష్ట్ర ప్రభుత్వం మాత్రం మీనమేషాలు లెక్కపెట్టినట్టుగా వ్యవహరించడంపై సర్వత్రా అసంతృప్తి వ్యక్తమవుతోంది.

## తప్పులు లేకుంగా ఓటర్ లిస్టు

## బీఎల్వోలతో జీహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్

**రంగారెడ్డి పెన్ పవర్:** రాజేంద్రనగర్ సర్కిల్ బండ్లగూడ జాగిర్ మునిసిపల్ కార్యాలయం లో బూత్ లెవల్ అధికారులతో (దీూాలు) ఓటర్ జాబితా తయారీపై రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో బూత్ లెవెల్ అధికారులతో కలిసి ఓటర్ జాబితాలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త పని చేయాలని డిప్యూటీ కమిషనర్ అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు, 2002 జాబితాతో 2025 ఎన్నికల జాబితా మ్యాపింగ్ వర్గాలుగా విభజించడం జరిగిందని ఆయన అన్నారు. చనిపోయిన ఓటర్లు, ఇతర ప్రదేశాలకు వెళ్లిన ఓటర్ సభ్యులను తొలగించడం జరుగుతుందని, తప్పు నమోదు ఉన్న వారి వివరాలను సరి చేయడం జరుగుతుందని, అలాగే క్రొత్త ఓటర్లను నమోదు చేయడం లాంటి సూచనలు సలహాలు ఇచ్చారు. ఇంటి ఇంటికి సర్వేను పక్కాగా నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నిర్వహించాలని, ఓటర్ జాబితాలో తప్పులు లేకుండా ఉండాలని సూచించారు...

## సఫిల్ గూడా ట్యాంకు పక్కన ఉన్న చెట్టుకు ఉరి వేసుకుని గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**సికింద్రాబాద్: పెన్ పవర్:** మంగళవారం ఉదయము సఫిల్ గూడా ట్యాంక్ పై వ్యక్తి ఉరి వేసుకున్నాడు. అక్కడ పని చేస్తున్న సెక్యూరిటీ గార్డు బండి ప్రసాద్ ఫిర్యాదు మేరకు నేరేడ్మెట్ పోలీసులు కేసు రిజిస్టర్ చేసారు. పోస్టుమార్టం కోసము డెడ్ బాడీని గాంధీ హాస్పిటల్ కి తరలించారు. మృతుని వయస్సు 35 నుంచి 45 సంవత్సరములు వుండవచ్చు. నలుపు రంగు షర్టు మరియు వైట్ కలర్ జీన్స్ ప్యాంటు కలిగి ఉన్నాడు. అతని యొక్క పాయింట్ జేబులో నాలుగో తారీఖు కర్ణాటకలోని గౌరీ బీదనూర్ నుండి కాచిగూడ ప్రయాణం చేసినట్టు రైల్వే టికెట్ దొరికింది.

## సరూర్ నగర్ పోలీసు స్టేషన్ ను పరిశీలించిన సీపీ మహంతి

**హైదరాబాద్ పెన్ పవర్:** సరూర్నగర్ పోలీస్ స్టేషన్ను మల్కాజ్గిరి పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి ఆకస్మికంగా తనిఖీ చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలకు సీపీ శ్రీకారం చుట్టారు. సరూర్నగర్ పీఎస్ పనితీరు, రికార్డులు, ప్రజా సమస్యల పరిష్కారంపై ఇన్స్పెక్టర్ సైదిరెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్ పరిధిలో నమోదైన కేసులు, పెండింగ్ ఫిర్యాదులు, బీట్ పోలీసింగ్, సిబ్బంది విధులు నిర్వహిస్తున్న తీరు గురించి సీపీ సమగ్రంగా సమీక్షించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో ఎల్బీనగర్ డీసీపీ అనురాధ, ఏసీపీతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# రేవంత్ చాణుక్య రాజకీయం

**హైదరాబాద్, జనవరి 6, పెన్ పవర్:**
రాజకీయాలలో ఉన్న వారంతా వ్యూహాలు రచిస్తుంటారు. అందులో కొంతమంది వ్యూహాలు మాత్రమే సఫలీకృతం అవుతుంటాయి. తెలంగాణ రాజకీయాలలో వ్యూహాలు రచించి.. పరిణామాలను తనకు అనుకూలంగా మార్చుకోవ డంలో మొదటి నుంచి కూడా కేసీఆర్ అగ్రస్థానంలో ఉండేవారు. 2014 నుంచి 2018 వరకు ఆయన వ్యూహాలు తెలంగాణలో విజయవంతం అయ్యాయి. ఎప్పుడైతే రెండు ఉప ఎన్నికలలో ఓటమి.. గ్రేటర్హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో ఊహించని ఫలితాలు రావడంతో.. కెసిఆర్ కు బ్యాడ్ టైం మొదలైంది. కెసిఆర్ అధికారంలో ఉన్నప్పుడు మీడియాను తన అదుపులో ఉంచుకునేవారని.. భయభ్రాంతులకుగురి చేసేవారని ఆరోపణలు వినిపించేది. ఇప్పుడు కెసిఆర్ అధికారా నికి దూరం కావడంతో.. కేవలం గులాబీ మీడియా మాత్రమే ఆయన దండకం చదువుతోంది. ఇక మిగతా మీడియా పెద్దగా పట్టించుకోవడంలేదు.ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి కొనసాగుతున్నారు. ఆర్థికంగా బలమైన, రాజకీయంగా శక్తివంతుడైన కేసీఆర్ ను ఎదిరించి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు. అంతేకాదు, కంటోన్మెంట్,జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవడంలో విజయవంతం అయ్యారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ మూడోవంతు స్థానాలను గెలుచుకోవడంలోరేవంత్ రెడ్డి సఫలీకృతులయ్యారు. ఇదే ఊపులో పురపాలకం, నగర పాలక ఎన్నికలు నిర్వహించబోతున్నారు. ఇప్పటికే ఓటర్ల జాబితాను సిద్ధం చేస్తున్నారు.. గులాబీ మీడియా, గులాబీ పార్టీ అనుకూల సోషల్మీడియా ప్రతిరోజు బురద చిమ్ముతున్నప్పటికీ.. ఇష్టానుసారంగా విష ప్రచారం చేస్తున్నప్పటికీ రేవంత్ రెడ్డి ఏమాత్రం వెనుకడుగు వేయడం లేదు. పైగా తనకు ఎదురవుతున్న ప్రతిబంధకాల నుంచి విజయ పాఠాలు నేర్చుకుంటున్నారు.ఇటీవల నూతన సంవత్సరం సందర్భంగా రేవంత్ రెడ్డి ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ స్వగృహానికి వెళ్లారు.



ఆయనతో చాలాసేపు మాట్లాడారు. నూతన సంవత్సర శు భాకాంక్షలు తెలియజేశారు.వాస్తవానికి ఒక ముఖ్యమంత్రి హోదాలో రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లడం చాలామందికి ఆశ్చర్యాన్ని కలిగించింది. అయితే రాజకీయంగా వ్యూహాలను అమలు చేయడంలో రేవంత్ రెడ్డి కాస్త విభిన్నమైన శైలి. ముఖ్యంగామీడియాతో అనుకూలంగా ఉండడం.. మీడియా పెద్దల సలహాలు తీసుకోవడంలో రేవంత్ రెడ్డి ఎప్పటికీ ముందు వరుసలో ఉంటారు. పిసిసి అధ్యక్షుడు అయిన తర్వాత ఆయన ఎన్టీవీ, టీవీ5, ఏబీఎన్ ఆంధ్రజ్యోతికార్యాలయాలకు వెళ్లారు. తనకు సపోర్ట్ ఇవ్వాలని కోరారు. ఆ చానల్స్ యాజమాన్యాలతో నేరుగా భేటీ అయ్యారు.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావలసిన ఆవశ్యకతను వారికి చెప్పారు. వారి దగ్గర నుంచి సలహాలు కూడా స్వీకరించారు. వాటిని రేవంత్ రెడ్డి అమల్లోపెట్టి అధికారంలోకి వచ్చారు.అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ఆ మీడియా సంస్థలను దూరం పెట్టలేదు. అలాగని తనకు భజన చేసుకునేమాధ్యమాలుగా మార్చుకోలేదు. ప్రభుత్వపరంగా తాను వేగంగా పరిపాలన సాగిస్తూనే.. మీడియా పరంగా ఆ చానల్స్ యాజమాన్యాల సపోర్ట్ కోరారు. తద్వారా యాజమాన్యాలు కూడా రేవంత్ కు సుముఖంగా మారిపోయాయి. ఫలితంగా రేవంత్ చాణక్యం ఫలవంతమై.. తెలంగాణ రాష్ట్ర రాజకీయాలలో సరికొత్త శకాన్ని ఆవిష్కరిస్తుంది. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీపై ఏమాత్రం ప్రజలకు నమ్మకం లేని స్థితిలో.. రేవంత్ రెడ్డి పార్టీ పగ్గాలు అందుకున్నారు. సీనియర్ విమర్శలు చేస్తున్నప్పటికీ.. కుర వృద్ధులు అడ్డగోలుగా మాట్లాడుతున్నప్పటికీ.. కెసిఆర్ అడ్డు పుల్లలు వేస్తున్నప్పటికీ.. వాటన్నింటిని తట్టుకొని రేవంత్ రెడ్డి ఇక్కడ దాకా వచ్చారు. రాజకీయాలలో చాణక్యాన్ని ఎలా ప్రదర్శించాలో నిరూపించి చూపిస్తున్నారు. ఇదే సమయంలో తాను వేస్తున్న ఉచ్చుల్లో గులాబీ పార్టీ నాయకులు పడి గిలగిల కొట్టుకుంటున్నారు. ఒకప్పుడు ఈ పరిస్థితి కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఉండేది. ఇప్పుడు రేవంత్ రెడ్డి వల్ల కాంగ్రెస్ పార్టీ అప్పర్ హ్యాండ్ ప్రదర్శిస్తోంది.. కాకపోతే అధికారంలోకి ఉన్నామని రేవంత్ రెడ్డి తల బిరుసుతనాన్ని ప్రదర్శించడం లేదు. కేవలం ప్రజలు ఇచ్చిన అవకాశం లాగానే దీన్ని చూస్తున్నారు. అందువల్లే గులాబీ పార్టీ నేతలు ఏ స్థాయిలో ఆరోపణలు చేసినప్పటికీ.. రేవంత్ రెడ్డికి వ్యతిరేక ఫలితం రావడం లేదు. వ్యతిరేక స్వరం వినిపించడం లేదు.

# కవితమ్మ శపథం

**హైదరాబాద్, జనవరి 6, పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. గులాబీ కోటలో ముసలం పుట్టిందన్న వార్తలకు బలం చేకూర్చుతూ, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన నిర్ణయం తీసుకున్నారు. శాసన మండలివేదికగా ఆమె చేసిన ప్రకటన రాష్ట్ర రాజకీయాల్లో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఉద్యమ పార్టీగా ఎదిగిన బీఆర్ఎస్పై తీవ్ర ఆరోపణలు చేస్తూ, తన తండ్రి స్థాపించిన పార్టీతో పూర్తిగా తెగదెంపులు చేసుకుంటున్నట్టుప్రకటించారు. ఇన్నాళ్లు సాంస్కృతిక వేదికగా ఉన్న తెలంగాణ జాగృతిని ఇకపై పూర్తిస్థాయి రాజకీయ పార్టీగా మారుస్తున్నట్లు ప్రకటించారు.శాసన మండలిలో కవిత భావోద్వేగానికి గురై కంటతడి పెట్టడంచర్చనీయాంశమైంది. ఆమె మాటల్లో తీవ్రమైన ఆవేదన, ఆగ్రహం స్పష్టంగా కనిపించాయి. ముఖ్యంగా "ఇది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ" అని ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ అంతర్గత విభేదాల తీవ్రతను బయటపెట్టాయి. పుట్టింటి బంధాలను తెంచుకుని బయటకు వస్తున్నానని చెప్పడం ద్వారా, కేసీఆర్ కుటుంబంలోనూ, పార్టీలోనూ ఆమెకు దక్కిన ప్రాధాన్యతపై, లేదా ఆమె ఎదుర్కొన్న అవమానాలపైఅనేక అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. బీఆర్ఎస్ ఇప్పుడు ఉద్యమ ద్రోహులకు పునరావాస కేంద్రంగా మారిందని ఆమె విమర్శించడం గమనార్హం.తెలంగాణ ఉద్యమ సమయంలో బతుకమ్మ పండుగ ద్వారా సాంస్కృతికపునరుజ్జీవనానికి ప్రతీకగా నిలిచిన తెలంగాణ జాగృతి సంస్థ ఇప్పుడు రాజకీయ అవతారం ఎత్తనుంది. ఈ మేరకు కవిత కీలక ప్రకటన చేశారు. దీంతో జాగృతి ఇకపై కేవలం ఎన్జీవోగా కాకుండా, ఎన్నికల కమిషన్ గుర్తింపుపొందిన రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికలే లక్ష్యంగా ఈ కొత్త పార్టీ బరిలోకి దిగనుంది. విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, అన్ని వర్గాల ప్రజలే అజెండాగా ఈ పార్టీ పనిచేస్తుందని కవిత స్పష్టం చేశారు.
దీనిని బట్టి చూస్తే, కవిత కేవలం ఉద్వేగంతో ఈ నిర్ణయం




తీసుకోలేదని, దీని వెనుక ఒక పక్కా రాజకీయ వ్యూహం ఉన్నట్లు అర్థమవుతోంది. యువతను, అసంతృప్త వర్గాలను తన వైపు తిప్పుకునేందుకు ఆమెప్రయత్నిస్తున్నారు.కవిత నిర్ణయం బీఆర్ఎస్కు రాజకీయంగా దెబ్బేనని విశ్లేషకులు భావిస్తున్నారు. కవితకు మహిళల్లో, ముఖ్యంగా బతుకమ్మ ఆడే తెలంగాణ ఆడబిడ్డల్లో ఒక ప్రత్యేకమైన ఇమేజ్ ఉంది. ఆమె వేరు కుంపటి పెట్టడం వల్ల బీఆర్ఎస్కు పడాల్సిన సంప్రదాయ ఓట్లు, మహిళా ఓట్లు చీలిపోయే ప్రమాదం ఉంది. ఉద్యమ కాలం నుంచి పనిచేస్తున్న అనేక మంది కవిత వర్గీయులు బీఆర్ఎస్లో ఉన్నారు. ఇప్పుడు వారుకవిత వెంటే నడుస్తారా లేక కేసీఆర్ నాయకత్వంలోనే ఉంటారా అన్నది పార్టీలో గందరగోళం సృష్టిస్తుంది. సొంత కూతురే పార్టీ విధానాలను తప్పుబడుతూ, బయటకు రావడం ప్రత్యర్థి పార్టీలకు బలమైన ఆయుధంగామారుతుంది.కవిత కొత్త పార్టీ ఏర్పాటు కాంగ్రెస్, బీజేపీలకు పరోక్షంగా లాభం చేకూర్చే అవకాశం ఉంది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు లేదా బీఆర్ఎస్ అనుకూల ఓటు చీలిపోవడం వల్ల ముక్కోణపు పోటీ ఏర్పడి, అది ప్రధాన పార్టీల సమీకరణాలను మారుస్తుంది. అయితే, కవిత జాగృతి ద్వారా సెంటిమెంట్ను ఎంత బలంగా రగిలిస్తారు, యువతను ఎంతగా ఆకర్షిస్తారు అనే అంశంపైనే ఆమె పార్టీ భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది."వ్యక్తిగాంవెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగి వస్తా" అని కవిత చేసిన శపథం ఆమెలోని పట్టుదలను చూపిస్తోంది. అయితే, కుటుంబ పార్టీని, బలమైన నాయకత్వాన్ని ఎదిరించి, కొత్త పార్టీతో నెట్టుకురావడం అంత సులభం కాదు.కానీ, తెలంగాణ రాజకీయ యవనికపై జాగృతి రూపంలో కొత్త పోరాటం మొదలైందని మాత్రం కచ్చితంగా చెప్పవచ్చు. రాబోయే రోజుల్లో జరిగే పరిణామాలు రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మార్చే అవకాశం ఉంది.

# సిటీ చుట్టూ రేడియల్ రింగ్

**హైదరాబాద్, జనవరి 6, పెన్ పవర్:**
హైదరాబాద్ తాగునీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు జలమండలి 8 వేల కోట్ల రూపాయలతో భారీ ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరం చుట్టూ సుమారు 140 కిలోమీటర్ల మేర 'రేడియల్ రింగ్ మెయిన్'పేరుతో ప్రధాన పైపులైన్ వ్యవస్థను నిర్మించనున్నారు. కృష్ణా, గోదావరి, మంజీరా వంటి అన్ని నీటి వనరులను ఈ రింగ్ మెయిన్తో అనుసంధానం చేస్తారు. దీనివల్ల ఏదైనా ఒక ప్రాంతంలో పైపులైన్ పాడైతే.. మరోమార్గం ద్వారా నీటిని మళ్లించి సరఫరాకు అంతరాయం లేకుండా చేయవచ్చు. నగరమంతటా 24 గంటల పాటు స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ఈ ప్రాజెక్టు ముఖ్య ఉద్దేశం.హైదరాబాద్ మహానగరం శరవేగంగావిస్తరిస్తోంది. పెరిగిన జనాభాకు తగ్గట్టుగా.. నగరంలోని ఏ ఒక్క ప్రాంతంలోనూ నీటి కరువు లేకుండా చూడాలని జలమండలి నడుం బిగించింది. దీని కోసం సుమారు 8 వేల కోట్ల రూపాయల భారీ బడ్జెట్తో ఒకప్రత్యేకమైన తాగునీటి ప్రాజెక్టును సిద్ధం చేస్తోంది. నగరానికి నలుదిశల నుండి వచ్చే నీటి వనరులను ఒకదానితో ఒకటి కలిపేలా ఒక భారీ నెట్వర్క్ను నిర్మించడమే ఈ ప్లాన్ ముఖ్య ఉద్దేశం.సాధారణంగా నగరానికి ఒక్కోవైపు నుండి ఒక్కో నది లేదా రిజర్వాయర్ నీరు వస్తుంది. అయితే.. ఏదైనా ఒక పైపులైన్ పాడైతే ఆ ప్రాంతానికి నీటి సరఫరా పూర్తిగా నిలిచిపోతుంది. ఇలాంటి సమస్య రాకుండా ఉండటానికి, నగరం చుట్టూ సుమారు140 కిలోమీటర్ల మేర ఒక పెద్ద రింగు లాంటి ప్రధాన పైపులైన్ను ఏర్పాటు చేస్తారు. దీనినే 'రేడియల్ రింగ్ మెయిన్' అని పిలుస్తారు. దీనికి అదనంగా మరో 96 కిలోమీటర్ల మేర చిన్న పైపులైన్ల ద్వారా నగరంలోనివివిధ వాటర్ ట్యాంకులకు కనెక్షన్ ఇస్తారు.ప్రస్తుతం హైదరాబాద్కు కృష్ణా, గోదావరి నదులతో పాటు సింగూరు, మంజీరా.. జంట జలాశయాలైన ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నుంచి తాగునీరు అందుతోంది. ఈ కొత్తప్రాజెక్టు వల్ల ఈ నీటి వనరులన్నీ ఒకే వ్యవస్థతో అనుసంధానం అవుతాయి. ఉదాహరణకు మంజీరా పైపులైన్కు రిపేర్లు వస్తే.. వెంటనే అదే రింగ్ మెయిన్ ద్వారా గోదావరి లేదా కృష్ణా జలాలను ఆ ప్రాంతానికిమళ్లించవచ్చు. నగరం చివరన ఉన్న ప్రాంతాలకు కూడా సమానమైన నీరు అందుతుహైదరాబాద్ ప్రజలకు రోజులో ఎప్పుడైనా నీరు వచ్చేలా (24/7 నీటి సరఫరా) చేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఈ లక్ష్యాన్నిచేరుకోవాలంటే రింగ్ మెయిన్ వ్యవస్థ ఎంతో అవసరం. రాబోయే రెండేళ్లలో గోదావరి రెండు, మూడు దశల పనులు కూడా పూర్తవుతాయి. ఆ నీటిని కూడా ఈ రింగ్ మెయిన్కు కలిపితే.. భవిష్యత్తులో నీటి ఎద్దడి అనేమాట వినిపించదు.పాత పైపులైన్లు తరచూ పగిలిపోవడం వల్ల నీరు వృథా కావడమే కాకుండా... మరమ్మతులు చేసే వరకు ప్రజలు అల్లాడిపోతున్నారు. ఔటర్ రింగ్ రోడ్డు వెంబడి ఈ కొత్త పైపులైన్లు వేయడం వల్లనిర్వహణ కూడా సులభం అవుతుంది. ఈ భారీ ప్రాజెక్టు పూర్తయితే హైదరాబాద్ తాగునీటి అవసరాలకు రాబోయే 50 ఏళ్ల వరకు ఎటువంటి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

# మారుతున్న సమీకరణాలు

**విశాఖపట్టణం, జనవరి 6, పెన్ పవర్:** ఉత్తరాంధ్రలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వచ్చింది. ఎయిర్పోర్ట్ ట్రయల్ రన్ కూడా పూర్తయింది. జూన్ లో విమానాశ్రయాన్ని ప్రారంభించి.. జూలై నుంచి విమాన రాకపోకలు మొదలయ్యేలా చూడనున్నారు. ఎయిర్పోర్ట్ తో ఉత్తరాంధ్ర స్వరూపమే మారనుంది. అయితే ఇప్పుడు ఏపీలోనే భోగాపురం నియోజకవర్గం ఎంతో ప్రాధాన్యత కలిగిన రాజకీయ ప్రాంతం. అందుకే అక్కడ పట్టు కోసం అన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేస్తాయి. ప్రస్తుతం ఇక్కడ జనసేన ఎమ్మెల్యే లోకం మాధవి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే వచ్చే ఎన్నికల్లో ఈ స్థానం టిడిపి తీసుకుంటుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. భోగాపురం లాంటి ప్రాంతంలో అధికార పార్టీ ముద్రగా చూపాలన్నది టిడిపి నుంచి వస్తున్న అభిప్రాయం. పైగా ఈ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి క్షేత్రస్థాయిలో పట్టున్న ప్రాంతం. అందుకే వచ్చే ఎన్నికల్లో జనసేన ను తప్పించి.. తిరిగి టిడిపికి ఈ స్థానం కేటాయిస్తారని ప్రచారం జరుగుతోంది. భోగాపురం ఎయిర్పోర్ట్ కు అనుబంధంగా పర్యాటక ప్రాజెక్టులు సైతం రానున్నాయి. ఇందుకు గాను రాష్ట్ర ప్రభుత్వం 500 ఎకరాల భూమిని రిజర్వు కూడా చేసింది. మొన్నటి ఎన్నికల్లో నెల్లిమర్ల నియోజకవర్గాన్ని జనసేనకు కేటాయించారు. అయితే ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలంగా ఉంది. కానీ రాష్ట్రస్థాయిలో కుదిరిన పొత్తుల వల్ల ఈ స్థానాన్ని జనసేనకు కేటాయించాల్సి వచ్చింది. అయితే భోగాపురం ఎయిర్పోర్ట్ తో ఉత్తరాంధ్ర కేంద్రంగా ఈ నియోజకవర్గం మారనుంది. అందుకే ఎంత మాత్రం ఈ నియోజకవర్గాన్ని వదిలి పెట్టేందుకు తెలుగుదేశం పార్టీ అంగీకరించదన్న టాక్ నడుస్తోంది. పైగా జనసేన ఎమ్మెల్యే పై అనేక రకాల ఆరోపణలు వస్తున్నాయి. కూటమి శ్రేణులను సమన్వయం చేసుకోలేకపోతున్నారన్న విమర్శ ఉంది. పైగా ఇక్కడ తెలుగుదేశం పార్టీ బలంగా ఉండడం.. జనసేన ఎమ్మెల్యే పట్టించుకోకపోవడంతో ఒక రకమైన గందరగోళం ఉంది. అందుకే ఈ నియోజకవర్గాన్ని టిడిపికి విడిచిపెట్టి.. మరో నియోజకవర్గాన్ని జనసేన ఎంచుకుంటుందన్న టాక్ కూడా నడుస్తోంది.మరోవైపు వచ్చే ఎన్నికల్లో ఇక్కడ నుంచి టిడిపి అభ్యర్థిగా అశోక్ గజపతిరాజు కుమార్తె అదితి గజపతిరాజు పోటీ చేస్తారన్న ప్రచారం కూడా ఉంది. విజయనగరం అసెంబ్లీ స్థానాన్ని జనసేనకు విడిచిపెడతారని.. ఇక్కడ మాత్రం టిడిపి తీసుకుంటుందన్న టాక్ నడుస్తోంది. జనసేనకు ఇప్పటికే పాలవలస యశస్విని అనే మహిళా నేత నాయకురాలిగా ఉన్నారు. మొన్నటి ఎన్నికల్లో విజయనగరం అసెంబ్లీ టికెట్ ఆశించారు. అయితే కూటమి అధికారంలోకి రావడంతో ఆమె తూర్పు కాపు కార్పొరేషన్ చైర్ పర్సన్ పదవి వరించింది. అయితే ఈసారి తూర్పు కాపు సామాజిక వర్గానికి విజయనగరంలో ప్రాధాన్యం ఇవ్వాలని చూస్తోంది కూటమి. ఎందుకంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ.. తూర్పు కాపు సామాజిక వర్గాన్ని తెరపైకి తెస్తోంది. అందుకు ధీటుగా కూటమి జనసేనకు టికెట్ ఇచ్చి.. తూర్పు కాపు సామాజిక వర్గానికి చెందిన యశస్వినికి అవకాశం ఇస్తారని తెగ ప్రచారం జరుగుతుంది. అయితే నెల్లిమర్ల వెళ్లేందుకు అదితి గజపతిరాజు ఒప్పుకుంటారా? ఈ ప్రచారంలో నిజం ఎంత ఉంది? అనేది త్వరలో తెలుస్తుంది.

# రాయలసీమకు ద్రోహం చేసిందెవరు..

**కర్నూలు, జనవరి 6, పెన్ పవర్:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా చేసిన ఒక్క ప్రకటన ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మంటలు రేపింది. "రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని నేనే చంద్రబాబుతో మాట్లాడి ఆపించాను" అని రేవంత్ చెప్పడమే ఆలస్యం.. ఏపీలో ప్రతిపక్ష వైసీపీ భగ్గుమంది. చంద్రబాబును 'రాయలసీమ ద్రోహి'గా చిత్రీకరిస్తూ ఆందోళనలకు దిగింది. అయితే, తెలంగాణ మాజీ మంత్రి హరీశ్ రావు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అసలు నిజాలను బయటపెట్టడంతో సీన్ రివర్స్ అయ్యింది. జగన్ హయాంలోనే ఈ ప్రాజెక్టు పనులు ఆగిపోయాయని అసలు ఆధారాలతో సహా చూపించారు. ఈ పరస్పర విరుద్ధ ప్రకటనల నేపథ్యంలో అసలు రాయలసీమ ఎత్తిపోతలకు ద్రోహం చేసింది ఎవరు? 2019-24 మధ్య ఏం జరిగింది? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ ను ఇరకాటంలో పెట్టే క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, ఏపీ సీఎం చంద్రబాబుతో తనకు ఉన్న సాన్నిహిత్యాన్ని ప్రస్తావించారు. అక్రమ ప్రాజెక్టులను ఆపడంలో తాము సఫలమయ్యామని చెప్పే ప్రయత్నంలో రాయలసీమ ఎత్తిపోతల ప్రస్తావన తెచ్చారు. దీన్ని వైసీపీ అందిపుచ్చుకుంది. తెలంగాణ సీఎంకు తలొగ్గి చంద్రబాబు రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టారని, సీమ గొంతు కోశారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పలు జిల్లాల్లో నిరసనలకు దిగారు.వైసీపీ ఆరోపణలు ఇలా ఉంటే.. హరీశ్ రావు మాత్రం తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో లెక్కలతో సహా వాస్తవాలను బయటపెట్టారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాల కారణంగా జగన్ అధికారంలో ఉన్నప్పుడే ఈ ప్రాజెక్టు పనులు నిలిచిపోయాయని ఆయన గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పుడు కొత్తగా ఆపించింది ఏమీ లేదని, అసలు అక్కడ పనులే జరగడం లేదని తేల్చి చెప్పారు. ఇది పరోక్షంగా జగన్ హయాంలో జరిగిన వైఫల్యాన్ని ఎత్తిచూపినట్లయింది.రాయలసీమ ఎత్తిపోతల పథకం ద్వారా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యాన్ని పెంచి, రోజుకు 3 టీఎంసీల నీటిని తరలించాలని జగన్ ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం 2020లో జీవో 203ని విడుదల చేసింది. అయితే, దీనికి పర్యావరణ అనుమతులు లేవని తెలంగాణ ప్రభుత్వం అప్పట్లో ఎన్జీటీని ఆశ్రయించింది. విచారణ జరిపిన ఎన్జీటీ, పర్యావరణ అనుమతులు వచ్చే వరకు పనులు చేపట్టవద్దని స్టే ఇచ్చింది. జగన్ ప్రభుత్వం ఈ అనుమతులు సాధించడంలో విఫలమైంది. అంతేకాకుండా, ఎన్జీటీ ఆదేశాలను ధిక్కరించి పనులు చేశారన్న ఆరోపణలపై ఏపీ అధికారులకు కోర్టు ధిక్కార నోటీసులు కూడా వచ్చాయి. ఫలితంగా, టెండర్లు పిలిచి కాంట్రాక్టర్ ను నియమించినా, క్షేత్రస్థాయిలో పనులు ముందుకు సాగలేదు. హరీశ్ రావు చెప్పిన పాయింట్ ఇదే. జగన్ హయాంలోనే చట్టపరమైన చిక్కులతో ప్రాజెక్టు స్తంభించిపోయింది.2024లో జగన్ ఓడిపోయారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చారు. టీడీపీ వచ్చి ఏడాదిన్నరే అయింది. ఎన్జీటీ స్టే ఇంకా కొనసాగుతోంది. ఈ తరుణంలో రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు చంద్రబాబును ఇబ్బందికర పరిస్థితిలోకి నెట్టాయి. ఒకవైపు తెలంగాణతో సత్సంబంధాలు కోరుకుంటున్న చంద్రబాబు, మరోవైపు రాయలసీమ సెంటిమెంట్ ను విస్మరించలేరు. రేవంత్ వ్యాఖ్యలపై టీడీపీ నేతలు స్పందిస్తూ.. "మేము ప్రాజెక్టు ఆపేస్తామని ఎక్కడా చెప్పలేదు, చట్టపరమైన అనుమతులు తెచ్చుకుని కడతాం" అని కౌంటర్ ఇస్తున్నారు. రేవంత్ రెడ్డి కేవలం తెలంగాణలో పొలిటికల్ మైలేజ్ కోసమే ఆ వ్యాఖ్యలు చేశారని టీడీపీ వాదన.వాస్తవాలను పరిశీలిస్తే.. ఇక్కడ ఎవరూ పూర్తిగా రైట్ కాదు. ప్రాజెక్టును ఆర్భాటంగా ప్రకటించినా, పర్యావరణ అనుమతులు సాధించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైంది. చట్టపరంగా బలమైన అడుగులు వేయలేకపోవడం వల్లే ప్రాజెక్టు ఎన్జీటీ స్టేలో చిక్కుకుంది. కాబట్టి పనులు ఆగిపోవడానికి ప్రధాన కారణం జగన్ ప్రభుత్వ వైఫల్యమే. రేవంత్ రెడ్డి 'నేను చెప్తే బాబు ఆపారు' అని అంటుంటే.. చంద్రబాబు ప్రభుత్వం నుండి గట్టి కౌంటర్ రాకపోవడం సీమ ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. కేసీఆర్ ను కార్నర్ చేయడానికి రేవంత్ వాడిన అస్త్రం.. పక్క రాష్ట్రంలో మంటలు రేపింది. అక్కడ పనులు జరగడం లేదని తెలిసీ, తానే ఆపించానని చెప్పుకోవడం పూర్తిగా రాజకీయ ఎత్తుగడ.అసలు విషయం ఏంటంటే.. ప్రస్తుతం రాయలసీమ ఎత్తిపోతల పనులు జరగడం లేదు. అవి జగన్ హయాంలోనే ఎన్జీటీ కేసుల వల్ల ఆగిపోయాయి. ఇప్పుడు కొత్తగా చంద్రబాబు ఆపిందేమీ లేదు, రేవంత్ ఆపించింది ఏమీ లేదు. కానీ, ఇద్దరు సీఎంల మధ్య ఉన్న దోస్తీని అడ్డం పెట్టుకుని వైసీపీ రాజకీయం చేస్తుంటే, గతాన్ని గుర్తు చేస్తూ హరీశ్ రావు వాస్తవాలను బయటపెట్టారు. అంతిమంగా రాజకీయ నాయకుల మాటల యుద్ధంలో రాయలసీమ నీటి హక్కులు పక్కదారి పడుతున్నాయన్నది చేదు నిజం.

# క్రెడిట్ వార్.....



**విజయనగరం, జనవరి 6, పెన్ పవర్:** భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్పోర్ట్ అంశం ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో హాట్ టాపిక్గా మారింది. ఈ ఎయిర్పోర్ట్ క్రెడిట్ ఎవరికి దక్కాలనే విషయంపై టీడీపీ , వైసీపీ మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే ఈ ప్రాజెక్ట్ ఎక్కువగా ముందుకు వెళ్లిందని వైసీపీ నేతలు చెబుతున్నారు. అనుమతులు, కోర్టు వివాదాల పరిష్కారం, భూసేకరణ, శంకుస్థాపన అన్నీ తమ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని వారు గుర్తు చేస్తున్నారు. దాదాపు 80 శాతం పనులు అప్పుడే పూర్తయ్యాయని వైసీపీ వాదన.దీనికి టీడీపీ తీవ్రంగా స్పందిస్తోంది. ఒకప్పుడు జగన్ విపక్ష నేతగా ఉన్న సమయంలో భోగాపురంలో ఎయిర్పోర్ట్ అవసరమా అని ప్రశ్నించిన వీడియోలను బయటకు తీసి, అదే మీ అభివృద్ధి దృష్టికోణమా అంటూ కౌంటర్లు వేస్తోంది. ఈ నేపథ్యంలో రాజకీయ వేడి పెరుగుతున్నప్పటికీ, ప్రాజెక్ట్ మాత్రం కీలక దశకు చేరుకుంది.ఇదిలా ఉండగా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేసిన వ్యాఖ్యలు ప్రాజెక్టుకు కొత్త ఉత్సాహం ఇచ్చాయి. ఢిల్లీ నుంచి వాణిజ్య విమానంలో నేరుగా భోగాపురం ఎయిర్పోర్ట్లో ల్యాండ్ అయి ట్రయల్ రన్ విజయవంతం కావడం గర్వకారణమని ఆయన తెలిపారు. ఎయిర్ ఇండియా సహకారంతో గ్రీన్ఫీల్డ్ ఎయిర్పోర్ట్లో తొలి విమానం దిగడం చారిత్రాత్మక ఘట్టమని అన్నారు. ఈ విమానాశ్రయానికి అల్లూరి సీతారామరాజు పేరు పెట్టడం కూడా విశేషమని పేర్కొన్నారు.భోగాపురం ఎయిర్పోర్ట్కు సంబంధించి అనుమతులు 2016లోనే అప్పటి సివిల్ ఏవియేషన్ మంత్రి అశోక్ గజపతి రాజు తెచ్చారని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత 18 నెలలుగా నిరంతర సమీక్షలతో పనులను వేగవంతం చేశామని చెప్పారు. డిసెంబర్ నాటికి పూర్తి చేయాల్సిన పనులను ఆరు నెలలు ముందుగానే పూర్తి చేస్తున్నామని వెల్లడించారు. ఎల్ అండ్ టీ , జీఎంఆర్, డీజీసీఏ ( అధికారులు కీలక పాత్ర పోషించారని తెలిపారు. భూములు ఇచ్చి సహకరించిన స్థానిక రైతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.భోగాపురం ఎయిర్పోర్ట్ ఉత్తరాంధ్ర ప్రాంతానికి వరల్డ్ క్లాస్ ఏవియేషన్ హబ్గా మారనుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఒకప్పుడు శంషాబాద్ఎయిర్పోర్ట్పై వచ్చిన విమర్శలకు ఇదే సమాధానమని అన్నారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల భవిష్యత్ ఈ ఎయిర్పోర్ట్తో మారుతుందని చెప్పారు. టూరిజం, వాణిజ్యం, ఉపాధి అవకాశాలు భారీగా పెరుగుతాయని అంచనా వేశారు.ఇంకా నాలుగు నుంచి ఐదు నెలల్లో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఈ ఎయిర్పోర్ట్ ప్రారంభం కానుందని తెలిపారు. ఒడిశా , రాయపూర్ ప్రాంతాల ప్రజలకు కూడా ఇది ఉపయోగపడుతుందని, ఎయిర్ కనెక్టివిటీ మెరుగుపడుతుందని అన్నారు. మొత్తంగా భోగాపురం ఎయిర్పోర్ట్ ఉత్తరాంధ్ర అభివృద్ధికి నాంది పలికిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మళ్లీ రేసులోకి ధర్మాన



**శ్రీకాకుళం, జనవరి 6, పెన్ పవర్:** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనే అత్యంత సీనియర్ రాజకీయ నాయకుల్లో ఒకరిగా ధర్మాన ప్రసాదరావు కు ప్రత్యేక గుర్తింపు ఉంది. ఆయన రాజకీయ జీవితం దశాబ్దాల పాటు సాగింది. కాంగ్రెస్ పార్టీ లో దీర్ఘకాలం పనిచేసిన ఆయన, దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రోత్సాహంతో మరింత బలమైన నాయకుడిగా ఎదిగారు. 1989లో తొలిసారి శాసనసభలో అడుగుపెట్టిన ధర్మాన, అదే సమయంలో మంత్రి పదవిని కూడా దక్కించుకున్నారు. అప్పటి నుంచి కాంగ్రెస్లోనే కొనసాగుతూ 2014 వరకు కీలక బాధ్యతలు నిర్వహించారు.రాష్ట్ర విభజన తరువాత రాజకీయ పరిస్థితులు మారాయి. అనుకోని పరిణామాల మధ్య వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు ధర్మాన ప్రసాదరావు. కాంగ్రెస్లో ఉన్న సమయంలో జగన్మోహన్ రెడ్డి నాయకత్వాన్ని వ్యతిరేకించినా, తర్వాత అదే నేత ఆధ్వర్యంలో పని చేయాల్సి వచ్చింది. పార్టీ మారిన తర్వాత కూడా ఆయన రాజకీయ అనుభవం కారణంగా వైసీపీలో ప్రాధాన్యం దక్కింది. అయితే ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఓటమి తర్వాత ఆయన పార్టీ నుంచి బయటకు వస్తారన్న ప్రచారం సాగింది. దానికి అనుగుణంగా దాదాపు ఏడాది పాటు ఆయన రాజకీయంగా మౌనంగా ఉండిపోయారు. పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు.ఇటీవల మాత్రం ధర్మాన మళ్లీ యాక్టివ్గా మారారు. ఈ మార్పు వెనుక కుమారుడి రాజకీయ భవిష్యత్తే ప్రధాన కారణమని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. ఆయన కుమారుడు రామ్ మనోహర్ నాయుడు కు సరైన రాజకీయ అవకాశం కల్పించాలనే ఉద్దేశంతో ధర్మాన మళ్లీ రంగంలోకి దిగినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో జగన్మోహన్ రెడ్డి, ధర్మాన ప్రసాదరావుకు కీలక బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధమవుతున్నారన్న వార్తలు చర్చనీయాంశంగా మారాయి.ఈ పరిణామాల మధ్య ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ( చేసిన వ్యాఖ్యలు రాజకీయ వేడిని పెంచాయి. ఆయన ధర్మాన సోదరులపై తీవ్ర ఆరోపణలు చేస్తూ, పార్టీని నాశనం చేస్తున్నారంటూ బహిరంగంగా విమర్శించారు. తన పరాజయాల వెనుక కొన్ని రాజకీయ కుటుంబాల పాత్ర ఉందని కూడా పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డికి ఫిర్యాదు చేస్తూ, ధర్మాన కుటుంబాన్ని నమ్మవద్దని కోరిన సందర్భాలు ఉన్నాయి. అయితే ఈ వ్యాఖ్యల అనంతరం దువ్వాడ శ్రీనివాస్ పార్టీ నుంచి సస్పెండ్ కావడం గమనార్హం.ఇప్పుడు అదే సమయంలో ధర్మాన ప్రసాదరావుకు మరింత ప్రాధాన్యం పెరగడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా లో ధర్మాన కుటుంబానికి ఉన్న పట్టు దృష్ట్యా, జగన్ వారి సేవలను వినియోగించుకోవాలని భావిస్తున్నారని సమాచారం. తాడేపల్లి కేంద్ర కార్యాలయం బాధ్యతలను ధర్మానకు అప్పగించే ఆలోచన కూడా ఉందని తెలుస్తోంది. ఇప్పటివరకు విజయసాయిరెడ్డి సజ్జల రామకృష్ణారెడ్డి (, వైవి సుబ్బారెడ్డి వంటి నేతలపై ఆధారపడిన జగన్, ఇకపై పార్టీ బలోపేతం కోసం సీనియర్ నాయకులను ముందుకు తెచ్చే వ్యూహం రచిస్తున్నట్లు కనిపిస్తోంది.ఈ పరిణామాలన్నీ ధర్మాన శ్రీనివాస్ రాజకీయ భవిష్యత్తుపై ప్రభావం చూపే అవకాశం ఉంది. జగన్మోహన్ రెడ్డి నిర్ణయాలు చూస్తే, ధర్మాన ప్రసాదరావుకు ఇచ్చే ప్రాధాన్యం ద్వారా పార్టీలో కొత్త సమీకరణాలు మొదలవుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## మూడేళ్ల కోసం పక్కా వ్యూహాలు

**విజయవాడ, జనవరి 6, పెన్ పవర్:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రస్తుతం బెంగళూరులో ఉన్నప్పటికీ, ఆయన దృష్టి మొత్తం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల భవిష్యత్తుపైనే ఉందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఒకవైపు పార్టీని మళ్లీ బలోపేతం చేయడం, మరోవైపు అధికార కూటమి వేగాన్ని ఎదుర్కొని వైసీపీని ప్రత్యామ్నాయంగా నిలబెట్టడం, అలాగే రాబోయే మూడేళ్ల లో జరగనున్న ఎన్నికల కోసం పక్కా వ్యూహాలు రూపొందించడం వంటి అంశాలపై జగన్ సీరియస్గా ఆలోచిస్తున్నారని సమాచారం.కొత్త ఏడాది 2026 ప్రారంభమవడంతో జగన్ ప్రజల్లోకి రావడానికి సిద్ధమవుతున్నారని అంటున్నారు. సంక్రాంతి పండుగ తర్వాత జిల్లాల పర్యటనలకు ఆయన రంగం సిద్ధం చేస్తారని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలను కవర్ చేస్తూ ఈ టూర్లు నిర్వహించాలన్నది జగన్ ఆలోచనగా చెబుతున్నారు. ఈ పర్యటనలు దాదాపు ఆరు నెలల పాటు నిరంతరంగా కొనసాగుతాయని, ఈ సమయంలో పార్టీ పరిస్థితిని పూర్తిగా అంచనా వేయాలని ఆయన భావిస్తున్నారట.జిల్లాల పర్యటనల అనంతరం పార్టీలో కీలక మార్పులు చోటు చేసుకునే అవకాశముందని అంటున్నారు. గ్రౌండ్ లెవల్ నుంచి వచ్చే నివేదికలు, నాయకులు మరియు కార్యకర్తల నుంచి నేరుగా అందే ఫీడ్బ్యాక్ ఆధారంగా నియోజకవర్గ స్థాయిలో మార్పులు చేస్తారని అంచనా. కొందరు నాయకులకు బాధ్యతలు మారవచ్చు, మరికొందరికి కొత్త అవకాశాలు కల్పించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి.ఇదే సమయంలో జగన్ 2027లో మరోసారి భారీ పాదయాత్రకు సిద్ధమవుతున్నారన్న ప్రచారం కూడా బలంగా వినిపిస్తోంది. గతంలో 2017లో ప్రారంభమైన పాదయాత్ర 2019లో పార్టీకి ఘన విజయం తీసుకువచ్చిన విషయం తెలిసిందే. అదే సెంటిమెంట్ను కొనసాగించాలనే ఆలోచనతో 2027ను ఎంచుకున్నారని చెబుతున్నారు. అయితే ఈసారి నవంబర్లో కాకుండా ఫిబ్రవరి లేదా మార్చి నుంచే పాదయాత్ర ప్రారంభమయ్యే అవకాశం ఉందని సమాచారం.ఈసారి పాదయాత్ర మరింత భారీగా ఉండబోతోందని అంటున్నారు. సుమారు ఐదు వేల కిలోమీటర్ల లక్ష్యంతో జగన్ నడవాలని భావిస్తున్నారట. అందుకే 2029 ఎన్నికల నాటికి పాదయాత్ర పూర్తయ్యేలా ముందుగానే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ యాత్ర దాదాపు 24 నెలల పాటు కొనసాగే అవకాశమూ ఉందని అంచనా.అయితే గత పాదయాత్ర సమయంలో జగన్ తల్లి విజయమ్మ , చెల్లెలు షర్మిల పార్టీ వ్యవహారాలను చూసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. విజయమ్మ రాజకీయాలకు దూరంగా ఉండగా, షర్మిల కొత్త రాజకీయ దారిలో వెళ్తున్నారనే ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో పార్టీకి నాయకత్వ స్థాయిలో ఒక లోటు కనిపిస్తోందని అంటున్నారు. అందుకే జగన్ కొత్త ఆలోచనలపై దృష్టి పెట్టారని సమాచారం. తన సతీమణి భారతిని రాజకీయాల్లోకి తీసుకురావాలనే ఆలోచన చేస్తున్నారని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. తాను పాదయాత్రలో బిజీగా ఉన్నా పార్టీని పర్యవేక్షించేందుకు ఆమె ఉపయోగపడుతుందని జగన్ భావిస్తున్నారట. ఆమెకు రాజకీయ అవగాహన కల్పించడానికి 2026 సరైన సమయమని, ఈ ఏడాదిలోనే ఆమె ఎంట్రీపై ప్రకటన వచ్చే అవకాశముందని అంటున్నారు. అయితే ఈ ప్రచారంలో ఎంతవరకు నిజం ఉందన్నది కాలమే తేల్చాల్సి ఉంది.

## అడ్డంగా బుక్కైన టీడీపీ నేత

**తిరుపతి, జనవరి 6, పెన్ పవర్:** రాజకీయ అధికారాన్ని అడ్డం పెట్టుకుని ప్రభుత్వ భూములను, మాజీ సైనికులకు కేటాయించిన స్థలాలను చెరబట్టారనే ఆరోపణలు అన్నమయ్య జిల్లా రాజకీయాల్లో ఇప్పుడు పెను ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. మదనపల్లె టీడీపీ మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ పై వచ్చిన భూ అక్రమణ ఆరోపణలపై లోకాయుక్త సీరియస్ అయ్యింది. పేదలకు, సైనికులకు చెందాల్సిన భూములను నకిలీ పత్రాలతో కాజేసిన వైనంపై కలెక్టర్ నివేదిక ఇవ్వడంతో ఈ వ్యవహారం మరోసారి తెరపైకి వచ్చింది.మదనపల్లె నియోజకవర్గం పరిధిలోని బి.కొత్తపల్లె గ్రామంలో సర్వే నంబర్ 8/1లో ఉన్న సుమారు మూడు ఎకరాల భూమి చుట్టూ ఈ వివాదం ముడిపడి ఉంది. ఇది ప్రభుత్వ రికార్డుల ప్రకారం 'చెరువు పోరంబోకు' భూమి. దీనిని గతంలో దేశం కోసం పోరాడిన మాజీ సైనికులకు ప్రభుత్వం కేటాయించింది. అయితే, 2016లో దొమ్మలపాటి రమేష్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో తన రాజకీయ పలుకుబడిని ఉపయోగించి ఈ భూమిని కబ్జా చేశారనేది ప్రధాన ఆరోపణ.సుమారు 2.92 ఎకరాల ఈ విలువైన భూమిని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్, ఆయన భార్య సరళ పేరిట రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. కోట్లాది రూపాయల విలువ చేసే ఈ ప్రభుత్వ భూమిని ప్రైవేట్ ఆస్తిగా మార్చుకునే క్రమంలో రెవెన్యూ చట్టాలను, నిబంధనలను తుంగలో తొక్కినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ భూ కుంభకోణంలో కేవలం రాజకీయ నాయకులే కాదు, బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న రెవెన్యూ అధికారులు కూడా కీలక పాత్ర పోషించడం విస్మయం కలిగిస్తోంది. అప్పటి తహశీల్దార్ శివరామిరెడ్డి, ఆర్ఐ, వీఆర్ఓలు ఎమ్మెల్యేతో కుమ్మక్కై రికార్డులను తారుమారు చేశారు.మరీ ముఖ్యంగా, ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు రోజైన ఆదివారం రోజున తహశీల్దార్ కార్యాలయం తెరిచి మరీ రికార్డులను మార్చినట్లు విచారణలో బయటపడింది. ఆన్లైన్ రికార్డుల్లో పేర్లు మార్చడం, నకిలీ పట్టాలు సృష్టించడం వంటివి అత్యంత పథకం ప్రకారం జరిగాయి. సాక్షాత్తు జిల్లా కలెక్టర్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో ఈ విషయాన్ని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే ఒత్తిడికి తలొగ్గి, నిబంధనలకు విరుద్ధంగా అధికారులు సహకరించారని కలెక్టర్ నివేదిక నిర్ధారించింది.ఈ అక్రమాలపై దాఖలైన ఫిర్యాదును విచారించిన లోకాయుక్త న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. మాజీ సైనికులకు ఇవ్వాల్సిన భూమిని కబ్జా చేయడం, చెరువు పోరంబోకు భూమిని ఆక్రమించడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కలెక్టర్ నివేదిక ఆధారంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. దీంతో ప్రభుత్వం దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించింది. ఈ అక్రమాలకు సహకరించిన ఐదుగురు ప్రభుత్వ అధికారులపై క్రమశిక్షణా చర్యలకు ఆదేశాలు జారీ చేసింది. అంతేకాకుండా, ఆంధ్రప్రదేశ్ భూ ఆక్రమణ చట్టం కింద బాధ్యులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేసింది.మదనపల్లెలో ఇటీవల సబ్-కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ల దగ్ధం ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ ఘటన మరువకముందే, ఇప్పుడు మాజీ ఎమ్మెల్యేపై భూ కబ్జా ఆరోపణలు రుజువు కావడం, లోకాయుక్త జోక్యం చేసుకోవడం దొమ్మలపాటి రమేష్ రాజకీయ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసే అవకాశం ఉంది.సాధారణంగా రాజకీయ ఆరోపణలు వేరు, సాంకేతిక ఆధారాలతో కూడిన అధికారుల నివేదికలు వేరు. ఇక్కడ కలెక్టర్ స్వయంగా విచారణ జరిపి, రికార్డుల తారుమారును నిర్ధారించడం మాజీ ఎమ్మెల్యేకు పెద్ద ఎదురుదెబ్బే. రాబోయే రోజుల్లో ఈ కేసు విచారణ ఎలా సాగుతుంది? క్రిమినల్ కేసుల నమోదు తర్వాత అరెస్టుల వరకూ వెళ్తుందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. ఏది ఏమైనా, కంచే చేను మేసిన చందంగా రక్షించాల్సిన ప్రజాప్రతినిధులే భక్షకులుగా మారారన్న విమర్శలకు ఈ ఘటన బలం చేకూరుస్తోంది.

## ప్రత్యేక ధరలను ప్రకటించిన యమహా

**విజయవాడ, జనవరి 6, పెన్ పవర్:** యమహా మోటార్ తన 70వ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా, ఇండియా యమహా మోటార్ జనవరి 5 నుంచి అమల్లోకి వచ్చేలా యమహా ఎఫ్15 సిరీస్పై రూ. 5,000 ప్రత్యేక ధరప్రయోజనాన్ని ప్రకటించింది. ఈ వార్షికోత్సవ ఆఫర్తో, యమహా ఎఫ్15 సిరీస్ ధర ఇప్పుడు రూ. 1,50,700 (ఎక్స్-షోరూమ్, ఢిల్లీ) నుండి ప్రారంభమవుతుంది. ఐకానిక్ స్పోర్ట్ మోటార్సైకిళ్లను మరింత విస్తృతంగా ఔత్సాహికులకు అందుబాటులోకి తీసుకురావాలనే యమహా నిబద్ధతను ఇది మరింత బలపరుస్తుంది.ప్రారంభం నుండే, యమహా ఎఫ్15 భారతదేశంలో ఎంట్రీ-లెవల్ పెర్ఫార్మెన్స్ మోటార్సైకిల్ విభాగాన్ని కొత్త దిశగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తోంది. రేసింగ్ నుంచి ప్రేరణ పొందిన డిజైన్, అత్యాధునిక సాంకేతికత మరియు రోజువారీ వినియోగానికి అనుకూలమైన రైడబిలిటీతో, దేశవ్యాప్తంగా యువ రైడర్లలో విస్తృత గుర్తింపు మరియు బలమైన ఆదరణను సంపాదించింది. భారతదేశంలో ఇప్పటివరకు ఒక మిలియన్ యూనిట్లకు పైగా ఉత్పత్తి కావడంతో, ఎఫ్15 యమహా యొక్క బలమైన తయారీ సామర్థ్యాలకు ప్రతీకగా నిలవడమే కాకుండా, భారతీయ మోటార్సైక్లింగ్ సంస్కృతితో బ్రాండ్కు ఉన్న లోతైన అనుబంధాన్ని కూడా ప్రతిబింబిస్తుంది.యమహా యొక్క అధునాతన 155 సిసి లిక్విడ్-కూల్డ్, ఫ్యూయల్-ఇంజెక్టెడ్ ఇంజిన్తో బ్రాండ్కు చెందిన దయాసిల్ సిలిండర్ టెక్నాలజీ మరియు ప్రఖ్యాత డెల్టాబాక్స్ ఫ్రేమ్ మద్దతు ఇవ్వడంతో, ఎఫ్15 పనితీరు మరియు హ్యాండ్లింగ్ ప్రమాణాలను నిరంతరం కొత్త స్థాయికి తీసుకెళుతోంది. ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, అసిస్ట్ & స్లిప్పర్ క్లచ్, ఎంపిక చేసిన వేరియంట్లలో క్విక్ షిఫ్టర్, అప్సైడ్-డౌన్ ఫ్రంట్ ఫోర్కులు మరియు లింక్-టైప్ మోనోషాక్ సస్పెన్షన్ వంటి అధునాతన ఫీచర్లతో, ఈ మోటార్సైకిల్ తన సెగ్మెంట్లో ముందంజలో ఉన్న పనితీరును అందిస్తుంది. ట్రాక్ నుంచి ప్రేరణ పొందిన డిజైన్ మరియు నిరూపితమైన రేసింగ్ డీఎన్ఏతో, యమహా ఎఫ్15 సిరీస్ భారతదేశంలో అత్యంత ఆకాంక్షితమైన, పనితీరు-కేంద్రిత మోటార్సైకిళ్లలో ఒకటిగా తన స్థానాన్ని మరింత బలపరుస్తోంది.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

## ఇది అమెరికా దోపిడీ రాజ్యం

**హైదరాబాద్ పెన్ పవర్:** వెనిజులాపై అమెరికా దురాక్రమణ చర్య కేవలం అక్కడి చమురు, ఖనిజ వనరులను దోచుకోవడానికే అన్నది వాస్తవం. ఈ చర్యతో పశ్చిమార్థగోళ కూటమికి ఆధిపత్యం వహించాలనే దురాలోచనతో ట్రంప్ తరువాతి వంతు మెక్సికో, క్యూబా, కొలంబియా దేశాలదేనని హెచ్చరించడం అమెరికా సామ్రాజ్యవాద కాంక్ష పరాకాష్టకు దారితీస్తోంది. చైనా, రష్యా, భారత్ వంటి పోటీదారులను నిరోధించడానికి, మార్కెట్లు, సహజ వనరులపై నియంత్రణ సాధించాలన్న అమెరికా లక్ష్యం కనిపిస్తోంది. సహజ వనరులు అపారంగా ఉన్న లాటిన్ అమెరికాలోని వామపక్ష ప్రభుత్వాలను కూలదోయడం, అక్కడ తన గుత్తాధిపత్యాన్ని నిలబెట్టుకోడానికి ఎత్తుగడలు పన్నడం అమెరికా సామ్రాజ్యవాద కాంక్షగా సాగుతోంది. ఈ దాడి ఐక్యరాజ్యసమితి నిబంధనలను, అంతర్జాతీయ చట్టాలను, ప్రపంచ దేశాల సార్వభౌమాధికారాన్ని ధిక్కరించడమే అవుతుంది. ప్రపంచంలోనే అత్యధికంగా వెనెజులాలో 303 బిలియన్ బ్యారెళ్లకు పైగా చమురు నిక్షేపాలు ఉన్నాయి. ప్రపంచ వ్యాప్తంగా చమురు నిక్షేపాల్లో ఇది అయిదో వంతు. అదే అమెరికా, రష్యాలో చెరి 80 బిలియన్ బ్యారెళ్లు ఉండగా, సౌదీ అరేబియాలో 267 బిలియన్ బ్యారెళ్ల చమురు నిక్షేపాలు ఉన్నాయి. వెనిజులాలో చమురును శుద్ధి చేయడానికి ఖర్చు చాలా తక్కువ. అందుకనే అమెరికా వెనిజులాను స్వాధీనం చేసుకోవడానికి దాడి చేసింది. అయితే అత్యధికంగా చమురు నిల్వలు వెనెజులాలో ఉన్నప్పటికీ వాటిని పూర్తి స్థాయిలో వినియోగించుకునే పరిస్థితి వెనెజులాకు లేకపోవడం చాలా లోపం. ఫలితంగా చమురు పరిశ్రమలు అనేక సంవత్సరాలుగా సంక్షోభంలో అల్లాడుతున్నాయి. సరైన నాయకత్వం లేకపోవడం, అవినీతి, అమెరికా ఆంక్షలు, పరిశ్రమ లోకి పెట్టుబడులు రాకపోవడం ఇవన్నీ వెనెజులాను పట్టిపీడిస్తున్నాయి. ఈ కారణాల వల్ల 25 ఏళ్ల క్రితం రోజుకు మూడు మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును ఉత్పత్తి చేసే వెనెజులా ప్రస్తుతం ఒక మిలియన్ బ్యారెళ్ల స్థాయికి పడిపోయింది. ఈ విధంగా ఉత్పత్తి చేసే చమురులో సింహభాగం అంటే రోజుకు 6,00,000 బ్యారెళ్లను చైనా దిగుమతి చేసుకుంటోంది. వెనెజులాను ఆర్థికంగా చైనా ఆదుకుంటోంది. చమురు రంగంలో ముమ్మరంగా పెట్టుబడులను పెట్టింది. రష్యా చమురు కూడా దాదాపు వెనెజులా ముడిచమురు మాదిరిగానే ఉండడంతో భారత్, చైనా లాంటి దేశాలు రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో వెనెజులాలో ఉత్పత్తి పెరిగితే అది రష్యాకి ప్రత్యామ్నాయంగా తయారై, ఇప్పటి దాకా రష్యా దగ్గర ముడిచమురును కొంటున్న దేశాలు క్రమంగా వెనెజులా వైపు మొగ్గు చూపుతాయని, దీనివల్ల రష్యా ఆర్థికంగా దెబ్బతినడమే కాక, ఉక్రెయిన్‌పై యుద్ధంచేసే సామర్థ్యాలు రష్యాకు తగ్గుతాయని అమెరికా ఆలోచిస్తోంది. ఆమేరకు రష్యాను కట్టడి చేయవచ్చని అమెరికా ఎత్తుగడ.అంతేకాక, ప్రపంచం లోనే అత్యధికంగా రోజుకు 2022 మిలియన్ బ్యారెళ్ల చమురును అమెరికా ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, వెనెజులాలో తయారయ్యే రకం చమురును అమెరికా కొంతవరకు దిగుమతి చేసుకుంటోంది.అమెరికా తయారు చేసే లైట్ స్వీట్ రకం ముడిచమురు పెట్రోల్ వంటి వాటి తయారీకి మాత్రమే ఉపయోగపడుతుంది. డీజిల్‌తోపాటు ఫ్యాక్టరీలు ఇతర అవసరాలకు కావలసిన ఉత్పత్తులను తయారు చేయాలంటే వెనెజులా సరఫరా చేసే హెవీ, సోర్ రకం ముడిచమురు ముఖ్యం.అనేక అమెరికన్ రిఫైనరీలు వెనెజులా హెవీ ఆయిల్‌ను ప్రాసెస్ చేయడానికి అనువుగా నిర్మాణమై ఉన్నాయి. అమెరికా చమురుతో పోలిస్తే వెనెజులా చమురుతోనే అవి సమర్థంగా పనిచేస్తాయి. అందుకు తగ్గట్టుగానే మిగతా దేశాల కన్నా సమీపాన గల వెనెజులా నుంచే అమెరికా రోజుకు 1.02 లక్షల బ్యారెళ్ల చమురును దిగుమతి చేసుకోవడం తప్పనిసరి అవుతోంది. వెనెజులాను తన గుప్పిట్లో ఉంచుకుంటే అంతర్జాతీయంగా ముడిచమురు మార్కెట్‌పై కూడా గుత్తాధిపత్యం దక్కించుకునే అవకాశం కలుగుతుందని అమెరికా ఎత్తుగడ. ఇప్పటికే అమెరికాలో షెల్ ఆయిల్ ఉత్పత్తి బూమ్ వల్ల మార్కెట్ ఆధిపత్యం ఒపెక్ దేశాల నుంచి కొంత అమెరికాకు వెళ్లిపోయింది. ఇప్పుడు ఈ దాడి వల్ల అమెరికా, దాని మిత్రదేశాలకు ఆర్థిక ప్రయోజనాలు కలగడమే కాక, ఆయా దేశాల చమురు కంపెనీలు వెనెజులాలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలు పెరుగుతాయని, చమురు ధరలు అదుపులో ఉంటాయని అంచనాలు వెలువడుతున్నాయి.

## నిబంధనల అమలుకే బోర్డులు

**హైదరాబాద్ పెన్ పవర్:** 'దేశ కార్పొరేట్ రంగంలో, అగ్రశ్రేణి సంస్థల బోర్డులు నిబంధనల అమలుకే పరిమితం అవుతున్నాయి. కంపెనీల భవిష్యత్తును తీర్చిదిద్దే వ్యూహ రచనల్లో చురుకైన పాత్ర పోషించడం లేదు' అని ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బీ) నివేదిక వెల్లడించింది. 'ది బోర్డ్స్ లుకింగ్ గ్లాస్' పేరుతో విడుదల చేసిన కార్పొరేట్ గవర్నెన్స్ రిపోర్టు 2025 ప్రకారం.. 17% బోర్డులు మాత్రమే కంపెనీ వ్యూహాలను రూపొందించడంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నాయి. మిగిలిన 83% బోర్డులు.. కంపెనీ నిర్వహణలో చురుకైన పాత్ర పోషించకుండా, నిష్క్రియగా ఉండిపోతున్నాయని స్పష్టం చేసింది. బీఎస్‌ఈ 500 కంపెనీల్లోని 200 మందికి పైగా డైరెక్టర్ల అభిప్రాయాలను సేకరించి ఈ నివేదిక రూపొందించినట్లు ఐఎస్‌బీ వెల్లడించింది. ప్రొఫెసర్లు సంజయ్ కల్లాపూర్, నిర్మాల్య కుమార్, హరీష్ రాయ్ చందానీ సారథ్యంలో ఈ అధ్యయనం జరిగింది. సమీక్షించడంతోనే సరి..ఈ నివేదిక ప్రకారం 98% మంది డైరెక్టర్లు తమ బోర్డులు నిబంధనలను పాటించడంలో పరిణతి సాధించాయని భావిస్తున్నారు. భవిష్యత్తు అవసరాలను గుర్తించి, వ్యూహాత్మక మార్గదర్శకత్వం చేయడంలో మాత్రం బోర్డులు వెనకబడి ఉన్నాయి. యాజమాన్యం సిద్ధం చేసిన ప్రణాళికలను సమీక్షించడం మినహా, తాము అదనంగా ఇచ్చే సూచనలు చాలా పరిమితంగానే ఉన్నాయని 36% మంది డైరెక్టర్లు అంగీకరించారు. బోర్డులో పని అంటే.. సమావేశాలకు హాజరవ్వడం మాత్రమే కాదని, నిర్మాణాత్మక చర్చలు, స్వతంత్ర ఆలోచనలు ఉండాలని నిర్మాల్య కుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు. సమర్థ పర్యవేక్షణ నిమిత్తం, డైరెక్టర్లు ముందస్తు జాగ్రత్తలతో రిస్కులను అంచనా వేయాలని సంజయ్ కల్లాపూర్ సూచించారు.స్పష్టత లోపిస్తోందిబోర్డు సభ్యులు – కంపెనీ సీఈఓ మధ్య ఉండాల్సిన స్పష్టత, నిజాయితీ విషయంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. సీఈఓలకు నచ్చని అభిప్రాయాలను వెల్లడించేందుకు డైరెక్టర్లు వెనకాడుతున్నారు. 38% మంది మాత్రమే ఈ విషయంలో స్పందిస్తున్నారు. సంస్థల్లో పారదర్శకతకు ఆధారమైన ప్రజావేగు, విజిలెన్స్ యంత్రాంగాల విషయంలో 22% బోర్డులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయి. నిబంధనల అమలు కోసం చేసే ప్రక్రియలుగానే చూస్తున్నారు మినహా, నమ్మకాన్ని పెంపొందించే సాధనాలుగా వీటిని పరిగణించడం లేదు. భారతీయ కార్పొరేట్ బోర్డుల్లోని స్వతంత్ర డైరెక్టర్లు తమ పనితీరును, నైతికతను మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని పరిశోధకుడు హరీష్ రాయ్ చందానీ పేర్కొన్నారు. నివేదికలోని ఇతర అంశాలేమిటంటే..ప్రతి ముగ్గురు డైరెక్టర్లలో ఒకరు బోర్డు సమావేశాలకు తగినంతగా సిద్ధం కావడం లేదు.అయిదుగురు డైరెక్టర్లలో ఇద్దరికి కంపెనీ లక్ష్యాలపై సరైన అవగాహన లేదు.ఆరుగురు డైరెక్టర్లలో ఒక్కరు మాత్రమే బయట జరిగే పరిణామాలను పరిగణనలోకి తీసుకుని, చర్చల్లో వినిపిస్తున్నారు.

## ఎల్ఐసీ నుంచి జీవన్ ఉత్సవ్ సింగిల్ ప్రీమియం ప్లాన్




**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ (ఒఎఅ) జీవన్ ఉత్సవ్ పేరిట సింగిల్ ప్రీమియం ప్లాన్‌ను ప్రకటించింది. జనవరి 12 నుంచి దీని విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు స్టాక్ ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. నాన్ పార్టిసిపేటింగ్, నాన్‌లింక్డ్, ఇండివిడ్యువల్, సేవింగ్స్, పూర్తి జీవితకాలానికి బీమా అందించే ప్లాన్ ఇది. ప్రీమియం, ఇతర వివరాలు వెల్లడించలేదు. జీవన్ ఉత్సవ్ పేరిట రెండేళ్ల క్రితం ఓ పాలసీని ఎల్ఐసీ తీసుకొచ్చింది. దానికే మార్పులు చేసి సింగిల్ ప్రీమియంగా తీసుకొచ్చే అవకాశం ఉంది. ఒకసారి పాలసీని కొనుగోలు చేస్తే జీవితాంతం ఆదాయం పొందొచ్చన్నమాట.పాలసీ పునరుద్ధరణకు అవకాశంమరోవైపు లాప్స్ అయిన పాలసీలను పునరుద్ధరించుకునే అవకాశం కల్పిస్తూ ప్రత్యేక పునరుద్ధరణ కార్యక్రమాన్ని ఎల్ఐసీ చేపట్టింది. ప్రీమియం చెల్లింపుల గడువు దాటి, కాలవ్యవధి పూర్తికాని పాలసీలను ఈ కార్యక్రమంలో భాగంగా పునరుద్ధరించుకోవచ్చు. జనవరి 1 నుంచి మార్చి 2 వరకు ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. ఇందులోభాగంగా ఆలస్య రుసుము విషయంలోనూ రాయితీ ఇస్తున్నట్లు ఎల్ఐసీ ప్రకటించింది. నాన్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్లపై గరిష్ఠంగా 30 శాతం (రూ.5వేల వరకు), మైక్రో ఇన్సూరెన్స్ ప్లాన్లపై నూరు శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపింది. ప్రీమియం చెల్లింపులు నిలిచిపోయి ఐదేళ్లు లేదా అంతకంటే తక్కువ సమయం ఉన్న పాలసీలను మాత్రమే పునరుద్ధరించుకోవచ్చని ఎల్ఐసీ స్పష్టం చేసింది.

# బీఆర్ఎస్ పార్టీ పై పేలిన తూటాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** కల్వకుంట్ల కవిత శాసన మండలిలో చేసిన వ్యాఖ్యలు ఇటీవలి తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక మలుపుగా మారాయి. ఆమె మాటలు కేవలం సభా ప్రాంగణానికే పరిమితం కాకుండా, గత దశాబ్ద పాలన తీరుపై, నైతిక విలువలపై, అవినీతి ఆరోపణలపై, రాజకీయ వ్యూహాలపై విస్తృత ప్రజా చర్చకు దారి తీశాయి. భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్న పదేళ్ల కాలం నుంచి ప్రతిపక్ష స్థితికి చేరిన తర్వాత ఎదుర్కొంటున్న రాజకీయ ఒత్తిళ్లు, కేంద్ర?రాష్ట్ర సంబంధాల్లో ఏర్పడిన ఉద్రిక్తతలు, దర్యాప్తు సంస్థల చర్యలపై నెలకొన్న అనుమానాలే ఈ వ్యాఖ్యలకు నేపథ్యంగా కనిపిస్తున్నాయి.శాసన మండలిలో కవిత చేసిన వ్యాఖ్యల్లో తనపై, తన పార్టీపై వస్తున్న ఆరోపణలను రాజకీయ కక్ష సాధింపుగా చిత్రీకరించే ప్రయత్నం స్పష్టంగా కనిపించింది. అవినీతి ఆరోపణలను ఆమె ఖండిస్తూ, కేంద్రంలోని అధికార పార్టీ తన రాజకీయ ప్రత్యర్థులను అణిచివేయడానికి విచారణ సంస్థలను ఆయుధాలుగా ఉపయోగిస్తోందన్న వాదనను ముందుకు తెచ్చారు. ఇది వ్యక్తిగత రక్షణకే పరిమితం కాకుండా, సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాల హక్కులు, ప్రజాస్వామ్య సంస్థల స్వతంత్రత వంటి మూలభూత అంశాలను కూడా స్పృశించింది. గతంలోనూ బీఆర్ఎస్ నేతల నుంచి ఇలాంటి వాదనలు వినిపించినా, శాసన మండలి వేదికపై అధికారికంగా రావడం వల్ల ఈ వ్యాఖ్యలకు రాజకీయంగా మరింత బరువు ఏర్పడింది.అవినీతి ఆరోపణల అంశం న్యాయస్థానాల్లో తేలాల్సినదైనా, రాజకీయంగా మాత్రం అవి పార్టీ ప్రతిష్ఠపై గణనీయమైన ప్రభావం చూపుతున్నాయి. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో చేపట్టిన భారీ ప్రాజెక్టులు, సంక్షేమ పథకాలు, పరిపాలనా నిర్ణయాలపై ఇప్పటికే విపక్షాలు ప్రశ్నలు లేవనెత్తాయి. ఇప్పుడు వ్యక్తిగత నేతలపై వచ్చిన ఆరోపణలు ఆ విమర్శలకు కొత్త ఊపును ఇచ్చాయి. అయితే "ఆరోపణలే తప్ప నిర్ధారణలు లేవు" అన్న వాదనను బీఆర్ఎస్ తన రక్షణగా వినిపిస్తోంది. కవిత వ్యాఖ్యలు కూడా ఇదే దిశగా సాగుతూ, తనపై జరుగుతున్న ప్రచారాన్ని రాజకీయంగా ఎదుర్కొనే ప్రయత్నంగా రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

ఈ వ్యాఖ్యలు బీఆర్ఎస్‌పై చూపే ప్రభావం ద్విముఖంగా ఉండే అవకాశముంది. ఒకవైపు పార్టీ శ్రేణులు, అనుచరుల్లో తమ నాయకులపై అన్యాయం జరుగుతోందన్న భావన బలపడుతూ, పార్టీ మరింత ఏకతాటిపై నిలబడే అవకాశం ఉంది. మరోవైపు, తటస్థ ఓటర్లు, పట్టణ మధ్యతరగతి వర్గాల్లో మాత్రం అవినీతి ఆరోపణలు పదే పదే వినిపించడం వల్ల పార్టీపై అనుమానాలు పెరిగే ప్రమాదం ఉంది. ఎన్నికల వాతావరణం దగ్గరపడుతున్న కొద్దీ, ఈ ఆరోపణలు రాజకీయ ప్రత్యర్థులకు బలమైన ప్రచార ఆయుధాలుగా మారే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.ఇదే సమయంలో బీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఏమి సాధించిందని జాతీయ రాజకీయాలపై ఆశలు పెట్టుకుందన్న ప్రశ్న కూడా రాజకీయంగా గట్టిగా వినిపిస్తోంది. ప్రత్యేక తెలంగాణ ఉద్యమం ద్వారా ప్రజల ఆకాంక్షల్ని ప్రతిబింబిస్తూ అధికారంలోకి వచ్చిన పార్టీ, కాలక్రమంలో ఉద్యమ స్ఫూర్తిని పక్కన పెట్టి అధికార కేంద్రీకరణ, కుటుంబ రాజకీయాలు, ఆర్భాట పాలన వైపు మళ్లిందన్న విమర్శలు బలపడ్డాయి. రాష్ట్రంలోనే ప్రజల విశ్వాసాన్ని పూర్తిగా నిలబెట్టుకోలేని పరిస్థితిలో, జాతీయ స్థాయిలో ప్రత్యామ్నాయ శక్తిగా ఎదుగుతామన్న ఆలోచన రాజకీయ వాస్తవాలకు దూరంగా ఉందన్న భావన విస్తరిస్తోంది.ఈ నేపథ్యంలోనే "వ్యక్తిగా వెళ్లి, తిరిగి శక్తిగా చట్ట సభకు వస్తా" అన్న ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది కేవలం వ్యక్తిగత ఆత్మ విశ్వాస ప్రకటనగా కాకుండా, బీఆర్ఎస్‌లో చోటు కోల్పోయిన ఉద్యమ కారుల అసంతృప్తికి ప్రతిరూపంగా మారింది. ముఖ్యంగా ఇరిగేషన్ శాఖలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న భారీ అవినీతి, వేల కోట్ల ప్రాజెక్టుల చుట్టూ నెలకొన్న అనుమానాలు, ప్రజాధన దుర్వినియోగంపై వస్తున్న విమర్శలు ఈ వాదనలకు మరింత బలం చేకూరుస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు రైతులకు ఎంతవరకు మేలు చేశాయన్న దానికన్నా, వాటి ద్వారా ఎవరు లాభ పద్దారన్న ప్రశ్నే ప్రజల్లో ఎక్కువగా చర్చకు వస్తోంది.రాజకీయ శక్తిగా కొత్త వేదికను నిర్మిస్తానన్న సంకల్పం, ప్రస్తుతం ఉన్న పార్టీలపై ప్రజల్లో పెరుగుతున్న నిరాశకు ప్రత్యుత్తరంగా కనిపిస్తోంది. తెలంగాణ ఉద్యమ కాలంలో ముందువరుసలో నిలిచిన అనేక మంది కార్యకర్తలు, నాయకులు బీఆర్ఎస్‌లో క్రమంగా పక్కన పద్దారని, ఉద్యమ ద్రోహులు పార్టీలో కీలక స్థానాలు దక్కించు కున్నారని ఆరోపణలు వెల్లువెత్తు తున్నాయి. ఉద్యమ సమయంలో త్యాగాలు చేసినవారికి గౌరవం దక్కలేదన్న భావన, పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేకపోవడమే దీనికి ప్రధాన కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి.వచ్చే ఎన్నికల్లో 'జాగృతి' పోటీ చేయాలన్న ప్రకటన కూడా ఈ అసంతృప్తికి రాజకీయ రూపమివ్వాలన్న ప్రయత్నంగా చూడాలి. ఇది బీఆర్ఎస్‌కు మాత్రమే కాకుండా, తెలంగాణ రాజకీయ వ్యవస్థ మొత్తానికే సవాల్‌గా మారే అవకాశముంది. ఉద్యమ కారులు, యువత, నిరుద్యోగులు, రైతులు వంటి వర్గాలు కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాల కోసం ఎదురుచూస్తున్న వేళ, ఈ ప్రయత్నం ఎంతవరకు ప్రజల మద్దతు సంపాదిస్తుందన్నది కీలక ప్రశ్నగా నిలుస్తోంది.అత్యంత దయనీయంగా తనను పార్టీ నుంచి సాగనంపారన్న వేదన, బీఆర్ఎస్‌లో భిన్న స్వరాలకు చోటు లేదన్న ఆరోపణలకు మరింత బలం చేకూరుస్తోంది. ఉద్యమ కారులకు బీఆర్ఎస్‌లో స్థానం లేదన్న వ్యాఖ్య, పార్టీ మారిన రాజకీయ స్వభావాన్ని స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. ఒకప్పుడు ప్రజా ఉద్యమానికి ప్రతీకగా నిలిచిన పార్టీ, ఇప్పుడు అధికారాన్ని కాపాడుకునే రాజకీయ యంత్రాంగంగా మారిందన్న అభిప్రాయం బలపడుతోంది.

మొత్తంగా చూస్తే, కల్వకుంట్ల కవిత శాసన మండలిలో చేసిన వ్యాఖ్యలు వ్యక్తిగత రాజకీయ రక్షణ ప్రకటనగా మాత్రమే కాకుండా, తెలంగాణలో మారుతున్న రాజకీయ సమీకరణాలకు అద్దం పట్టే ఘటనగా నిలుస్తున్నాయి. అవినీతి ఆరోపణలు, వాటిపై ప్రతివాదాలు, ఉద్యమ వారసత్వంపై జరుగుతున్న చర్చలు, కొత్త రాజకీయ వేదికల ఆవిర్భావం?ఇవన్నీ రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాలను మరింత ఉత్కంఠభరితంగా మార్చే సూచనలు ఇస్తున్నాయి. బీఆర్ఎస్ ఈ పరిస్థితిని తనకు అనుకూలంగా మలుచుకో గలుగుతుందా, లేక ఆరోపణలు, అసంతృప్తుల భారంతో మరింత ఒత్తిడికి లోనవుతుందా అన్నది రానున్న రాజకీయ పరిణామాలే తేల్చనున్నాయి.

# ప్రత్యేక చట్టాలకు నోచుకోని ఆదివాసీలు

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో తమ హక్కుల సాధన కోసం ఆదివాసీ సమాజాలు ఉద్యమించిన సందర్భాలు అనేకం ఉన్నాయి. బ్రిటిష్ చట్టాలకు వ్యతిరేకంగా బిర్సాముండా, సంతాల్‌లు, తిరుగుబాటు చేశారు. జల్, జంగల్, జమీన్ కోసం సాయుధ పోరాటాలు చేశారు. తమపై సాగుతున్న అన్నిరకాల దోపిడీ, పీడనలను ఎదిరించారు. అనేకసార్లు ఓటమి చెందినా తమ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతున్న పరిస్థితులలో, తమ అస్తిత్వం కోసం అలుపెరుగని పోరాటాలు నేటికీ కొనసాగిస్తూనే ఉన్నారు. జీవన పోరాటంలో ఆరితేరిన వారు ఆదివాసీలు. వారు నివసించే ప్రాంతాలు పుష్కలమైన సహజ వనరులతో కళకళలాడు తుండేవి. సాటి మానవులుగా అనేక దేశాలలో వారికి తగిన గుర్తింపు, రక్షణ లేదు. ఆయా దేశాలలో కనీసపు చట్టాలు, హక్కులు కూడా లేవు. నాగరిక సమాజపు కొత్త పోకడలకు దూరంగా తమ కట్టు, బొట్టు, ఆచార వ్యవహారాలు, సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుంటు, తరతరాలుగా భావి తరాలకు అందిస్తున్నారు. యేడాది పొడవునా వారు జరుపుకునే పండుగలు, వేడుకల్లో వారి సంస్కృతి ప్రతిబింబిస్తుంది.ప్రొఫెషనల్ అసిస్టెన్స్ ఫర్ డెవలప్‌మెంట్ యాక్షన్ ఏప్రిల్‌లో ప్రచురించిన స్టేటస్ ఆఫ్ ఆదివాసీ లైవ్లీహుడ్ రిపోర్ట్, 2021 ప్రకారం, భారతదేశం లోని ఆదివాసీ జనాభా ఆదివాసీయేతర జనాభాతో పోలిస్తే పేద జీవన ప్రమాణాలను కలిగి ఉంది. దేశ జనాభాలో 8.6% మంది షెడ్యూల్డ్ తెగలు (ఎస్టీలు) ఉన్నారు. వారిలో ఎక్కువ మంది 'కొండలు మరియు అడవులు' తెగలుగా వర్గీకరించ బడ్డారు.ఆదివాసీలు ఒడిషా, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌ఘడ్, రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, మిజోరం, అండమాన్ నికోబార్ దీవులలో ఎక్కువగా జీవిస్తున్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 244 ఆదివాసీ సంఘాలు అధికంగా నివసించే ప్రాంతాలను గుర్తించాలని రాష్ట్రాన్ని ఆదేశిస్తుంది. ఈ ప్రాంతాలలో వారిని, వారి గుర్తింపును పెంపొందించడానికి, వారిని అభివృద్ధి ప్రక్రియలో ఏకీకృతం చేయాలని నిర్దేశిస్తుంది. ఆర్టికల్ 275 రాష్ట్రాలకు ఆర్థిక కేటాయింపులు చేయడానికి స్పష్టమైన నిబంధనలను చేస్తుంది. ఆర్టికల్ 275 కింద నిధులతో కేంద్ర మద్దతు ఉన్న గిరిజన ఉప ప్రణాళికలతో పాటు గిరిజన ప్రజల సంక్షేమాన్ని ప్రోత్సహించడానికి అనేక నిర్దిష్ట కార్యక్రమాలు రూపొందించి అమలు చేయబడ్డాయి. అయితే, ఈ ప్రయత్నాల ఫలితాలపై చాలా తక్కువ సమాచారం అందుబాటులో ఉందని నివేదిక ఎత్తి చూపింది.

మన దేశంలో సుమారు 600 ఆదివాసీ తెగలు గుర్తించ బడ్డాయి. భారత రాజ్యాంగం వీరికి చట్టపరమైన రక్షణలు కల్పించింది. 1874లోనే ప్రత్యేక షెడ్యూల్డ్ జిల్లాల చట్టం చేయబడింది. 1917లో ఆదివాసీ తెగల నివాస ప్రాంతాలలో ఉమ్మడి భూమి హక్కులు ఇవ్వబడ్డాయి. ఆదివాసీ తెగలకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తూ 2006లో చట్టం చేయబడింది. చట్టం ప్రకారం అటవీ భూమిపై ఆధారపడి జీవిస్తున్న ప్రతి గిరిజన కుటుంబానికీ 10 ఎకరాల వరకూ పట్టా ఇవ్వవచ్చు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా ఆదివాసీ తెగలు తమ సంప్రదాయపు భూముల నుంచి, అటవీ ప్రాంతం నుంచి నెట్టివేయ బడుతున్నారు. అవిభక్త ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో 1/70 చట్టం అమలులో ఉన్నది. గిరిజనుల సాంప్రదాయక భూములు గిరిజన తెగలకే దక్కాలి. గిరిజనేతరులకు షెడ్యూల్డ్ భూమిపై ఎట్టి హక్కూ లేదు. ఉభయ తెలుగు రాష్ట్రంలో షెడ్యూల్డ్ ప్రాంతంలో 48 శాతం సంప్రదాయక గిరిజన భూములను గిరిజనేతరులు ఆక్రమించు కున్నారు. ఆదివాసీ తెగల వాయిద్య పరికరాలు, వారి నృత్యాలు ప్రభుత్వం ప్రోత్సాహం లేక అంతరించి పోతున్నాయి. ఆదివాసీ ప్రాంతాలలోకి పర్యాటకం ప్రవేశించాక ఆదివాసీ కళలు వ్యాపార సరుకులుగా మారి పోయాయి. స్వాతంత్ర్యం వచ్చి యేళ్లు గడుస్తున్నా అభివృద్ధికి నోచు కోని గిరిపల్లెలు నేటి ఉన్నాయి. విద్య, వైద్య, రవాణా విషయంలో గిరిజన గూడాలు, తాండాల్లో నేటికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నడవడానికి రోడ్డు, తాగటానికి నీటి సౌకర్యం కూడా లేని పల్లెలున్నాయి. ఇప్పటికి పోడు భూముల సమస్య, అటవీ భూములకు పట్టాలు, ప్రభుత్వ అజమాయిషీ కాకుండా గ్రామసభల ద్వారా స్వయం పాలన ఉద్దేశిత పీసా చట్టం అమలు కోసం గిరిజన ప్రాంతాల్లో ఆదివాసీ సంఘాలు పోరాటాలను కొనసాగిస్తూనే ఉన్నాయి. తెలంగాణలో గతకేసిఆర్ ప్రభుత్వం వీరి స్వయం పరిపాలనే లక్ష్యంగా ప్రత్యేక గ్రామ పంచాయతీలు ఏర్పాటుచేసి ప్రత్యేక నిధులు కేటాయించింది. పోడు భూముల విషయంలోనూ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకుంది కూడా.పోడు చేసుకుంటున్న ఆదివాసీలపై, పోడు భూముల్లో ఆదివాసీలు వేసుకున్న గుడిసెలను అటవీశాఖ అధికారులు తొలగించడం, దాడులు చేయడం, తీవ్ర ఇబ్బందులకు గురి చేయడం, తమ గుడిసెలు తొలగించవద్దంటూ అధికారులను అడ్డుకునే ప్రయత్నం చేయడం అక్కడక్కడా చోటు చేసుకుంటు న్నాయి. 1/70, పీసా, అటవి హక్కుల చట్టం అమలు చేయాలని, ఏజెన్సీలో భూ దురాక్రమణపై కమిటీ వేయాలని,ఏజెన్సీ ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా కలిపి స్వయం పాలన కల్పించాలని, ట్రైబల్ సబ్‌ప్లాన్ నిధులు సంపూర్ణంగా ఆదివాసీలకే కేటాయించాలని, గొండు, కోయ వారికి పదో తరగతి వరకు వారి మాతృభాషలోనే బోధన చేయాలని, జిఒనెం.3ని అమలు చేయాలని ఆదివాసీలు చేసే డిమాండ్ల పరిష్కారం కోసం ప్రభుత్వం కృషి చేస్తూ,

గిరిజన అభివృద్ధికి ఇతోధిక సంక్షేమ కార్యక్రమాల అమలు అనివార్యంగా, అత్యవసరంగా చేయాల్సి ఉంది.

# జైపూర్ కృత్రిమ కాలు సృష్టికర్త సేథీ

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగు చలన చిత్ర రంగంలో ఒక మరుపురాని అద్భుత చిత్రరాజం మయూరి. ఆ రోజుల్లో ఆ సినిమా ఒక సంచలనం. సింగీతం శ్రీనివాస రావు దర్శకత్వంలో ఉషాకిరణ్ మూవీస్ పతాకంపై రామోజీరావు నిర్మించగా, 1985లో విడుదల చేసిన చిత్రం. నర్తకియైన సుధా చంద్రన్ నిజ జీవితం ఆధారంగా సహజత్వం ఉట్టిపడేలా తీసిన చిత్రం. ప్రమాదం కారణంగా ఒక కాలు కోల్పోయిన స్థితిలో, నిరాశ నిస్పృహలకు లోను కాకుండా కృత్రిమ కాలు అమర్చుకుని, కష్ట పడి సాధన చేసి, కృత్రిమ కాలు తోనే నాట్య ప్రదర్శనలు ఇచ్చి అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన నాట్య మయూరి జీవితమే ఆ సినిమా కథ నేపథ్యం. ఆ నర్తకే సుధా చంద్రన్. ఆమె జీవిత నేపద్యమే మయూరి సినిమా కథా వస్తువు. ఆ సినిమాలో మయూరి పాత్ర పోషించింది స్వయాన సుధా చంద్రన్ కావడమే విశేషం. సుధా

చంద్రన్ జైపూర్ వెళ్ళి కృత్రిమ కాలును అమర్చు కోవడాన్ని మయూరి సినిమాలో చూస్తాం. ఆ కృత్రిమ పాదం, కాలు రూపకర్త ఎవరో చాలా మందికి తెలియదు. ఆయనే... కాళ్ళు కోల్పోయిన ఎందరికో, కృత్రిమ కాళ్ళు అమర్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన, దేశం గర్వించ దగిన ప్రముఖ శస్త్ర వైద్యుడు పి.కె.సేథీగా పేరెన్నిక గన్న ప్రమోద్ కరణ్ సేథీ. ప్రమోద్ కరణ్ సేథీ (నవంబర్ 28, 1927 – జనవరి 7, 2007) భారతీయ శస్త్ర వైద్యుడు, జైపూర్ కృత్రిమ పాదం (జైపూర్ ఫూట్) సృష్టికర్త. 1927, నవంబర్ 28 న ఉత్తర ప్రదేశ్ లోని వారణాసిలో జన్మించాడు. కాళ్ళు కోల్పోయిన అనేక మందికి కృత్రిమ కాలు అమర్చి ఎందరికో నడక నేర్పిన సేథీ గిన్నిస్ బుక్ రికార్డులో కూడా నమోదు కా బడి, ప్రశంసాపత్రం అందుకున్నాడు. 1981లో సామా జిక సేవా రంగంలో ఆసియా లోనే అత్యుత్తమమైన మెగ్సేసే అవార్డు కూడా అయన పొందాడు. భారత ప్రభుత్వం ఆయన సేవలను గుర్తిం చి పద్మశ్రీ పురస్కారంతో సత్కరిం చింది. పుట్టుకతోనే కాలు లేకుండా జన్మించిన వికలాంగులకు, విధి వంచితులై, ఎన్నో రకాలుగా కాళ్ళు కోల్పోయిన వారికి, ఎందరో సైనికు లకు, దాడుల్లో గాయపడిన అమా యకులకు ఇలా ఎందరికో, అంగ వైకల్యం కలుగ కుండా, తిరిగి నడక నేర్పాడు, జీవితాలలో వెలుగు ప్రసాదించాడు సేథీ.ఎముకల వైద్య నిపుణుడైన సేథీ 1969లో పరిచితుడైన, నిరక్ష్యరా స్యుడైన చేతివృత్తి నిపుణుడు రామచంద్ర శర్మతో కలిసి జైపూర్ పాదాన్ని తయారు చేశాడు. కొత్త ఆవిష్కరణకు తెర లేపాడు. అంతకు ముందు, జైపూర్ పాదం తయారు చేయడానికి ముందు కృత్రిమ కాలు అమర్చు కోవాలంటే ఖర్చు ఎక్కువగా అయ్యేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని సేథీ... రబ్బరు, చెక్క, అల్యూమినియంతో కృత్రిమ పాదం తయారుచేసి తక్కువ ధరలో సామాన్యులకు అందు బాటులో ఉండేలా కృషి చేశాడు. 1975 వరకు కూడా ఈ కృత్రిమ పాదాన్ని అమర్చుకున్న వారు చాలా తక్కువే. అఫ్ఘనిస్తాన్ యుద్ధం తరువాత జైపూర్ ఫుట్ ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఈ యుద్ధంలో సోవియట్ యూనియన్ (ప్రస్తుత రష్యా) అమర్చిన మందు పాతరల వల్ల కాళ్ళు కోల్పోయిన అనేక మందికి అంతర్జాతీయ రెడ్ క్రాస్ సంస్థ జైపూర్ ఫుట్‌లను అమ ర్చింది. కార్గిల్ యుద్ధంలో కాళ్ళు కోల్పోయిన అనేక సైనికులు కూడా జైపూర్ పాదాలనే అమర్చు కున్నారు. ప్రముఖ నటి సుధా చంద్రన్ కూడా జైపూర్ ఫుట్‌నే అమర్చుకొని మయూరి చిత్రంలో నటించి పలువురి ప్రశంసలు అందుకొన్న విషయం తెలిసిందే. ప్రమోద్ కరణ్ సేథీ సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించగా, అత్య ధికులకు కృత్రిమ అవయవం అమర్చినందులకు సేథీ పేరును గిన్నిస్ బుక్ లో రికార్డు చేశారు. ఆసియాలోనే అత్యుత్తమమైన మెగ్సేసే అవార్డు కూడా సేథీని వరించింది.డాక్టర్ బిసి రాయ్ అవార్డు ప్రముఖ వైద్య ఉపాధ్యాయుడిగా, 1979, పద్మశ్రీ – ప్రభుత్వం ఆఫ్ ఇండియా 1981, మాగ్సేసే అవార్డు – మనీలా, 1981, సైంటిఫిక్ అచీవ్‌మెంట్ కోసం గిన్నిస్ అవార్డు, 1982, గౌరవ ఆ.రాఇ. (రాజస్థాన్ విశ్వ విద్యా లయం) 1982, అత్యుత్తమ వైద్య పరిశోధనలకు ఆర్.డి.బిర్లా అవార్డు,1984, నాడ్ జాన్సెన్ లెక్చర్ అండ్ మెడల్ వరల్డ్ కాంగ్రెస్ ఆన్ ప్రోస్తేటిక్స్ అండ్ ఆర్థోయిటిక్స్, కోబ్, జపాన్ 1989, డాక్టర్ బిసి రాయ్ నేషనల్ అవార్డు ఆఫ్ ది ఇమినెంట్ మెడికల్ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ న్యూ ఢిల్లీ 1989, డాక్టర్ బి. ముఖోపాధ్యాయ ఓరేషన్ ఆర్థో పెడిక్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ – బరోడా 1998, గౌరవ ఫెలోషిప్, ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసియేషన్ 1999, ప్రపంచ అండర్స్టాండింగ్ మరియు శాంతికి రోటరీ అంతర్జాతీయ అవార్డు శాన్ ఆంటోనియో, యుఎస్ఎ 2001, 20 వ శతాబ్దంలో అత్యుత్తమ పరిశోధనా శాస్త్రవేత్తకు అవార్డు – ఆర్థోపెడిక్ రీసెర్చ్ అండ్ ఎడ్యు కేషన్ ఫౌండేషన్ – పాట్నా 2002, నేషనల్ అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఇండియా – 2004, లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు ఆఫ్ ఇండియన్ ఆర్థోపెడిక్ అసోసి యేషన్, డిసెంబర్ 2004 తదితర ఎన్నో అవార్డులను ఆయనను వరించాయి.

కాళ్ళు కోల్పోయిన ఎందరికో కృత్రిమ కాళ్ళు అమర్చి వారి జీవితాలలో వెలుగులు నింపిన సేథీ 2007, జనవరి 7 న జైపూర్‌లో మరణించారు.

## ముగ్గులు ఎందుకంటే..



**హైదరాబాద్ పెన్ పవర్:** ధర్మసందేహంధనుర్మాసం, సంక్రాంతి సమయంలో ఇంటి ముందు ముగ్గులు వేయాలంటారు. దీని వెనుక ఉద్దేశం ఏమిటి?ప్రసన్న, కొత్తపేటప్రాణికోటికి ప్రత్యక్షంగా కనిపిస్తూ, వెలుగును అనుగ్రహించే దైవం సూర్యుడు.ఈ సృష్టి మనుగడకు ఆయనే మూల కారకుడు. దివాకరుడికి స్వాగతం పలుకుతూ చేసుకునేదే సంక్రాంతి పండుగ. ధనుర్మాసం నుంచి సంక్రాంతి శోభ మొదలవుతుంది. దక్షిణాయనం, ఉత్తరాయణం సంధికాలం ఈ ధనుర్మాసం. రానున్న ఉత్తరాయణ పుణ్య కాలానికి ఆరంభ సూచకంగా, ప్రత్యక్ష నారాయణుడికి ఆహ్వానం పలుకుతూ ముంగిళ్లను ముగ్గులతో అలంకరించే సంప్రదాయం ఏర్పడింది. తొలి సంధ్య వేళలో లేలేత సూర్యకిరణాలు వాకిట్లో విస్తృతంగా ప్రసరిస్తాయి. ఈ సమయంలో ముగ్గులు వేయడం వల్ల ఆరోగ్యానికి అవసరమయ్యే సూర్యశక్తి లభిస్తుంది. అంతేకాదు, నడుం వంచుతూ, కూర్చుంటూ, లేస్తూ, చేతులు ఆడిస్తూ ముగ్గు పెట్టేక్రమంలో శారీరక వ్యాయామం కూడా జరుగుతుంది.ముఖ్యంగా చలి అధికంగా ఉండే ధనుర్మాసంలో సూర్యకాంతి చాలా అవసరం. ఈ మేరకు సంక్రాంతి వేళ ముగ్గులు పెట్టే సంప్రదాయం తప్పనిసరి చేశారు మన పెద్దలు. ముంగిలిని నిర్మల ఆకాశానికి ప్రతీకగా భావిస్తారు. ముగ్గుకోసం వేసే చుక్కలను నక్షత్రాలుగా, వాటిని కలుపుతూ వేసే గీతలు ఖగోళంలో మార్పులుగా భావిస్తారు. ముగ్గు కేంద్రకాన్ని సూర్యుడికి సంకేతంగా చెబుతారు. సంక్రాంతి నాడు సూర్యభగవానుణ్ని ఆహ్వానిస్తూ రథం ముగ్గును విధిగా వేస్తారు. ఇలా ముగ్గుల వెనుక ప్రాధాన్యాన్ని తెలియజేశారు మన పెద్దలు. అంతేకాదు, వాకిట్లో పేడనీళ్లతో చల్లే కళ్లాపి క్రిమికీటకాలకు విరుగుడుగా పని చేస్తుంది. ముగ్గుపిండి కూడా అందుకు తోడ్పడుతుంది.

## హెర్బల్ టీ' లేబుల్‌పై వ్యాపారులకు ఎఫ్ఎస్ఎస్ఏఐ వార్నింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొంతకాలంగా హెర్బల్ టీ పేరుతో రకరకాల మొక్కలు, మూలికలతో చేసిన టీ పొడుల బ్రాండ్లు పెరిగాయి. కొన్ని పెద్ద ఎఫ్ఎంసీజీ కంపెనీలు సైతం రకరకాల మొక్కల మిశ్రమాలతో తయారైన టీ రకాలను విక్రయిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఇటువంటి వాటిని హెర్బల్ టీ పేరుతో విక్రయించవద్దని ఫుడ్ సేఫ్టీ, స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా(ఎఫ్ఎస్ఎసేఐ) కీలక హెచ్చరికలు జారీ చేసింది. ఈ మేరకు మొక్కలు, మూలికలతో చేసిన టీగా పేర్కొనవద్దని స్పష్టం చేసింది. సాధారణంగా తేయాకు నుంచి సేకరించినవి కాకపోవడంతో వల్ల టీగా పరిగణించవద్దని, అలా చేస్తే చట్ట ప్రకారం తప్పుదోవ పట్టించినట్టు, నకిలీ ప్రచారం నిర్వహించినట్టుగా భావించాల్సి ఉంటుందని వెల్లడించింది. ఇటీవల హెర్బల్ టీ, ఫ్లవర్ టీ, రూయిబోస్ పేర్లతో అమ్మకాలు జరుగుతున్నాయి. ఇవి తేయాకు నుంచి సేకరించినవి కావని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. సాధారణంగా కాంగ్రీ టీ, గ్రీన్ టీ, ఇన్‌స్టంట్ టీలను మాత్రమే టీగా వ్యవహరిచవచ్చు. మిగిలిన వాటిని టీగా వ్యవహరించలేమని తెలిపింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని వ్యాపారులు, తయారీ కంపెనీలు, ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లు, మార్కెటింగ్, దిగుమతిదారులు, విక్రేతలందరూ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది. దీనికి సంబంధించి ఆదేశాలు అమలయ్యేలా రాష్ట్రాల అధికారులు చర్యలు తీసుకోవాలని వెల్లడించింది.

## అన్ని చట్టసభల్లో సభ్యుడైన అరుదైన నేత పాపిరెడ్డి

**హైదరాబాద్ పెన్ పవర్:** అవిభక్త ఆంధ్రప్రదేశ్ సీనియర్ రాజకీయ నాయకులు బెజవాడ పాపిరెడ్డి జయంతి, వర్ధంతి రెండు రోజుల తేడాతో వస్తాయి. అన్ని చట్టసభల్లో సభ్యుడిగా ఎంపికై రికార్డు సృష్టించిన నేతగా బెజవాడ బాపిరెడ్డి  చరిత్ర పుటల కెక్కారు. రాజకీయాలకు చిరునామాగా, మచ్చలేని నేతగా పాపిరెడ్డి గుర్తింపు పొందారు. విలువలకు మారు పేరుగా నిలిచారు. తెలుగు దేశం స్థాపనా సమయంలో పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావుకు  పార్టీ గుర్తుగా సైకిల్ ను సూచించింది పాపిరెడ్డి కావడం గమనార్హం. బెజవాడ పాపిరెడ్డి 1927, జనవరి 5 న నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డి పాలెంలో జన్మించారు. ఆంధ్రప్రదేశ్ శాసన మండలి, శాసనసభ, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికై వివిధ చట్ట సభ లలో పనిచేసిన అనుభవం గడించారు. 1958 నుంచి 1962 వరకు శాసనమండలి సభ్యుడిగా, 1967 నుంచి 1972 వరకు అల్లూరు శాసనసభ్యుడిగా, 1972 నుంచి 1978 వరకు రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. ఈ మూడింటిలో కూడా  ఆయన ఇండిపెండెంట్‌గానే గెలవడం విశేషం. 1969-72లో  బోర్డ్ ఆఫ్ మేనేజ్‌మెంట్, ఆంధ్ర ప్రదేశ్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ బాద్యునిగా, 1976-77లో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ, 1977-78  పబ్లిక్ అకౌంట్స్ కమిటీ సభ్యునిగా పని చేశారు. 1983-84 లో ఆంధ్ర ప్రదేశ్ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ చైర్మన్ గా ఉన్నారు.ఆదినుండి జాతీయ కాంగ్రెస్ వ్యతిరేక నేతగా  రాజకీయాల్లో మన గలిగిన పాపిరెడ్డి, తెలుగు దేశం ఆవిర్భావంతో ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు 1983లో ఆ పార్టీలో చేరారు. తెలుగుదేశం పార్టీని ప్రారంభించే సమయానికి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ వ్యతిరేక రాజకీయాల్లో రాటు తేలిన నాయకునిగా  కొనసాగుతున్న బెజ వాడ పాపిరెడ్డి గురించి తెలుసు కుని, ఆయన అనుభవాన్ని, అవసరాన్ని గుర్తించి, ఎన్టీఆర్, బెజవాడ పాపిరెడ్డిని తెలుగుదేశం పార్టీలోకి ఆహ్వానించి, సముచిత గౌరవంగా పార్టీ  ఉపాధ్యక్ష పదవిని అప్పగించారు.ఎన్టీ రామారావు రాజకీయ పార్టీ స్థాపించిన తర్వాత తొలిసారిగా 1983 ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో ఎన్నికల గుర్తు కోసం ఆలోచిస్తున్న సమయంలో పాపిరెడ్డి సైకిల్ ను ఎన్నికల గుర్తుగా పెట్టాలని సూచించారు. 1967లో ఆయన అల్లూరు నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థి గా  సైకిల్ గుర్తు'పై విజయం సాధించిన నేపథ్యంలో పాపిరెడ్డి సెంటిమెంట్ ను అనుసరించి ఈ సూచన చేయగా,  ఎన్టీ రామారావు పాపిరెడ్డి సూచనను వెంటనే  ఆమోదించి సైకిల్ ను తెలుగు దేశం పార్టీ ఎన్నికల గుర్తుగా ప్రకటించారు.  ఆయన 1983 నుంచి 1985 వరకు తెలుగుదేశం ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. 1983లో తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ప్రథమంగా రాజ కీయ పార్టీ పక్షాన అల్లూరు నుంచి శాసనసభకు పోటీ చేసి గెలు పొందారు. పాపిరెడ్డి పార్టీ ఆదేశాను సారం 1984లో ఒంగోలు లోక్‌సభ స్థానానికి పోటీ చేసి విజయం సాధించారు.మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నెల్లూరు జిల్లాలో సంగం ఆనకట్ట నుండి కావలి ప్రాంతానికి సాగు, తాగు నీటిని తీసుకు వెళ్లి, కావలి కాలువకు బెజవాడ పాపిరెడ్డి పేరు పెట్టడం ద్వారా ఆయనకు సముచిత గౌరవం కల్పించారు. బెజవాడ పాపిరెడ్డి అస్వస్థత కారణంగా 75 ఏట  2002, జనవరి 7 న హైదరాబాదులో మరణించారు.

## హెచ్‌పీసీఎల్ విశాఖ రిఫైనరీలో ఆర్‌యూఎఫ్



**హైదరాబాద్ పెన్ పవర్:** హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్), తన విశాఖపట్నం రిఫైనరీలో అవశేషాల అప్‌గ్రేడేషన్ కేంద్రాన్ని (ఆర్‌యూఎఫ్) ప్రారంభించింది. ఫలితంగా ప్లాంటు డీప్-కన్వర్షన్ సామర్థ్యం, డిస్టిలేట్ ఉత్పత్తి, లాభదాయకత గణనీయంగా పెరిగాయని తెలిపింది. డిస్టిలేట్ ఉత్పాదకత 10% అధికమవుతుందని పేర్కొంది. ఏటా 3.55 మిలియన్ టన్నుల సామర్థ్యం కలిగిన ఈ ప్లాంటులో దేశంలోనే తొలి అవశేష హైడ్రోక్రాకింగ్ యూనిట్, ప్రపంచంలోనే తొలి ఎల్‌సీ-మ్యాక్స్ యూనిట్ ఉన్నాయి. ముడిచమురులో తక్కువ విలువైన భాగాన్ని కూడా, 93% అధిక విలువైన పెట్రోలియం ఉత్పత్తులుగా ఇవి మార్చగలవని సంస్థ వివరించింది. చమురు శుద్ధి సంక్లిష్టతను మెరుగుపరచడంలో, దిగుమతి చేసుకున్న ఇంధనాలపై ఆధారపడటాన్ని తగ్గించడంలో ఈ ప్రాజెక్ట్ ఒక ప్రధాన అడుగు అని తెలిపింది.

# లోపం ఆమెదే అంటే ఎలా?

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ మధ్య కాలంలో రకరకాల సమస్యలతో పిల్లలు పుట్టడానికి అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాంటప్పుడు ఇద్దరూ అవసరమైన చికిత్స చేయించుకోవాలి. కానీ కాలం ఎంత మారుతున్నా చాలా మంది పిల్లలు పుట్టకపోతే సమస్య ఆడవాళ్లదే అనే భావనలో ఉంటున్నారు. పరీక్షలు, చికిత్స ఆమెకే చేయిస్తున్నారు. మగవాడిలో సమస్య ఉన్నా అంగీకరించడం లేదు. అతనే కాదు కుటుంబ సభ్యులు కూడా సమస్య అతనిలోనే ఉందంటే జీర్ణించుకోలేకపోతున్నారు. అలాంటి కథనమే ఈ వారం ఐద్వా అదాలత్(ఐలమ్మ ట్రస్ట్)లో మీ కోసంఫాతిమాకు 28 ఏండ్లు ఉంటాయి. ఆమెకు సలీమ్‌తో పెండ్లి జరిగి రెండేండ్లు అవుతుంది. ఇద్దరికీ ఇది రెండో వివాహం. ఇద్దరూ అంగీకరించే పెండ్లి చేసుకున్నారు. రెండేండ్లు అయినా ఇంకా పిల్లలు కావడం లేదు అంటూ ఫాతిమా అత్త రోజూ ఆమెను సూటిపోటి మాటలతో బాధపెడుతుంది. దాంతో ఫాతిమా ఈ విషయాన్ని ఇంట్లో చెప్పింది. తల్లిదండ్రులు ఆమెను ఆస్పత్రికి తీస్కుళ్లారు. అన్ని పరీక్షలు చేసి చికిత్స కూడా చేశారు. ఏడాది అయినా ఎలాంటి ప్రయోజనం లేదు. దాంతో డాక్టర్ సలీమ్‌ను తీసుకురమ్మని చెప్పారు. అతను ఆస్పత్రికి రావడానికి ఇష్టపడలేదు. అయినా ఏదో చెప్పి ఒప్పించి ఆస్పత్రికి తీస్కుళ్లింది ఫాతిమా. వైద్య పరీక్షల్లో అతనికి సమస్య ఉన్నట్టు తేలింది. అతనికి పిల్లలు కలిగే అవకాశం లేదు. దాంతో ఫాతిమా ఐయూఐ, ఐవీఎఫ్ ద్వారా పిల్లల్ని కనాలని అనుకుంది. కానీ దానికి కూడా సలీమ్ పనికి రాడు అని తేలింది. దాంతో ఏం చేయాలో ఫాతిమాకు అర్థం కాలేదు.భర్తను వదిలేసి వేరే పెండ్లి చేసుకొమ్మని అందరూ సలహా ఇచ్చారు. కానీ ఫాతిమాకు అది ఇష్టం లేదు. అందుకే 'మనం ఒక పాపనో, బాబునో దత్తత తీసుకుందాం. పిల్లలు లేకపోతే జీవితంలో ఏదో కోల్పోయినట్టుగా ఉంటుంది' అంది ఫాతిమా. దీనికి సలీమ్ ఒప్పుకున్నా అతని కుటుంబ సభ్యులు మాత్రం ఒప్పుకోలేదు. సలీమ్ తల్లి అయితే పెద్ద గొడవ చేసింది. 'నా కొడుక్కి పిల్లలు పుట్టరని ఎవరు చెప్పారు. కచ్చితంగా పుడతారు. ఫాతిమాలోనే ఏదో లోపం ఉంది. మా వాడు మగాడు వాడిలో లోపం ఎందుకు ఉంటుంది. దత్తతకు నేను ఒప్పుకోను. ఎవరికో పుట్టిన బిడ్డను నేను ఎలా అంగీకరిస్తాను? అంతగా అయితే నా కొడుక్కు ఇంకో పెండ్లి చేస్తాను. అంతేకాని దత్తతకు మాత్రం అస్సలు ఒప్పుకోను' అని ఫాతిమాను ఇంట్లో నుండి గెంటేసింది. సలీమ్ ఒక్క మాట



కూడా మాట్లాడలేదు. ప్రస్తుతం ఫాతిమా పుట్టింటికి వెళ్లి నాలుగు నెలలు అవుతుంది. చేయని తప్పుకు శిక్ష అనుభవిస్తుంది. అయితే ఈ మధ్యనే తెలిసిన విషయం ఏమిటంటే సలీమ్‌కి ఇంకో పెండ్లి చేయడం కోసం ఏర్పాట్లు చేస్తున్నారు. పెండ్లి డేట్ కూడా ఫిక్స్ చేశారు. దాంతో ఫాతిమా వెంటనే భర్తకు ఫోన్ చేసింది.

దానికి అతను 'నీకు పిల్లలు పుట్టరు కాబట్టి నేను ఇంకో పెండ్లి చేసుకుంటున్నాను. ఇందులో తప్పేముంది' అన్నాడు. 'మరి నా పరిస్థితి ఏంటి, ముందు నాకు ఓ దారి చూపించి తర్వాత నీ ఇష్టం వచ్చినట్టు చేసుకో' అంది ఫాతిమా. 'నువ్వు కూడా ఆమెతో పాటు నా భార్యగా ఉంటావు' అన్నాడు. దాంతో ఆమె తెలిసిన వాళ్లు చెబితే ఐద్వా లీగల్ సెల్‌కు వచ్చి 'నా భర్త నా జీవితం నాశనం చేశాడు. ఇప్పుడు ఇంకో అమ్మాయి జీవితం నాశనం చేయడానికి సిద్ధమయ్యాడు. ఇన్ని రోజుల నుండి ఏదో ఒక రోజు నన్ను తీస్కుళతాడనే నమ్మకం ఉంది. కానీ ఇంకో పెండ్లి చేసుకోడానికి నిర్ణయించుకున్నాడు. మీరే నాకు న్యాయం చేయండి' అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. ఆమె చెప్పింది మొత్తం విన్న తర్వాత సలీమ్‌ను, అతని తల్లిని పిలిపిస్తే ఫాతిమాను తీస్కుళ్లడానికి ఆమె అస్సలు ఒప్పుకోవడం లేదు. తన కొడుకులోని లోపాన్ని అంగీకరించడానికి సిద్ధంగా లేదు. దాంతో మేము 'ముందు మీరు మీ కొడుక్కు పరీక్షలు చేయించి అప్పుడు మాట్లాడండి.సమస్య అతనిలో ఉంచుకొని ఎన్ని పెండిండ్లు చేసినా పిల్లలు ఎలా పుడతారు. నిజాన్ని ఒప్పుకోకుండా సలీమ్‌కు ఇంకో పెండ్లి చేస్తే మీపై కేసు పెట్టాల్సి వస్తుంది. ఫాతిమా మంచిది కనుక అతనిలోని లోపాన్ని అర్థం చేసుకొని పిల్లల్ని దత్తత తీసుకుందామంది. కానీ మీరు ఒప్పుకోకుండా అనవసరంగా అమ్మాయిల జీవితాలతో ఆటలాడుతున్నారు. ఇప్పటికైనా మీరు మీ కొడుకులోని లోపాన్ని గుర్తిస్తే మంచిది. లేదంటే జైలుకు వెళ్లాల్సి వస్తుంది. అలాగే ఫాతిమాకు నష్టపరిహారం ఇచ్చి మీ ఇష్టం వచ్చినట్టు మీరు చేసుకోవచ్చు' అన్నాము. దాంతో సలీమ్ తల్లి ఇక మాట్లాడలేకపోయింది. 'నా కొడుక్కి పిల్లలు పుట్టరని తెలిస్తే బంధువుల్లో మా పరువు పోతుంది. అందుకే ఇలా మాట్లాడుతున్నాను' అంది. దానికి మేము 'ఇందులో పరువు పోవడానికి ఏముంది. మనుషులన్న తర్వాత కొన్ని సమస్యలు ఉంటాయి. వాటిని గుర్తించి అంగీకరించి ఎలా బయటపడాలో ఆలోచించాలి.పిల్లల్ని దత్తత తీసుకోవడానికి సలీమ్‌కు ఎలాంటి ఇబ్బందీ లేదు. కాబట్టి మీరు అడ్డు చెప్పకుండా ఉంటే మంచిది. ఎవరి పిల్లలైతే ఏంటీ మీ దగ్గర పెరిగితే మీ పిల్లలే అవుతారు. ఈ రోజుల్లో కూడా మీరు ఇలా మాట్లాడితే ఎలా?' అన్నాము. దాంతో ఆమె కూడా దత్తతకు ఒప్పుకుంది. సలీమ్‌తో 'ముందు మీరు ఆర్థికంగా కొంత స్థిరపడండి. మీ ఆదాయాన్ని పెంచుకోండి. అప్పుడు పాపనో, బాబునో దత్తత తీసుకోండి. ఇప్పుడే తొందరపడితే ఆర్థిక ఇబ్బందులతో కొత్త సమస్యలు వస్తాయి. ఇద్దరూ ఉద్యోగం చేయండి. అప్పుడు కొంత డబ్బు ఆదా చేయవచ్చు. దాంతో పిల్లలను ఎలాంటి ఇబ్బంది లేకుండా పెంచవచ్చు' అని చెప్పాము. సలీమ్ తల్లితో మాత్రం ఆలోచనా విధానం మార్చుకొని, లోపాలను అంగీకరించడం నేర్చుకోమని కాస్త గట్టిగానే చెప్పాము. దాంతో ఆమె కూడా దత్తతకు మనస్ఫూర్తిగానే అంగీకరించింది.

# మెడిటేషన్‌తో మెదడుకు మేలు.



**హైదరాబాద్ పెన్ పవర్:** డైలీ కాసేపు మెడిటేషన్ చేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందని, మానసిక దృఢత్వం ఏర్పడుతుందని పెద్దలు చెబుతుంటారు. ఇది మనసును కంట్రోల్లో ఉంచుకునే అద్భుతమైన సాధనంగా పేర్కొంటారు.నిశ్శబ్దంగా కూర్చొని, శ్వాసపై ధ్యాస ఉంచుతూ అనవసర ఆలోచనలకు, భావోద్వేగాలకు స్వస్తి పలుకుతూ, చుట్టూ ఉన్న వాతారణంపై అవగాహన పెంచుకునేందుకు సహాయపడే గొప్ప టెక్నిక్ ధ్యానం అని అభివర్ణిస్తుంటారు. అయితే ఇది మెదడు సామర్థ్యాన్ని, వయస్సు(ఃతీజీతిని జీణవ)ను కూడా ప్రభావితం చేయడం ద్వారా వృద్ధాప్యాన్ని ఆలస్యం చేస్తుందని (ఆవశ్రీజీఎబ జీణతినిణ) అధ్యయనాలు పేర్కొంటున్నాయి. ధ్యానం చేయడమంటే చాలా మంది కేవలం మంత్రం జపించడం, దేవుడిని తల్చుకోవడం వంటి ఆధ్యాత్మిక భావనే కాదు, అది శారీరక ఆరోగ్యాన్ని భౌతిక మార్గమని, వ్యాయామంలా పనిచేస్తుందని కూడా నిపుణులు అంటున్నారు. దేవని నమ్మనివాళ్లు కూడా ఆధ్యాత్మికతో సంబంధం లేకుండానూ మెడిటేషన్ చేయవచ్చు. అంటే ఎవరికి నచ్చిన పద్ధతిలో వారు ఒక విషయంపై మనసును కేంద్రీకరిస్తూ మెడిటేషన్ చేయవచ్చునని నిపుణులు పేర్కొంటున్నారు. నచ్చిన వ్యక్తి, వస్తువు, అందమైన ప్రదేశం, దృశ్యం వంటివి కూడా మెడిటేషన్‌లో మీరు కేంద్రీకరించే అంశాలుగా సెలెక్ట్ చేసుకోవచ్చు. వాటిని మనసులో పునరావృతం చేసుకోవడం, గైడెడ్ ఇమేజరీ వంటి పద్ధతులను అనుసరించడం కూడా ధ్యానంలో ఒక భాగమని నిపుణులు అంటున్నారు.పద్ధతి ఏదైనా.. ఫలితం అదేఆధ్యాత్మికతో కూడినదైనా, ఆధ్యాత్మికతతో సంబంధలేనిదైనా మనసును ఒక విషయంపై లగ్నం చేయడమే మెడిటేషన్. కాగా ఇది మెదడు సామర్థ్యాన్ని, మెదడు ఆయుష్షును పెంచుతుందని 'న్యూరో ఇమేజ్'లో పబ్లిషైన ఒక అధ్యయనం పేర్కొన్నది. స్టడీలో భాగంగా పరిశోధకులు దీర్ఘకాలంగా మెడిటేషన్ ప్రాక్టీస్ చేస్తున్న వారిని, అలాగే చేయని వారిని కూడా పరిశీలించడంతోపాటు వారి మెదడుకు సంబంధించిన స్కాన్‌లను విశ్లేషించారు. జీవశాస్త్రపరమైన మెదడు వయస్సును(ఎతినీశ్రీనీణతిఇజీశ్రీ ఎతీజీతిని జీణవ) అంచనా వేయడానికి మెషిన్ లెర్నింగ్ మోడల్స్‌ను వినియోగించారు.దీర్ఘాయుష్షుకు మార్గంపరిశోధకులు దీర్ఘకాలంపాటు మెడిటేషన్ ప్రాక్టీస్ చేస్తున్న వ్యక్తుల మెదళ్లను(ఁష్టవ ఎతీజీతినిబ నీట జూవనీజూశ్రీవ లిష్ట్రనీ జూతీజీఇబితిఇవ ఎవటతిబిజీబితినీని), ధ్యానం చేయని వ్యక్తుల మెదళ్లతో పోల్చి చూసినప్పుడు, ధ్యానం చేస్తున్నవారి మెదడు వృద్ధాప్యాన్ని నెమ్మదించిందని, ఎక్కువకాలంపాటు యవ్వనంగా, చురుగ్గా ఉందని గుర్తించారు. 50 ఏండ్ల వయసులో రెండు దశాబ్దాలుగా మెడిటేషన్ చేస్తున్న వారిమెదడు, ఇదే ఏజ్ కలిగి మెడిటేషన్ చేయనివారి మెదడుతో పోల్చి చూడగా.. మెడిటేషన్ చేసేవారి మెదడు సగటున 7.5 సంవత్సరాలు చిన్నదిగా.. అంటే యవ్వనంగా కనిపించిందని పరిశోధకులు వెల్లడించారు. అయితే దీనిపై మరిన్ని పరిశోధనలు కూడా అవసరమని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.×గమనిక : పైవార్తలోని సమాచారం ఇంటర్నెట్ ఆధారంగా హెల్త్ జర్నల్స్ నుంచి సేకరించబడింది. అనుమానాలు ఉంటే నిపుణులను సంప్రదించగలరు.

# అరుదైన కవిత్వ సాధనం అధివాస్తవికత

**హైదరాబాద్ పెన్ పవర్:** సాహిత్యంలో అధివాస్తవికత ఉద్యమం 1924లో పుట్టింది. ఆండ్రే బ్రెటన్ (ంనిటతీవ ఃతీవబినీని) అనే ఫ్రెంచి రచయిత, కవి దీని వ్యవస్థాపకుడు. స్వప్నావస్థలో మెదిలే ఊహలను స్పృహతో నియంత్రించకుండా, ఉన్నదున్నట్టుగా వ్యక్తీకరించడం దీని లక్షణం. ఇంకా వివరంగా చెప్పాలంటే, స్వేచ్ఛాయుత సృజన మీద విధింపబడే తార్కిక యోచన, ప్రామాణిక నైతికత, సామాజిక కళా సంప్రదాయం, నిబంధన మొదలైన అన్ని ఆంక్షలకు వ్యతిరేకంగా తిరుగుబాటు చేయడం, ముందస్తు ఆలోచన ద్వారా కళాప్రక్రియను అవరోధించడాన్ని నిషేధించడం దీని ముఖ్య ధ్యేయాలు. ఆంతర్యపు లోతు (టవవజూ ఎతినిట) ను ఏ అంతరాయం లేకుండా పని చేయించే ఆటోమేటిక్ రచనా విధానాన్ని ఈ ఉద్యమవాదులు ఆశించారు. కలలను, నిద్ర ? మెలకువల మధ్య ఉండే అవస్థలను, సహజ విభ్రమాలను, లేదా మాదక ద్రవ్యాల ప్రభావంతో కలిగే భ్రాంతులను తమ రచనలలో ఉపయోగించేందుకు ప్రయత్నించారు.చైతన్య స్రవంతి శిల్పంలో మనసులో మెదిలే ఊహలను ఉన్నదున్నట్టుగా వ్యక్తీకరించటం ఉంటుందని ఆ వ్యాసంలో చెప్పుకున్నాం. అధివాస్తవికతలో కూడా అదే ప్రధాన లక్షణమని మళ్లీ ఇప్పుడు అంటున్నాం. మరి ఈ రెండింటి మధ్య గల భేదమేమిటి? మొదటిదానిలో, రాస్తున్న సమయంలో కవి/ రచయిత మనసులో మెదిలే జాగృత ఊహలను కాయితం మీద పెట్టడం జరుగుతుంది. దీనికి భిన్నంగా, స్వాప్నిక తార్కికతను వ్యక్తీకరించటం అధివాస్తవికత లక్షణం. చైతన్య స్రవంతిని ఎక్కువ వరకు సాహిత్యంలో మాత్రమే చూస్తాం, అధివాస్తవికత ఇతర కళలకు కూడా పాకింది. రెండూ సాహిత్యంలో కనిపించేవే అయినా, మొదటిదాన్ని కవిత్వంలోకన్న వచనంలో తరచుగా దర్శిస్తాం.అధివాస్తవికతకన్న కొంచెం ముందు ? అంటే, మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే ? 1916 లో ట్రిస్టాన్ జారా అనే రొమేనియన్/ ఫ్రెంచ్ కవి, నాటక రచయిత, సాహిత్య విమర్శకుడు డాడాయిజం అనే సాహిత్యోద్యమాన్ని ప్రారంభించాడు. ఇది కళారంగంలో, బూర్జువా సమాజంలో నెలకొన్న కుహనా విలువల మీద, తార్కికత మీద, సమంజసత్వం మీద దాడి చేసింది. మన దిగంబర కవుల కవిత్వం లాగా డాడాయిజం పాఠకులను బలమైన షాక్ కు గురి చేసింది. కాబట్టి, దీన్ని అధివాస్తవికతకు మూలంగా లేదా పూర్వగామి (జూతీవఇబీతీబనీతీ) గా ఎంచాలి. కొంత భిన్నత్వంతో అధివాస్తవికతను, డాడాయిజంను పోలిన ఔతిష్ట్రతిశ్రీతిబఎ ప్రధానంగా తాత్విక, నిరాశావాద ధోరణితో కూడుకున్నది. జీవితం అర్థం లేనిది, అసంబద్ధమైనది అని అభిప్రాయపడ్డారు దానికి చెందిన ఆల్బర్ట్ కామూ, జాక్ పాల్ సార్త్ర్ మొదలైన రచయితలు. కనుక దీన్ని ఆ రెండు సాహిత్యోద్యమాలకు ఒక విధమైన తోబుట్టువుగా భావించవచ్చునేమో. కానీ ఔతిష్ట్రతిశ్రీతిబఎ (దీని సరైన ఉచ్చారణ నాయెలిజం) వీటికన్న ఒక శతాబ్దం ముందే వేళ్లూనుకున్నది.అధివాస్తవికత కేవలం సాహిత్య రంగంలోనే కాకుండా చిత్రకళ, శిల్పకళ మొదలైన ఇతర రంగాలలోకి కూడా చొచ్చుకుపోయింది. అధివాస్తవికతకు సంబంధించిన ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం ఎందరో ఆధునిక కవులలో, రచయితలలో కనిపిస్తుంది. వీరు స్వేచ్ఛాయుతమైన రచన, భిన్నమైన వాక్య నిర్మాణం, తర్కరాహిత్యం, క్రమరాహిత్యం, పీడకలల వంటి వ్యాఖ్యానం,గ్భ్రాంతికరమైన, చిత్రవిచిత్రమైన, విడివడినట్టుగా కనిపించే పదచిత్రాలను పక్కపక్కన పెట్టడం మొదలైనవాటితో ప్రయోగాలు చేశారు. ఫ్రాంక్ ఓ హారా, కెన్నెత్ కోక్, బాబ్ డిలన్, ఫ్రాంజ్ కాఫ్కా మొదలైన ఎందరో ఆధునికుల రచనలలో దీన్ని మనం గమనించవచ్చు. డిలన్ థామస్ పేరు కూడా చెప్పుకోతగిందే. చిత్రకళా రంగంలో సాల్వడార్ డాలీ అధివాస్తవికతకు పెట్టింది పేరు. మరుభూమి నేపథ్యంతో కరుగుతున్న గడియారాలు అనే డాలీ పెయింటింగ్ ఎంతో ప్రసిద్ధమైనది.ఆంగ్ల వచన రచనలలోంచి అధివాస్తవికతకు ఉదాహరణ అనతగిన వర్జీనియా వుల్ఫ్ వాక్యాన్ని తెలుగులో చదవండి: "సూర్యుడు ఉదయించాడు, ప్రపంచం ఎల్లలు లేని ఆటలగదిలో తళతళ మెరుస్తున్న ఆటబొమ్మలా కనిపించింది." ఇటాలో కాల్వినో రాసిన ఎనిలతిబతిఎశ్రీవ అతిబితివబ నుంచి మరొక వాక్యం ఇలా ఉంది: "నగరం కొన్నిసార్లు ఎంత తేలికగా ఉన్నట్టు స్ఫురిస్తుందంటే, మనం మార్దవంగా పలికిన ఒక పేరు తాలూకు ధ్వనిని వదుల్తూ అది గాలిలో తేలిపోతున్నదేమో అన్నట్టుగా."ఇంగ్లిష్ కవిత్వంలో అధివాస్తవికతకు ఉదాహరణలు కింద ఇస్తున్నాను.

పని మనిషి ఇంటికి పండుగ రాలేదు?
ఏకాదశి నుండి సంక్రాంతి వరకు
ఏ పండుగ పని మనిషి ఇంటికి రావడం లేదు
అమ్మ మొదట పెట్టిన కఠిన షరతు
పండుగ పూట పని మానేయకూడదు అని
ప్రతి పండుగకు పొద్దుగాక ముందే
ఇల్లు అంతా సముద్రం చేసి ఆవిరి కూడ చేయాలి
ఇంటి ముందు ముగ్గు పని మనిషి కళా ఖండమే
ఆమె చెమట చుక్కల తోనే ఇంటి తోరణం
మొక్కలకు మొక్కులకు పాదు ఆమె
సాయంత్రం వచ్చి సకినాలకు సాయం కావలసినదే
అమ్మకు పని మనిషి మూడో చేయి ఎల్లప్పుడూ
భూమి సూర్యుని చుట్టూ తిరిగి నట్లు
పని మనిషి మా ఇంటి చుట్లు పదే పదే
అమ్మ పిలుపు కు అంత అయస్కాంత శక్తి వుంది
ఆల కించ కుంటే అమ్మ శివ గామియే సుమా
కత్తి రింపులు జీతం కోతలు ఆమె మెడ మీద
పని మనిషి ఇంటికి పండుగ రాలేదు
తీపి సంగతి దేవుడు ఎరుగు
పండుగ పూట పిల్లలతో గడపడం అత్యాశనే
తెల్ల వారక ముందే బరువుగా ఇళ్ల చుట్టూ ?

# రోగాలకే చుక్కలు చూపించే ఆకు కూర



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆకు కూరల్లో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే.. వీటిని రెగ్యులర్‌గా తినాలని సూచిస్తున్నారు డైటీషియన్లు..అలాంటి ఆకు కూరల్లో చుక్క కూర (ఖట్టా పాలక్) ఒకటి.. చుక్కకూర, సాధారణంగా వంటకాల్లో పుల్లని రుచి కోసం ఉపయోగించే ఆకుకూర.. వాస్తవానికి అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. ఇది కేవలం నోటికి రుచిని ఇవ్వడమే కాకుండా, శరీరానికి అవసరమైన పోషకాలను అందించి, వివిధ ఆరోగ్య సమస్యల నుండి ఉపశమనం కలిగిస్తుంది. ఈ ఆకుకూరను రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల కలిగే లాభాలను వివరంగా తెలుసుకుందాం.

**పోషకాల గని చుక్కకూర:**

చుక్కకూరలో విటమిన్‌లు ం, అ సమృద్ధిగా ఉంటాయి. అంతేకాకుండా, ఐరన్, మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం వంటి ముఖ్యమైన ఖనిజాలు ఇందులో పుష్కలంగా లభిస్తాయి. బీటా కెరోటిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా చుక్కకూరలో అధిక మోతాదులో ఉంటాయి. ఈ పోషకాలన్నీ శరీర ఆరోగ్యాన్ని కాపాడడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

**చుక్కకూర ప్రయోజనాలు..**

జీర్ణవ్యవస్థకు మేలు చేస్తుంది: చుక్కకూర జీర్ణ వ్యవస్థను మెరుగుపరుస్తుంది. నీళ్ల విరేచనాలు తగ్గించడానికి, మలబద్ధక సమస్యను దూరం చేయడానికి ఇది చాలా సహాయపడుతుంది. ఇందులో ఉండే ఫైబర్ కంటెంట్ జీర్ణక్రియను సులభతరం చేస్తుంది.

శరీరానికి చలువ: శరీరం వేడిగా ఉన్నప్పుడు, చుక్కకూరను ఆహారంలో తీసుకోవడం వల్ల ఒంట్లో వేడి తగ్గుతుంది.. శరీరం చల్లబడుతుంది. అధికంగా దప్పిక వేసేవారు కూడా ఈ ఆకుకూరను తీసుకోవడం ద్వారా సమస్యను నియంత్రించుకోవచ్చు. వాంతులు ఎక్కువగా అవుతున్నప్పుడు చుక్కకూరతో చేసిన వంటకాలు తినడం వల్ల వాంతులు తగ్గుతాయి.

**గుండె ఆరోగ్యం:** చుక్కకూరలో ఉండే ఐరన్ శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్‌ను సమర్థవంతంగా చేరవేయడానికి సహాయపడుతుంది. ఇది గుండెపై ఒత్తిడిని తగ్గించి, గుండె జబ్బులు రాకుండా కాపాడుతుంది. అధిక రక్తపోటు సమస్య ఉన్నవారికి కూడా చుక్కకూర ప్రయోజనకరంగా ఉంటుంది. శరీరంలో పేరుకుపోయిన కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది.

రోగనిరోధక శక్తి పెంపు: విటమిన్ అ, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల చుక్కకూర శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఇది క్యాన్సర్ కణాల వృద్ధిని నియంత్రించడంలో సహాయపడి, క్యాన్సర్ వ్యాధి రాకుండా అడ్డుకుంటుంది.

**షుగర్, కిడ్నీ రోగులకు కూడా మంచిది:** షుగర్ వ్యాధిగ్రస్తులకు చుక్కకూర చాలా మంచిది. ఇంకా కిడ్నీల సమస్యలు ఉన్నవారు కూడా ఈ ఆకుకూరను తీసుకోవచ్చు. రక్తహీనతతో బాధపడేవారికి చుక్కకూర ప్రయోజనకరంగా ఉంటుంది.. ఇది ఎర్ర రక్త కణాల వృద్ధికి తోడ్పడుతుంది.

**పుల్లని రుచి కలిగిన చుక్క కూరను ఈజీగా చేసుకోవచ్చు..**

చుక్క కూరను చాలా సింపుల్ గా జ్యూసీగా వండుకోవచ్చు.. చుక్కకూర కాడలు లావుగా, ఆకులు మందంగా, వెడల్పుగా ఉంటాయి. దాని పుల్లని రుచి ప్రత్యేకతను తీసుకువస్తుంది. దీనిలో రెండు టమోటాలను జోడించడం ద్వారా.. రుచి మరింత పెరుగుతుంది. ఈ అద్భుతమైన ఆకుకూరను మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవితాన్ని సొంతం చేసుకోవచ్చు.

# జాగ్రత్త మిత్రమా!.. వ్యాధుల ఉచ్చులో చిక్కుకోవద్దు

**హైదరాబాద్ పెన్ పవర్:** తస్మాత్ జాగ్రత్త! అన్ని విషయాల్లోనూ పెద్దలు చెప్పే మాట ఇది. ముందుచూపు ఉన్నవాడే ముందడుగు వేయగలడు.ఆర్థిక విషయాల్లోతప్పటడుగు వేస్తే.. రెండేండ్లకో, మూడేండ్లకో కోలుకునే అవకాశం ఉంటుంది. ఆరోగ్యం విషయంలో ఈ సూత్రం చెల్లదు. 'నాకేమవుతుంది!' అన్న నిర్లిప్త ధోరణి మిమ్మల్ని రోగాల విష వలయంలోకి నెట్టేయొచ్చు. ఆరోగ్య బీమా ఉంటే.. చికిత్సకయ్యే ఖర్చులు మీదపడకుండా ఉంటాయి కానీ, మీ బీమా రోగం రాదన్న ధీమా ఇవ్వదు కదా!! మరెలాగంటారా?! ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమబద్ధమైన జీవనశైలితో రాగల రోగాలను అడ్డుకోవచ్చని వైద్యులు చెబుతున్నారు. ఎలాంటి వ్యాధులనైనా నయం చేసే శక్తి ఆధునిక వైద్యరంగానికి ఉంది! కానీ, అదే సమయంలో వేగంగా పెరుగుతున్న రోగాలు వైద్యులకూ సవాళు విసురుతున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం చాలా అవసరం అంటున్నారు వైద్యులు. గతంతో పోలిస్తే.. ఈ మధ్య కాలంలో ఎలాంటి వ్యాధులు పెరుగుతున్నాయి, అందుకు కారణాలేంటి? మారుతున్న జీవనశైలి మనిషి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నది? తదితర అంశాలను నేటి ఊపిరిలో తెలుసుకుందాం!ప్రివెన్షన్ ఈజ్ బెటర్ దెన్ క్యూర్' నానుడి ఆరోగ్యానికి సంబంధించినదే! సంపాదన వేటలో పరుగులు తీస్తున్న మనిషి ఆరోగ్యాన్ని చాలా నిర్లక్ష్యం చేస్తున్నాడు. దీనికితోడు జిహ్వ చాపల్యాన్ని చంపుకోలేక, అలవాట్లు మానుకోలేక, వ్యాయామం చేసే తీరిక లేక? ఇలా రకరకాల కారణాలతో రోగాలను కొని తెచ్చుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో నడి వయసులోనే దవాఖానల చుట్టూ తిరగాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముప్పయ్ ఏండ్లలోనే గుండె జబ్బులు పలకరిస్తున్నాయి. నలభై రాకముందే కిడ్నీలు మొరాయిస్తున్నాయి. డబ్బుల్లో రావాల్సిన నరాల సమస్యలు? యాభై రాకముందే ముంచుకొస్తున్నాయి. దీనికంతటికీ కారణంఆరోగ్యంపై శ్రద్ధ లేకపోవడమే!

ముప్పయ్ రాకుండానే.. గుండెకు ముప్పు

ఒకప్పుడు యాభై ఏండ్లు దాటాక గానీ, గుండె సమస్యలు పలకరించేవి కావు. కానీ, ఇప్పుడు ముప్పయ్‌లోకి అడుగు పెట్టకముందే గుండె సంబంధిత రుగ్మతలు వస్తుండటం ఆందోళన కలిగిస్తున్నది, 20–30 ఏళ్లలోపు వయసు వారు కూడా తీవ్రమైన గుండె జబ్బులకు గురవడం విచారకరం. అయితే చిన్న వయసులోనే గుండె సంబంధిత వ్యాధులకు గురైనవారిలో ఎక్కువ శాతం రక్తపోటు లేదా అధిక కొలెస్ట్రాల్ సమస్యలతో బాధపడుతున్నట్టు పరిశోధనలు చెబుతున్నాయి. ఈ తరహా సమస్యల్లో చిక్కుకుంటున్న వాళ్లు కనీస



ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు కూడా చేయించుకోకపోవడం గమనార్హం. తాజా అధ్యయనాల ప్రకారం గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న రోగుల్లో సుమారు 30 శాతం మంది 30 ఏళ్లలోపు వారే ఉంటున్నారట. వీరంతా అసహజమైన జీవనశైలి కారణంగానే ఇలాంటి వ్యాధులతో బాధపడుతున్నారు. గణాంకాల ప్రకారం భారతదేశంలో 40 ఏళ్లలోపు వయసున్న ప్రతి నలుగురిలో ఒకరికి గుండెపోటును చూస్తున్నాం. సరైన జీవనశైలి, వ్యాయామం, నడక, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు పాటించడం ద్వారా గుండెకు వచ్చే జబ్బులను చాలా వరకు నియంత్రించవచ్చు.యువతలో బలహీనతన్యూరాలజిస్టుల నివేదికల ప్రకారం స్ట్రోక్ కేసులను పరిశీలిస్తే, దాదాపు మూడోవంతు యువతలోనే నమోదవుతున్నాయి. దీనికి అధిక రక్తపోటు, పొగ తాగడం, మద్యం సేవించడం, ఒకేచోట ఎక్కువ సేపు కూర్చుని ఉండే ఉద్యోగాలు చేయడం వల్ల న్యూరాలజీ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చేతులు కాలాక ఆకులు పట్టుకోకుండా.. ముందస్తుగా మేల్కొనాలి. దురలవాట్లకు చెక్ పెట్టాలి. వర్క్ ?స్టైల్‌నిమీ ఆరోగ్యానికి తగ్గట్టుగా డిజైన్ చేసుకోవాలి. ఆరోగ్యపరంగా ఏదైనా అసౌకర్యాన్ని గుర్తించిన వెంటనే వైద్యుణ్ని సంప్రదించాలి. పీడిస్తున్న మధుమేహంజీవనశైలి రుగ్మతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. కాస్త అలవాట్లు పక్కదారి పట్టినా.. మధుమేహం

దాడి చేస్తున్నది. గతేడాది యువ ఉద్యోగులు, విద్యార్థుల్లో మధుమేహం, ఊబకాయ సమస్య అనూహ్యంగా పెరగడం కనిపించింది. ఎండోక్రైనాలజీ విభాగం గణాంకాల ప్రకారం, టైప్–2 మధుమేహం యువతలో వేగంగా పెరుగుతున్నది. సుమారు 40 శాతం మందికి తమకు డయాబెటిస్ ఉందన్న విషయమే తెలియకపోవడం గమనార్హం. అంతేకాదు, మధుమేహ బాధితుల్లో 50 శాతం మందిలో వ్యాధి అస్సలు నియంత్రణలో ఉండటం లేదట. దీనివల్ల మూత్రపిండాల సమస్యలు, గుండె వ్యాధులు, సంతానలేమి తదితర సమస్యలు చాపకింద నీరులా విస్తరిస్తుండటం ఆందోళన కలిగించే అంశం. నెఫ్రాలజీ రికార్డుల ప్రకారం, డయాబెటిస్, హైపర్ టెన్షన్‌ను సమయానికి గుర్తించకపోవడం వల్ల యుక్త వయసులోనే తీవ్రమైన కిడ్నీ వ్యాధుల బారినపడుతున్నారు. వీటిని ప్రాథమిక దశలో గుర్తించి, తగిన చికిత్స తీసుకుంటే ప్రమాద తీవ్రత గణనీయంగా తగ్గుతుంది.

# డబుల్ డిన్నర్ ట్రబుల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆలస్యంగా తినడం అందరి సమస్యే. ఒక్కోసారి సమయం కలిసొచ్చి.. తినాల్సిన సమయం కంటే ముందే తింటారు. ఆలస్యంగా నిద్రపోవడం, రాత్రి పని చేసేవాళ్లకు అర్ధరాత్రి మళ్లీ ఆకలవుతుంది.రాత్రి రెండో డిన్నర్ లాగించేస్తారు. తరచుగా డబుల్ డిన్నర్ తినేవాళ్లకు ఆకలి సమస్యలు ఉంటాయి. నిద్రలేమి, అధిక బరువు అదనపు సమస్యలు తప్పవని ఆహార నిపుణులు హెచ్చరి స్తున్నారు.ఓటీటీలో షోలు చూస్తూ, థియేటర్లో సినిమాలు, క్రికెట్ మ్యాచ్‌లు, మ్యూజిక్ కాన్సర్ట్, ట్రావెల్, రాత్రి వేళ ఉద్యోగ విధులు చేసేవాళ్లలో చాలామంది డబుల్ డిన్నర్ సమస్య ఎదుర్కొంటున్నారు. డిన్నర్ సరైన సమయానికే చేసినా.. రాత్రి ఎక్కువ సమయం మేల్కొని ఉండటం వల్ల వీళ్లకు మళ్లీ ఆకలవుతుంది. అప్పుడు భోజనం, లేకపోతే ఇష్టమైన స్నాక్స్‌ని కడుపునిండా ఆరగిస్తారు. అప్పటికే మొదటి డిన్నర్ ద్వారా శరీరానికి కావాల్సినంత ఎనర్జీ అందుతుంది.(సెకండ్) డిన్నర్‌కి నిద్ర పోవడానికి మధ్య తక్కువ సవయం ఉంటే తిన్నది జీర్ణం కాదు. ఫలితంగా నిద్ర సరిగ్గా పట్టదు. రెండోసారి తిన్నది శరీర అవసరాలకు ఉపయోగపడదు. అప్పటికే మొదటి డిన్నర్ నుంచి తయారైన గ్లూకోస్ శరీరానికి కావాల్సిన శక్తినిస్తుంది. సెకండ్ డిన్నర్‌లో తిన్న ఆహారం జీర్ణమైన తర్వాత కొవ్వుగా మారి, శరీర బరువును పెంచుతుంది. పార్టీలు, స్నేహితులతో షికార్లు చేస్తూ డాబా హోటళ్లు, రెస్టారెంట్లలో అర్ధరాత్రి తినేవాళ్లలో చాలామంది డబుల్ డిన్నర్ ఆరగించేవాళ్లే! ఇలా తినడం సరదాగా ఉంటుంది. కానీ, ఆరోగ్యానికి మాత్రం తీవ్రంగా హాని చేస్తుంది.సమయానికి పడుకునేవాళ్లకు తొందరగా రాత్రి భోజనం చేయడం మేలు చేస్తుంది. కానీ, ఆలస్యంగా పడుకునేవాళ్లు తొందరగా భోజనం చేస్తే ఆకలి సమస్య, అమితంగా తినడం సమస్యలు తప్పవు. కాబట్టి పడుకునే వేళల్ని, తినే వేళల్ని వృత్తికి తగ్గట్టుగా మార్చుకోవాలి.ఎన్ని గంటలకు పడుకుంటారో, దానికి మూడు గంటల ముందు తినడానికి ప్లాన్ రెడీ చేసుకోవాలి.రాత్రివేళ ఒకేసారి తినే పద్ధతి పాటించాలి. పగలు తిన్నట్టుగా భోజనం తర్వాత మరేదీ తినకూడదు.తిన్న తర్వాత నడవడం, ఏదైనా చిన్న పని చేస్తూ ఉండాలి. అప్పుడు తిన్న ఆహారం జీర్ణమవుతుంది. అధిక బరువు, ఆకలి, నిద్ర సమస్యలు ఉండవు.రాత్రి భోజనంలో ప్రొటీన్, ఫైబర్, హెల్తీ ఫ్యాట్ ఉండేలా చూసుకుంటే తేలికగా జీర్ణమవుతుంది. ఆకలి సరిగా ఉంటుంది.

# బరువు తగ్గాలనుకునే వారికి అసలు గ్రీన్ టీ ఎలా సహాయం చేస్తుంది..



**హైదరాబాద్ పెన్ పవర్:** అధికంగా ఉండే మన శరీర బరువే అనేక అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. ఈ విషయాన్ని వైద్యులు తరుచూ చెబుతూ ఉండడంతో మనలో చాలా మందికి ఆరోగ్యం మీద స్పృహ వచ్చిందనే చెప్పవచ్చు.దీంతో శరీర బరువును అదుపులో ఉంచుకోవడానికి మనలో చాలా మంది అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. రోజూ వ్యాయామం చేయడం, కఠినమైన ఆహారాన్ని తీసుకోవడం, తగినంత నీటిని తాగడం, అధిక క్యాలరీలను తగ్గించడం, ఇష్టమైన ఆహారాన్ని వదులుకోవడం ఇలా అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. ఇక బరువు తగ్గాలని ఆహారాన్ని కూడా తక్కువగా తీసుకుంటూ ఉంటారు. దీంతో ఆకలితో అనేక బాధలు పడుతూ ఉంటారు. అయితే బరువు తగ్గాలనుకునే వారు అనవసరమైన ఆకలి బాధలు పడాల్సిన అవసరం లేదని వైద్యులు సూచిస్తున్నారు. అలాగే ఆకలి బాధలను నియంత్రించడానికి ఒక చిట్కాను కూడా చెబుతున్నారు.ఆకలిని నియంత్రిస్తుంది..బరువు తగ్గడానికి ప్రయత్నించే వారు గ్రీన్ టీని తీసుకోవడం మంచిదని వారు చెబుతున్నారు. గ్రీన్ టీ లో ఎపిగాల్లోకాచెటిన్ గాలేట్ ( ఇజిసిజి) అనే సమ్మేళనం ఉంటుంది. ఇది ఆకలిని నియంత్రించే అడిపోనెక్టిన్ అనే హార్మోన్ ను ఎక్కువగా ఉత్పత్తి చేయడంలో సహాయపడుతుంది. ఆకలి నియంత్రణలో ఉండడం వల్ల అతిగా తినాలనే కోరిక తగ్గుతుంది. చాలా మంది బరువు తగ్గాలనుకున్నప్పటికీ ఆకలిని నియంత్రించుకోలేక ఏదో ఒకటి తింటూ ఉంటారు. అలాంటి వారు గ్రీన్ టీని తీసుకోవడం వల్ల ఆకలి తగ్గి బరువును అదుపులో ఉంచుకోగలుగుతారు. అలాగే కొందరిలో విపరీతమైన ఆకలి ఉంటుంది. ఆకలిని వాళ్లు అస్సలు తట్టుకోలేక ఎప్పుడూ చూసినా తింటూనే ఉంటారు. అలాంటి వారు కూడా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల మంచి ఫలితం ఉంటుంది.చక్కెర స్థాయిలు అదుపులో..మీరు ఆకలిని నియంత్రించుకోవాలనుకుంటే ఇజిసిజి అధికంగా ఉండే గ్రీన్ టీని తాగడం మంచిది. అంతేకాకుండా గ్రీన్ టీని తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. గ్రీన్ టీని తీసుకోవడం వల్ల కొలెస్ట్రాల్ స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.బరువు తగ్గాలనుకునే వారు గ్రీన్ టీని తాగడంతో పాటు అనవసరమైన ఆకలిని నియంత్రించుకోవడానికి భోజనానికి ముందు ఇసాబ్‌గోల్ తీసుకోవడం చేయాలి. అలాగే ఆహారంలో ఎక్కువగా ప్రోటీన్, ఫైబర్ ఉండేలా చూసుకోవాలి. దీంతో ఎక్కువ సమయం ఆకలి అవ్వకుండా ఉంటుంది. చిరుతిండి తినాలనే కోరిక తగ్గుతుంది. బరువు తగ్గాలనుకునే ప్రయాణానికి ఆకలి బాధలు అడ్డుగా ఉండకూడదు అనుకునే వారు ఆకలిని నియంత్రించుకోవాలనుకునే వారు ఈ చిట్కాను పాటించడం మంచిది.

**పొట్ట చుట్టూ సమస్యలే**

ఫ్యాటీ లివర్, కొలొరెక్టల్, పేగు సంబంధిత వ్యాధులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. అధిక క్యాలరీలతో కూడిన ఆహారం, ప్రాసెస్డ్ ఫుడ్స్, మద్యపానం, అస్థిర జీవనశైలి తదితర కారణాలతో ఈ సమస్యలు యువతలోనే ఎక్కువగా చూస్తున్నాం. మన దేశంలో నమోదవుతున్న కొలొరెక్టల్ క్యాన్సర్ కేసుల్లో 30–40 శాతం మంది 50 ఏళ్లలోపు వారే ఉండటం ఆందోళన కలిగించే అంశం.

**క్యాన్సర్ దాడి**

ఈ మధ్య కాలంలో బ్రెస్ట్, ఒవేరియన్, గ్యాస్ట్రో ఎంటెస్టినల్ వంటి క్యాన్సర్లు ఎక్కువగా యువతలోనే కనిపిస్తున్నాయి. వయసుతో సంబంధం లేని ఈ వ్యాధిపై జన్యు లక్షణాలు, జీవనశైలి, పర్యావరణ ప్రభావాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. మొత్తంగా చూస్తే, గుండె, మెటబాలిక్, కాలేయం, మూత్రపిండాలు, న్యూరాలజీ, జీర్ణవ్యవస్థలకు సంబంధించిన నివారించగల దీర్ఘకాలిక వ్యాధుల్లో 10–15 శాతం పెరుగుదల కనిపిస్తుంది. వీటిలో చాలా వ్యాధులను ప్రారంభదశలో స్క్రీనింగ్, జీవనశైలి మార్పులు, సమయానికి వైద్య పరీక్షల ద్వారా నివారించగలిగినవే.

**వారిపై తీవ్ర ప్రభావం**

మారుతున్న జీవనశైలి, పని ఒత్తిడి కారణంగా కొన్ని రంగాల్లో పనిచేసే ఉద్యోగులు తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. అందులో ముఖ్యంగా ఐటీ, సాఫ్ట్‌వేర్ రంగాల్లో పని చేసే యువత రోజుకు పది గంటలకు పైగా ఒకే చోట కూర్చుని పనిచేయడం, సరైన వ్యాయామం లేకపోవడం, ఎక్కువగా జంక్ ఫుడ్, ప్రాసెసింగ్ ఫుడ్‌పై ఆధారపడటం వల్ల అనారోగ్య సమస్యల్లో చిక్కుకుంటున్నారు. దేశ జీడీపీ, అభివృద్ధికి వెన్నెముకగా ఉండాల్సిన యువత అనారోగ్యం పాలవ్వడం దేశ భవిష్యత్తుకే ముప్పుగా పరిణమిస్తున్నది. ఈ అంశాన్ని ప్రతిఒక్కరూ ఒక సామాజిక బాధ్యతగా గుర్తించాలి. జబ్బు వచ్చిన తర్వాత చికిత్స చేయడం కంటే, జబ్బు రాకుండా చూసుకోవడం ప్రధానం అని గ్రహించాలి. జీవనశైలిలో మార్పుల ద్వారా వ్యాధులను వృద్ధాప్యం వరకు వాయిదా వేయవచ్చు.

**ఆర్థికంగా దెబ్బ**

కార్పొరేట్ ఎంప్లాయి మొదలుకొని, సాధారణ ఉద్యోగి వరకు ఆరోగ్య బీమాపై అవగాహన కలిగి ఉంటున్నారు. ఉద్యోగంలో చేరగానే.. హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారు. అయితే హెల్త్ ఇన్సూరెన్స్ చికిత్సకు అయ్యే ఖర్చును భరిస్తుందేమో కానీ, వ్యాధులను రాకుండా అడ్డుకోదు కదా! ఇక ఇన్సూరెన్స్ లేనివారి పరిస్థితి అగమ్య గోచరం. ఒక వ్యక్తి ఆస్పత్రి పాలైతే.. ఆ భారం కుటుంబం అంతా మోయాల్సి వస్తుంది. తీవ్రమైన వ్యాధులు తలెత్తితే.. ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగులుతుంది. ఇలా జరగొద్దంటే?ఆరోగ్యమే మహాభాగ్యం అని గుర్తించాలి. అందుకు తగ్గ జీవనశైలిని పాటించాలి. వ్యాధులను ప్రారంభదశలోనే గుర్తించడం వల్ల.. పెను ముప్పును తప్పించుకోవచ్చు.

# 14 రోజులు మానేస్తే..



**హైదరాబాద్ పెన్ పవర్:** పంచదార మన ఆరోగ్యానికి హానికరమని తెలిసినా అదేమీ పట్టించుకోకుండా టీ, కాఫీ, ప్రాసెస్డ్ ఫుడ్స్ పేరుతో ఏదో ఓ రూపంలో తినేస్తుంటారు. అతిగా తీసుకుంటూ బరువుతో పాటు షుగర్ లెవల్స్ పెంచుకుంటూ చాలామంది అనారోగ్యానికి గురవుతుంటారు.అయితే చక్కెరను కనీసం 14 రోజులు పూర్తిగా మానేస్తే ఎలాంటి లాభాలు ఉంటాయో తెలుసుకుందాం.తినే పదార్థాల్లో చెక్కర వేసుకోవడం వల్ల కేవలం కేలరీలు మాత్రమే పెరుగుతాయనుకుంటారు. అది మాత్రమే కాదు ఆకలి, క్రేవింగ్స్, ఇన్సులిన్, లివర్ ఫ్యాట్ లాంటి ఎన్నో సమస్యలు మెల్లగా అంటుకుంటాయి. అయితే, చక్కెరకు దూరంగా ఉండటం చెప్పినంత తేలిక కాదు. షుగర్ మానేయగానే ముందుగా క్రేవింగ్స్ పుడతాయి. దీంతోపాటు తలనొప్పి, అలసట, ఇరిటేషన్, మెదడు పనితీరు తగ్గడం వంటి సమస్యలూ పలకరిస్తాయి. ఎప్పుడెప్పుడు చక్కెరను నోట్లో వేసుకుందామా అనిపిస్తుంటుంది.అయితే, కాస్త ఓపిక పడితే చక్కెరను దూరం పెట్టమని మన శరీరానికి మెదడు చెబుతుంది. అలా ఓ 14 రోజులు చక్కెరకు పూర్తి దూరం పాటిస్తే? బెల్లీ ఫ్యాట్ తగ్గుతుంది. నిద్ర నాణ్యత పెరుగుతుంది. ఫాస్టింగ్ గ్లూకోజ్ ఇంప్రూవ్ అవుతుంది. మెటబాలిజంలో మార్పు వస్తుంది. లివర్ షుగర్ తగ్గుతుంది. చక్కెర మానేయడం పెద్ద కష్టమేమీ కాదు. రోజంతా ఉపవాసం ఉండాల్సిన అవసరం లేదు. పండ్లు పుష్కలంగా తినొచ్చు. ఆహారం తీసుకోవచ్చు. చక్కెర, చెక్కరతో చేసిన పదార్థాలకు మాత్రం దూరం పాటిస్తే సరి. ఈ పద్నాలుగు రోజులు సాఫ్ట్‌డ్రింక్స్, జ్యూస్‌లు, స్వీటెన్డ్ ఆల్కహాల్ లాంటి వాటిని తీసుకోవద్దు. ఒకసారి ప్రయత్నించి చూడండి.

# విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ కుర్రాడి విధ్వంసం.. డబుల్ సెంచరీ బాదిన అమన్ రావ్

- బెంగాల్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగిన 21 ఏళ్ల యువ కెరటం
- ఆడుతున్నది మూడో లిస్ట్ ఏ మ్యాచ్‌లోనే ఈ అరుదైన ఫీట్
- 150 నుంచి 200 పరుగులు కేవలం 20 బంతుల్లోనే పూర్తి
- ఇటీవల ఐపీఎల్ వేలంలో అమన్ రావ్‌ను కొన్న రాజస్థాన్ రాయల్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ యువ బ్యాటర్ అమన్ రావ్ పేరాల సంచలనం సృష్టించాడు. బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి డబుల్ సెంచరీతో కదం తొక్కాడు. నిరంజన్ షా స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో తాను ఆడుతున్న మూడో లిస్ట్ ఏ మ్యాచ్‌లోనే ఈ అద్భుత ఘనతను సాధించడం విశేషం. ఇన్నింగ్స్ ఆరంభంలో నెమ్మదిగా ఆడిన 21 ఏళ్ల అమన్, తొలి 10 బంతుల్లో 3 పరుగులే చేశాడు. ఓపెనర్ రాహుల్ సింగ్‌తో కలిసి కీలక భాగస్వామ్యం నెలకొల్పిన తర్వాత గేరు మార్చాడు. 65 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న అతను, 107 బంతుల్లో తన తొలి లిస్ట్ ఏ శతకాన్ని అందుకున్నాడు. శతకం తర్వాత అసలు విధ్వంసం మొదలుపెట్టాడు. 150 పరుగుల మార్కును 134 బంతుల్లో దాటిన అమన్, ఆ తర్వాత మరో 20 బంతుల్లోనే 200 పరుగుల మైలురాయిని చేరుకోవడం అతని దూకుడుకు నిదర్శనం. చివరి ఓవర్‌లో డబుల్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అతని ఇన్నింగ్స్‌లో 12 ఫోర్లు, 13 భారీ సిక్సర్లు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో హైదరాబాద్ జట్టు 5 వికెట్ల నష్టానికి 352 పరుగుల భారీ స్కోరు సాధించింది. విజయ్ హజారే ట్రోఫీ చరిత్రలో ఇది కేవలం తొమ్మిదో డబుల్ సెంచరీ కాగా, లిస్ట్ ఏ ఫార్మాట్‌లో ద్విశతకం సాధించిన 15వ భారత బ్యాటర్‌గా అమన్ రికార్డు సృష్టించాడు. గత డిసెంబర్‌లో జరిగిన ఐపీఎల్ 2026 వేలంలో అమన్‌ను రాజస్థాన్ రాయల్స్ జట్టు రూ.30లక్షలకు కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే.

# కంబ్యాక్ లో అదరగొట్టిన అయ్యర్, సిరాజ్.. గిల్, జైశ్వాల్, రాహుల్ ఫ్లాప్






**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ తో జరగబోయే వన్డే సిరీస్ కు ముందు టీమిండియా క్రికెటర్లు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. డొమెస్టిక్ క్రికెట్ లో జరుగుతున్న విజయ్ హజారే ట్రోఫీలో మ్యాచ్ లు ఆడుతూ ఫామ్ లోకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు. సీనియర్ ప్లేయర్స్ రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ మినహాయిస్తే దాదాపు అందరూ టీమిండియా క్రికెటర్లు మంగళవారం (జనవరి 6) విజయ్ హజారే ట్రోఫీలో మ్యాచ్ ఆడారు. గాయం నుంచి కోలుకున్న శుభమాన్ గిల్, శ్రేయాస్ అయ్యర్ తో పాటు జైశ్వాల్, కేఎల్ రాహుల్, మహమ్మద్ సిరాజ్ మ్యాచ్ ఆడారు. వీరిలో ఎవరు విఫలమయ్యారో.. ఎవరు బాగా ఆడారో ఇప్పుడు చూద్దాం..

రీ ఎంట్రీ లో ముంబై కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టిన శ్రేయాస్ అయ్యర్ తొలి మ్యాచ్ లో హాఫ్ సెంచరీతో రాణించాడు. హిమాచల్ ప్రదేశ్ పై 82 పరుగులు చేసి అదరగొట్టాడు. ముంబై టాప్ స్కోరర్ అయ్యర్ కావడం విశేషం. ఈ ఇన్నింగ్స్ తో న్యూజిలాండ్ తో సిరీస్ కు ముందు అయ్యర్ ఫామ్, ఫిట్ నెస్ పై ఉన్న సందేహాలు తొలగిపోయాయి.

**శుభమాన్ గిల్:**
టీమిండియా కెప్టెన్ శుభమాన్ గిల్ ఇంకా గాడిలో పడలేదు. పేలవ ఫామ్ కారణంగా టీ20 జట్టులో స్థానం కోల్పోయిన గిల్.. గాయం తర్వాత కోలుకొని ఆడిన తొలి మ్యాచ్ లో 11 పరుగులే చేసి నిరాశపరిచాడు. ఆస్ట్రేలియా సిరీస్ తర్వాత సౌతాఫ్రికాతో వన్డే సిరీస్ కు దూరమైన గిల్.. న్యూజిలాండ్ తో జరగబోయే సిరీస్ లో టీమిండియా వన్డే జట్టుకు కెప్టెన్ గా వ్యవహరించనున్నాడు.

**కేఎల్ రాహుల్:**
వికెట్ కీపర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ విజయ్ హజారే ట్రోఫీలో విఫలమయ్యాడు. రాజస్థాన్ పై కేవలం 25 పరుగులే చేసి ఔటయ్యాడు. రాహుల్ భారత వన్డే జట్టులో ప్రధాన వికెట్ కీపర్. ప్లేయింగ్ 11 లో ఖచ్చితంగా అంటాడు. కేఎల్ ప్రస్తుతం వన్డే, టెస్ట్ ఫార్మాట్ లో ఆడుతున్నాడు. టీ20ల్లో ఈ వెటరన్ ప్లేయర్ కు ఛాన్స్ దక్కడం లేదు.

**యశస్వి జైశ్వాల్:**
విజయ్ హజారే ట్రోఫీలో జైశ్వాల్ నిరాశపరిచాడు. హిమాచల్ ప్రదేశ్ తో జరిగిన మ్యాచ్ లో కేవలం 15 పరుగులే చేసి పెవిలియన్ కు చేరాడు. టీమిండియా బ్యాకప్ ఓపెనర్ యశస్వి జైస్వాల్ గత నెలలో సౌతాఫ్రికాపై జరిగిన చివరి వన్డేలో సెంచరీతో సత్తా చాటిన సంగతి తెలిసందే. దీంతో కివీస్ తో జరగబోయే సిరీస్ లో బ్యాకప్ ఓపెనర్ గా స్థానం సంపాదించుకున్నాడు.

**మహమ్మద్ సిరాజ్:**
చాలా నెలల తర్వాత భారత వన్డే జట్టులో స్థానం సంపాదించిన ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్.. న్యూజిలాండ్ తో సిరీస్ కు ముందు ఫామ్ లోకి వచ్చాడు. విజయ్ హజారే ట్రోఫీలో బెంగాల్ తో జరిగిన మ్యాచ్ లో మూడు వికెట్లు పడగొట్టి రాణించాడు. కివీస్ తో జనవరి 11 నుంచి జరగబోయే వన్డే సిరీస్ లో సిరాజ్ ప్లేయింగ్ 11 లో ఉండడం దాదాపు ఖాయమైంది.

# హైదరాబాద్ బౌలింగ్ ఆశాకిరణం.. నెట్స్‌లో దినేశ్ కార్తీక్‌ను బెంబేలెత్తించిన SRH బౌలర్..




**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో సన్ రైజర్స్ హైదరాబాద్ బౌలింగ్ లో బలహీనంగా ఉన్న సంగతి తెలిసిందే. బ్యాటింగ్ లో హైదరాబాద్ జట్టుకు తిరుగు లేదు. టాపార్డర్, మిడిల్ ఆర్డర్ పవర్ హిట్టర్లతో నిండిపోయింది. ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మతో పాటు క్లాసన్, లివింగ్ స్టోన్, ఇషాన్ కిషాన్, నితీష్ కుమార్ రెడ్డి జట్టులో ఉన్నారు. వీరందరూ అంతర్జాతీయ క్రికెట్ లో స్టార్ హిట్టర్లుగా పేరొందినవారే. అయితే సన్ రైజర్స్ అసలు సమస్య అంతా బౌలింగే. కెప్టెన్ పాట్ కమ్మిన్స్ మినహాయిస్తే మిగిలివారికి అనుభవం లేదు. హర్షల్ పేటల్, ఉనాద్కట్ గతంలో రాణించినా ప్రస్తుతం ఫామ్ లేక ఇబ్బంది పడుతున్నారు.

బౌలింగ్ గురించి ఆందోళన చెందుతున్న సమయంలో సన్ రైజర్స్ కు బీహార్ ఫాస్ట్ బౌలర్ సాకిబ్ హుస్సేన్ ఆశాకిరణంగా కనిపించాడు. ఐపీఎల్ వేలంలో సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టు సాకిబ్ హుస్సేన్ ను రూ.30 లక్షల రూపాయలకు కొనుగోలు చేసింది. పెద్దగా అంచనాలు లేకుండా జట్టులోకి వచ్చిన సాకిబ్ సంచలనంగా మారేలా కనిపిస్తున్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ (రా=ఎ) తరఫున బరిలోకి దిగనున్న సాకిబ్ నెట్స్‌లో నిప్పులు చెరుగుతున్నాడు. ప్రాక్టీస్ సెషన్ లో భాగంగా స్వింగ్, బౌన్సర్లతో విరుచుకుపడుతున్నాడు. నెట్స్ లో వెటరన్ ఫినిషర్ దినేశ్ కార్తీక్ సైతం సాకిబ్ హసన్ బౌలింగ్ ఆడలేకపోతున్నాడు. బంతి అనూహ్యంగా స్వింగ్ అవ్వడంతో పాటు బౌన్స్ కూడా అవుతుంది. తన బౌలింగ్ తో దినేష్ కార్తీక్ ను బెంబేలెత్తించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సాకిబ్ సూపర్ బౌలింగ్ చూసి సన్ రైజర్స్ ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. ఈ మెరుపు బౌలింగ్ చూసి ఖుషీ అవుతున్న కావ్యా మారన్ అండ్ టీమ్, ఎస్ఆర్‌హెచ్ బౌలింగ్ బలహీనతలకు సాకిబ్ చెక్ పెడతాడని ఆశిస్తున్నారు. ఐపీఎల్ లో గతంలో సాకిబ్ కోల్ కతా నైట్ రైడర్స్ మత్తులో ఉన్నాడు. 21ఏళ్ళ ఈ పేసర్ కు ఒక్క మ్యాచ్ లో కూడా ఆడే అవకాశం రాలేదు. మరి సన్ రైజర్స్ అవకాశం ఇస్తుందా ఇస్తే ఎలా ఆడతాడో ఆసక్తికరంగా మారింది.

# మూడో సీజన్ కు రెడీ అవుతున్న సూపర్ హిట్ వెబ్ సిరీస్



నోరా ఫతేహి గోల్డ్-కాంస్య కార్సెట్ గౌనులో స్టన్స్





ఆషికా రంగనాథ్ అద్భుతమైన బీచ్ లుక్‌తో ట్రాపికల్ బ్లిస్‌లో మునిగిపోయింది

భాషతో సంబంధం లేకుండా ఓటీటీ ఆడియన్స్ ను ఎన్నో వెబ్‌సిరీస్‌లు విశేషంగా అలరిస్తున్నాయి. అలా 2022లో వచ్చిన తమిళ వెబ్‌సిరీసే సుజల్: ది వొర్టెక్స్. కాథిర్, ఐశ్వర్యా రాజేష్, ఆర్. పార్తిబన్, హరీష్ ఉత్తమన్, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో ఈ వెబ్ సిరీస్ రూపొందింది. క్రైమ్ థ్రిల్లర్ వెబ్‌సిరీస్‌గా వచ్చిన దీన్ని పుష్కర్– గాయత్రి కలిసి సృష్టించారు.

**మొదటి రెండు సీజన్లకు మంచి రెస్పాన్స్**

అయితే ఇప్పటికే సుజల్ నుంచి రెండు సీజన్లు రిలీజవగా, సౌత్ ఇండియన్ వెబ్ సిరీస్‌ల్లో దీనికి ఆడియన్స్ నుంచి మంచి ఆదరణ దక్కింది. మొదటి రెండు సీజన్లు అమెజాన్ ప్రైమ్ వీడియోలో అందుబాటులో ఉన్నాయి. ఆల్రెడీ రిలీజైన రెండు సీజన్లకు స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్ లో మంచి వ్యూస్ తో పాటూ ఆదరణ కూడా సొంతం చేసుకున్నాయి. ఇదిలా ఉంటే ఈ వెబ్ సిరీస్ గురించి ఇప్పుడో ఇంట్రెస్టింగ్ అప్డేట్ వినిపిస్తోంది.

**సుజల్ మూడో సీజన్ పై వర్క్ చేస్తున్న మేకర్స్**

నిర్మాతలు ఈ వెబ్ సిరీస్ యొక్క మూడో సీజన్ పై వర్క్ చేస్తున్నారని, దానికి సంబంధించిన షూటింగ్ 2026 ఆగస్ట్ నుంచి మొదలవుతుందని చెప్తున్నారు. కాగా దీనిపై మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. సుజల్: ది వోర్టెక్స్ మొదటి రెండు సీజన్లకు బ్రహ్మ జి, అనుచరణ్ మురుగయ్యన్, సర్జున్ దర్శకత్వం వహించగా, వాల్ వాచర్ ఫిల్మ్స్ నిర్మించింది. తమిళంతో పాటూ 30 భాషల్లో రిలీజైన ఈ సిరీస్ మంచి సక్సెస్ ను అందుకోవడంతో పాటూ ఎన్నో ఓటీటీ అవార్డులను కూడా సొంతం చేసుకుంది. సామ్ సి.ఎస్ నేపథ్య సంగీతం అందించిన ఈ సిరీస్ తమిళంతో పాటూ తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో రిలీజ్ కాగా, ఈ సిరీస్ కు పుష్కర్– గాయత్రి అందించిన స్క్రీన్ ప్లే మేజర్ ప్లస్ పాయింట్ గా నిలిచింది. సిరీస్ లోని ట్విస్టులు ఆడియన్స్ ను విపరీతంగా అలరిస్తాయి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965